ప్రపంచ ప్రతిఘటనా సాంతం
క్రమశిక్షణ నేర్పే బాట్లు ఉన్నా ఇమిడివుంది

ఆగస్టు పదిహేను స్వర్గాన్ని చెప్పకపోతా
అన్నం సహించదు నాకు

సృజన

ఏ రోజైనా
ప్రజా పోరాటాల విజయాల్ని రచించకపోతా
ఆ రోజు జీవించి నట్టుండదు



ఈ మట్టి నాకు
పట్టెడన్నం పెట్టి పాలు తాపిం
కాలేజ్ సభా స్వాతంత్ర్యపు కొ
చనను విముక్తి చేసి
ఋణం తీర్చు కొంటాను

విప్లవవీరుల త్యాగాల నెత్తుటి జ్వా
గమ్యాన్ని చూపే అది వరకూ కొనసాగమంది
గొంతులో ఊపిరి ఉన్నంతవరకు
మదిలో గానమాల మెదిలేంత వరకు
ఈ బాధ్యతను ప్రాణమానంగా స్వీకరిస్తాను

సృజన

ఆధునిక సాహిత్య వేదిక


141 మాసపత్రిక జులై 1983

గత సంచికలో శ్రీ శ్రీ ఫోటోలు, కరీంనగర్ సభల ఫోటోలు, ఈ సంచిక బ్యాక్ కవర్ ఫోటో శ్రీ భరత్ భూషణ్.

నిర్వహణ

'సాహితీ మిత్రులు'

సంవత్సర చందా రు. 20 ఈ సంచిక రు. 3


సృజన

ఊపిరికొస రెపరెపలాడుతున్న దీపాన్ని
నెత్తురొలికి నిలబెట్టావు
ప్రజల ఆటను పాటను
నాభినుంచి స్వరపేటిక దాకా
నాదంనుంచి నిశ్శబ్దం దాకా
ప్రాణాలు కరిగించి నిర్మించావు


ప్రాణాన్నిచీల్చిన కత్తిని పాటలా స్వీకరించావు
రణంలో పాటను కత్తిలా ఝుళిపించావు

జననమరణాల తీరాలు దగ్గరైనపుడు
సార్థకతలోకి పరవళ్ళుతొక్కిన ప్రవాహానివి
ఓటమి నిర్ధారణ అయినపుడు కూడ
ఒక్క ఆయుధాన్నీ ఉపసంహరించకుండా
మృత్యువుపైకి విసిరిన యోధునివి


క్షతగాత్రమైన మృత్యువు ఇంకా
నువు చేసిన గాయాలను సాకుతూ
నీ అవహేళనకు ఆక్రోశపడుతున్నది

శిథిలమవుతున్న వ్యవస్థ ఇంకెన్నోరెట్లు
మా చైతన్యంలో గుణించబడుతున్న
నిన్ను చూసి మన్నుకరుస్తున్నది


— వరవరరావు




చెర తలిదండ్రులు : శివారెడ్డి, బాలనరసమ్మ



1964 లో....




జీవితంలో, మృత్యుముఖంలో తనను కంటికి రెప్పలా చూచుకొన్న
శ్రీమతి శ్యామలా చెరబండరాజు




మహాకవి శ్రీశ్రీ, తన దిగంబర కవితోద్యమ సహచరులు
నగ్నముని, జ్వాలాముఖి, నిఖిలేశ్వర్లతో చెర




విరసం సంస్థాపకసభ (ఖమ్మం)లో ప్రసంగిస్తున్న చెర




ప్రస్థానం పుస్తకావిష్కరణ సందర్భంగా :
కా॥ కె. వి. రమణారెడ్డి, డా॥ రాజిరెడ్డిగార్లతో....




చెర, శ్యామల, ఉదయిని, కిరణ్




అధ్యయనంలో





1. పాణిగ్రాహి నగర్‌లో (1970)

2. గాంధీ రోగనిలయంలో (1982)



ముప్పైఏళ్ళ జీవితంలో
ఎన్నియుగాలు విస్తరించినావు కామ్రేడ్!
మృత్యుకోరలమీద నర్తిస్తూ
ఎంతజీవితాన్ని నిర్వచించినావునేస్తం !


బతుకు నిలుపుకోవాలని
పోరాటం నిద్రపోరాదని
మృత్యువుతో పెనుగులాడుతూ
ఆసుపత్రి మంచంలో
అరనిమిషం కనులుతెరచి
అందించిన నీ కరచాలనంలో
ఎన్నివెన్నని ఆశల ఆకాంక్షల
విశ్వాసాలో !
ఎంతపదునైన పోరాట సంకల్పమో !

సంకెళ్ళకు నీవునేర్పిన సంగీతం
ఉరికంబంమీద ఉజ్వలగీతానికి
నీవు అందించిన లాల్‌సలామ్
ఎలా మరచిపోను కామ్రేడ్ !

చెరా !
జనంచెరను విడిపించగ
క్షణం క్షణం పోరినావు
కణం కణం కాలినావు
మరణంతో పోరాట చరణాలతో
రాపాడినావు
పోరాటకెరటంలో పల్లవించినకవీ !

ఆరాటపు బతుకులలో
అంటుకున్న కొలిమిలో
రోజు రోజూ రాజుకునేదెబ్బలో
విరసం కళ్ళలో
కళ్ళలోని కలలలో
నిన్ను చూస్తున్నాను.

— లోచన్



నీ మృత్యువుతో
ఈ వర్షం లావాయై పొరలింది
చైతన్య దిక్కులనుంచి
గంధకధూమం ఎగిసింది
నలుదిక్కులా
ఉక్కును ముక్కలు చేసిన వాసన కమ్మింది
కనిపించనివి ఏవే మసకమసక విధ్వంసనదృశ్యాలో
జైలు కటకటాలా
సంకెళ్లా
మనస్సు నావరించిన భీరత్వపు గొలుసులా
నోటికీ, కలానికీపడ్డ తాళాలా
లేదా అన్నీ ఒక్కసారేనా

నాకో చీకటికొట్టు కనిపిస్తున్నది
దాని ఉక్కుగోడలమీద
బొట్లు బొట్లుగా కారిన నీ నెత్తురు చేసిన రంధ్రాలనుంచి

కిలకిలలాడే పక్షులస్వేచ్ఛా తరంగాల్లో పుష్పిస్తున్న
సమస్త ఆకాశం తొంగిచూస్తున్నది

ఒక విప్లవకారుని మరణంతో
ఎందరు మృతులు సజీవులవుతారో
ఎవరికీ తెలుసు
అచేతన సమాజం లేచినిలుస్తుంది
అతని నరాల్లో నెత్తురాగితే
కోట్లాది రక్తనాళాల్లో ఆగిననెత్తురు ప్రవాహమౌతుంది

నాముందు ఊగుతూ విస్తరిస్తున్న పొలాలు
నిప్పులు చిమ్ముతూ నింగికెగుస్తున్న మొహాలు
విప్పారుతూ పొంగిపోతున్న గుండెలు

నాకు తూటాలశబ్దం వినవస్తున్నది
చెయ్యివిపిరి చిన్నపురుగును పట్టుకున్నట్లు
ఆ శబ్దాన్ని కమ్మేసిన గర్జనకూడ వినఃపిస్తున్నది

నేను నిన్ను చూడలేదు
ఎడదల్లో ఎడారులు
ఆలోచనల్లో అరణ్యాలు
కడుపులో ఆకలి పర్వతాలు
కళ్ళల్లో నదులు
శ్వాసల్లో తుపానులు
స్వరంలో బంధించబడ్డ పొలికేకలు
చేతివేళ్ళపై
ఆటవిక మృగాల పంజాదెబ్బల గుర్తులు
పాదాలు రేపుతున్న ధూళిలో
బీళ్ళైన ఊళ్ళ దుఃఖాలమధ్యవెక్కిళ్ళు
వేస్తున్న ప్రతిఅడుగునూ
తోసేస్తున్న అన్యాయ సముద్రాలమీంచి వీచేతేమగాలి
ఉన్న ఆ ఆవాసాలలో

నేను నీవెంట తిరుగలేదు
నువ్వు కాగడా అందుకొని సాగిపోయినబాట
మనసుచీకట్లను కాంతిపుంజాలతో నింపినచోట

విప్లవకారుడు మరణించినపుడు
మూగచరిత్రకు మాటలు వస్తాయి
భూగోళం ఒక్కచోటికి ఒదుగుతుంది
ప్రకృతి అతడు రాసిన గీతాలనాలపిస్తుంది
ప్రతి గుండెమీంచి బరువుబండలు తొలగిపోతాయి

నువ్వు మరణించిన తర్వాత
నువ్వు నాతో మాట్లాడుతున్నట్లు
నాదగ్గరకూర్చున్నట్లు అనిపిస్తున్నది

ముందర మంటలమీద కాపిన
విశాలమైన డప్పు ఒకటి వున్నది
లెక్కలేనన్ని చేతులు దానిని మోగిస్తున్నాయి
వేలకంఠాలు దానిమీద
స్వేచ్ఛాగీతాలు ఆలపిస్తున్నాయి
నాకాభాష తెలియదు
కాని ఆ సందేశాన్ని
ఈ వర్షంలో గొడుగులా పట్టుకుంటాను

విప్లవకారుడు మరణించినపుడు
భాషాగోడలు కూలిపోతాయి
జాతి, ప్రాంతం, రాష్ట్రం
సరిహద్దులు చెరిగిపోతాయి

తిరుగుబాటును ఇష్టమైన పక్షిలా
భుజాలమీద కూర్చోపెట్టుకొని
నేను నీవెంట
లేచినడుస్తూవుంటాను
నినాదాలను క్రియలుగా మారుస్తూ

ఈ వర్షం
నీ మృత్యువుతో లావాయై పొరలింది
మరిమేము, ఉక్కుగా మారాము.
బంధనాలు విరిగిపోతున్నాయి
తొందర్లోనే ఈ గంధకధూమం
నీలలహరిలో ఒళ్ళువిరుచుకునే
అగ్నిశిఖలుగా మారిపోతుంది
బానిస సంస్కృతి దగ్ధమవుతుంటే
వెలువడే ఒక వాసన
ఈ నేలంతా వ్యాపిస్తుంది

విప్లవకారుడు మరణించినపుడు
నిరీక్షించే అవధి
దగ్గరపడుతుంది


నీ మృత్యువుతో
ఆ ఆవాసంలోని తేజస్సు
మరింత దగ్గరగా కనిపిస్తున్నది
చెర బండ రాజుకుంటున్నది
(అది నీపేరు)
పాకుతూ పాకుతూ
భూమిని సమతలంచేసికానీ అదిలగదు
లక్షల చితిమంటల్లోంచి
ఎగసిన శ్వేతాగ్నివలె
శతాబ్దాలదాకా జ్వలిస్తూ నవ్వుచూస్తూ వుంటావు-
మా అందరినీ
మా చేతుల్లో
నువ్వు అందించిపోయిన
ఈ విప్లవ కేతనాన్ని

— సర్వేశ్వర్ దయాల్ సక్సేనా

అంపశయ్యపై మేనువాల్చి
తన కపాలంలోని రక్తంలో
కంటకాన్ని ముంచి
జన హృదయంపై
చెరబండరాజు రాసిన
చరమగీత సౌందర్యాన్ని
నా మునివేళ్ళతో తాకాలని
వృధా ప్రయత్నం చేస్తున్నాను

ఈ దేశాన్ని
కష్టజీవులకు అంకితంచేస్తో
ఆనందం తొణికిసలాడే నేత్రాలతో
అతను రాసిన విలువైన వీలునామాను
శత్రుబారి పడకుండా
భద్రపరుస్తున్నాను

— శివసాగర్



నెత్తుటికళ్లలో ఎత్తినజెండా

శ్యామల

చెరగురించి నన్ను రెండుమాటలు మాట్లాడమన్నారు. ఏంమాట్లాడను. మాట్లాడాలంటే చాలభయంగావుంది. బాధగావుంది. ఆయన రాసినకవిత్వం, పాటలు చాల సహజంగా, అందరికీ అర్థమయ్యేరీతిలో, ముఖ్యంగా కష్టజీవులగురించి, కార్మికుల గురించి రాసేవాడు. తాను ఎప్పుడూ పేదవాళ్ళగురించి ఆలోచిస్తూఉండేవాడు. యింట్లోవున్నా బయటవున్నా, బస్సులోవున్నా, సైకిలుమీదున్నా, ఎక్కడవున్నాకూడ ఆయనకు అదేఆలోచన. అట్లా ఆలోచిస్తూ, ఆలోచిస్తూ ఒకసారి లారీయాక్సిడెంట్ అయింది.

ఆయన రాసిన మాటలు, పాటలు మనందరినీ కదిలిస్తాయి. అట్లాగే ఒకపాట "ఇంటింట చీకటే ప్రతికంట కన్నీరె రాజ్యమెవరికి వచ్చెనో, సుఖములెవరికి దక్కెనో అనే ఈ పాట పేదవాళ్ళ కన్నీళ్ళగురించి, ఇంటింటఉండే చీకటిగురించి రాసాడాయన. మరి యింటింటి చీకటిని తొలగించాలంటే మనమంతా కృషిచేయాలి. మన యింట్లో దీపం మనమే వెలిగించుకోవాలి. దానికిమనం పాటుపడాలి. యదార్థంగా చెరనడిచిన బాటలో మనమంతానడుస్తాం. పేదవాళ్ళగురించి, పేదవాళ్ళ కష్టాలగురించి ఆయనబాటలో నడుస్తూ ముసుముందుకే పోతామని ఆశిస్తాను.

చెర సంవత్సరకాలం హాస్పిటల్లోవుండి నానాఅవస్థలు పడ్డాడు. అదీ మాటల్లోచెప్పలేనునేను. పెద్దవాళ్ళంటారే, 'పిట్టఘోష అనుభవించాడు' అని. పిట్టఘోష అంటే ఎలావుంటుందో మనకుతెలియదు కాని, నేనుమాత్రం కళ్ళారాచూసాను. చాలబాధతో నెట్టుకొచ్చాడు సంవత్సరంపాటు. అయినా ఏరోజుకారోజు చెర మాట్లాడుతాడు చెర నన్నుపిలుస్తాడు అని ఆశించేదాన్ని. కాని ఏరోజుకారోజు తాను దిగజారిపోతూ ఏమీచెప్పలేకుండా మాట్లాడలేకుండా, 8 నెలలకాలంపాటు మాటలేకుండా చూపు లేకుండా చాలకొట్టుమిట్టాడుతూ, మాటచెప్పలేకుండా కళ్ళల్లోంచి నీళ్ళుకారేవి. కొంత కాలం తరువాత నీళ్ళు కారి కారి కళ్ళలోంచి చీము రక్తం కారటంమొదలయింది. తను ఎప్పుడయితే ఎర్రజెండాకోసం పోరాడాడో ఆ ఎరుపే కళ్ళలోకి రావటంమొదలయింది. తను ఏమీచేయలేనిస్థితిలోఉండికూడ కళ్ళల్లో తననెత్తురిని చూపించాడు.

అంటే ఆ ఎరుపుబాటలో నడవండి.... ఆ ఎర్రజెండాను ఎగరేయండి. నాశక్తి వున్నంతవరకు నేనుచేసాను. ఆతరువాత మీరే".... అని మనసులో ఉందన్నమాట.

ఇన్‌డైరెక్టుగా చెరబండరాజుని ఈ ప్రభుత్వం హత్యచేసింది. జబ్బు కొంచెమేఉన్నా చాలామట్టుకు ఆలోచనలతో, చదువుతో, తలనొప్పితో, ఈ దోపిడీ ప్రభుత్వం, ఈ కుళ్ళువ్యవస్థ మా చెరనుచంపిందికాబట్టి, మాచెరను హాస్పిటల్లో ముక్కలు ముక్కలుగా కోసారుకాబట్టి, మనమంతాకలిసి ఈ ప్రభుత్వాన్ని ముక్కలు ముక్కలుగాకోసి ఆయన ఆశయాలకోసం మనమంతాపోరాడుదామని మన మంతా ఐక్యంగావుంటామని.... మీఅందరిలో నా చెరను చూసుకుంటాను. మన చెర రాసిన పాటలు పాడుకుందాం.... ఆయన పాటలతో పాడుదాం, ఆయన ఆటలతో ఆడుదాం.

నాచెర, మనచెర ఎప్పుడూ మనతోనేవుంటాడు, మనల్ని వెన్నంటే ఉంటాడు. మనల్ని తడుతూనేవుంటాడు. అదిమాత్రం మరచిపోగూడదు.

మా పిల్లలిద్దరూ చాలాచిన్నవాళ్ళు. మాపాప పదేళ్ళుంటుంది. మాబాబుకి ఐదేళ్ళుంటాయి. పిల్లలంటే చెరకు పంచప్రాణాలు. చాలకాలందాకా పిల్లలుకలుగ లేదు మాకు. కలిగినతరువాత వాళ్ళ ముద్దుముచ్చట ఏమీ చూసుకోకుండా, ఆడకుండా, పాడకుండా వెళ్ళిపోయాడు.

ఈ రోజు ఉదయం 'నాన్నమీటింగు జరుగుతోందిరా అక్కడికెళ్దాం' అన్నాను బాబుతో అప్పుడు 'నాన్న అక్కడికి వస్తాడాఅమ్మా'అని అడిగాడు. ఏం సమాధానం చెప్పాలి, వస్తాడనిచెప్పనా, రాడనిచెప్పనా. ఏమీ చెప్పలేకపోయాను. కష్టజీవులగురించి, కార్మికులగురించి, కన్నీళ్ళగురించి కొండలు పగలేసినం పాట తానురాసాడు. ఆంధ్రదేశం అంతటా ఆ పాట పాడుకుంటున్నారు అట్లాగే మా పాప ఆ పాటకు, వాళ్ళ నాన్నరాసిన పాటకు డాన్సుచేస్తుంది. చూడండి. నేను యింతకంటే ఎక్కువ ఏమీచెప్పలేను.

(జంటనగరాల రాడికల్ విద్యార్థి యువజనసంఘాలు జులై 1, 2 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించిన చెర ప్రథమవర్ధంతి సభలలో బహిరంగసభకు అధ్యక్షత వహిస్తూ చేసిన ప్రసంగం.)

ఒక సజీవ స్మృతిగా - చెరబండరాజు

నిఖిలేశ్వర్

"హైదరాబాద్‌కు తూర్పున. అంకుశాపురంలో పదిహేనురోజుల ప్రసవ వేదనలో అమ్మ చచ్చిపోతుందనగా నేలమీదికి కసిగా విసరివేయబడ్డాడు. ఎప్పుడో తేదీలేదు. బంగారం పండించే పల్లెవాసుల చల్లని చూపుల్లో, పైరు పచ్చని పొలాల గట్ల మీద కాలిబాటల చీలికల్లో పెరిగాడు. ఎదురైన ప్రతిహృదయానికి అంకితమవుతాడు. సాగరతీరాల ఇసుకతిన్నెలమీద ఒంటరిగా కూచోడం వానలో నానడం ఏకాకిగా ఉండడం విషాదం ఇష్టం. మనిషికోసం పడిచస్తానంటాడు. ఒక్క భగవంతుని మీదే కసి, పగ."

("దిగంబరకవులు" మొదటి సంపుటిలో 1965 లో స్వయంగా తన గురించి చెరబండరాజు రాసుకున్న పరిచయం)

రాజుతో మొదటిసారిగా 1956 లో అనుకుంటా హైదరాబాద్ నగరంలోని బొగ్గులకుంట బస్తీలో పరిచయం.

ఆనాటినుంచి ఆ కవితానురాగం, స్నేహానుబంధం వచనకవితోద్యమంలో పెరిగి, దిగంబరకవితలో దృఢపడి, విప్లవ కవితోద్యమంలో జ్వలించింది.

రాజుకు వానలో నానడం నిజంగానే చాలా ఇష్టం. హైదరాబాద్ నగరంలో మొజంజాహీ, కోఠీ, ఆబిడ్స్ లాంటి రోడ్లపై వానజల్లులో తడుస్తూ, పల్లీలు (వేరు శెనక్కాయలు) తింటూ, పాతపుస్తకాలు - పత్రికలు ఆపేవ్‌మెంట్లపై తిరిగేస్తూ నచ్చినవాటిని కొంటూ చివరికి ఆ సెలవు రోజును (ముఖ్యంగా ఆదివారం) సుబ్రహ్మణ్యంగారి సెంట్రల్ పాయింట్‌లోనో, కింగ్ సర్కిల్ హోటల్ రెండో అంతస్థుపైన, అంతకు ముందు ఓరియంట్ హోటల్ వెనుకాల వుండే ఆవరణలోనో ముగించేవాళ్ళము. మిగతా దిగంబరకవులందరి సహచర్యం ఆ రోజుల్లో నిత్య జీవితంలో మాకందరికి విడదీయరాని భాగం.

పల్లెపాటలు, భావగీతాలు ఆలపించె ఆనాటి బద్దం భాస్కరరెడ్డి "జీవితమంతా చెమటోడ్చి వెయ్యిపుట్లు పండించి (చివరికి) గంజిలోకి మెతుకెరుగనన్నా!" అని పేదరైతుగీతం పాడుకుంటూ మోటగొడుతూ నిరంతరం శ్రమించిన తండ్రి పేదరి

కానికి వారసుడయ్యాడు. క్రమంగా తన మంచిమనసు పరిమళాలను "జగత్ప్రళయ కావ్యంలో తపనజ్వాల"గా, చెరబండరాజుగా పరిణమించే వరకు విశ్రమించలేదు.

హయెత్‌నగర్ పంచాయత్ సమితిలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా, ఆ తర్వాత ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో తెలుగు పండిట్‌గా నిత్యజీవితంలో ఆర్థిక సమస్యలను ఎదుర్కొన్నాడు. జీతం సర్దుబాటుకాకుండాపోయి, చెరబండరాజు తీరని అప్పులకు, చెల్లిస్తూపోయిన వడ్డీలకు చివరికి వడ్డీవ్యాపారస్తుల అవమానాలకుగురై బతుకుపోరాటంలో రాటుదేలుతూ పోయాడు.

తిరుపతిలో దిగంబరకవులుగా మేమంతా 1968 చివర విద్యార్థుల ఆహ్వానం పై వెళ్ళి సాయంత్రం బహిరంగసభలో కవితాపఠనం చేసాము. చెరబండ తన కవిత "వందేమాతరం" చదవగానే వెనకాలనుంచున్న సంకుచిత హిందూదురభిమానుల చేతుల్లోకి రాళ్లచేరుకున్నాయి. విద్యార్థులు వెంటనే పసిగట్టి పట్టుకున్నారు. అది ఆయన కవిత్వానికి మొదటి ప్రతిక్రియ.

1971లో జైల్లోవుండగా చెరబండరాజు సిగరెట్ల అలవాటును మాన్పించాలని జ్వాలాముఖి ఆయనసిగరెట్లను లాక్కొని తుంచేసేవాడు. చివరికి ప్యాకెట్లను తీసు కెళ్ళి లావెట్రిలోపడేసి నీళ్ళుపోసాడు. అదే లావెట్రిలో జ్వాలను చెరకోపంతో మూడుగంటలపాటు బంధించాడు. జైల్లో మరోజైలుశిక్ష ! నా దగ్గర ఇంగ్లీషునేర్చు కోవాలని గ్రామర్ పుస్తకం తెప్పించుకొని చేసిన ఆనాటి జైలుప్రయత్నం మధ్యలోనే ఆగిపోయింది.

ఇలా ఎన్నెన్ని జ్ఞాపకాలు.... మాసిపోలేని ఆనాటి తియ్యని-చేదు అనుభవాలు.

శ్రీశ్రీ, నాజర్‌లతోపాటు నేను, జ్వాల, చెర ఆంధ్రదేశంలోని అమలాపురం నుంచి ఇటు మాచెర్ల అటు అనేకమారుమూల కుగ్రామాలకు పౌరహక్కుల పున రుద్ధరణకోసం పౌరహక్కులసభల్లో పాల్గొని ప్రజల చైతన్యాన్ని పంచుకొని ప్రజల్లో సుషుప్తమైవున్న రాజకీయ చైతన్యంకోసం మాపంతు కృషిజేయడం.... ఇవన్నీ మా విప్లవ కవితోద్యమంలోనిభాగాలే !

1974-75 మధ్య విరసంలో చెలరేగిన అంతర్గతపోరాటం - ఆప్తమిత్రుడైన చెరబండతో తీవ్రంగా విభేదించి విడిపోడం - తీవ్రంగానే ఆనాటి అతని రాజకీయ అవగాహనను వ్యతిరేకించడం - ఇవన్నీ మరికొన్ని వాస్తవాలు.

1977లో జైలునుంచి బయటికి వచ్చేముందే చెరబండరాజుకు "బ్రెయిన్ ట్యూమర్" క్యాన్సర్‌వ్యాధి అని జ్వాలచెప్పగానే నేను మొదలునమ్మలేదు. మొదటి ఆపరేషన్ విజయవంతమైనా చెరజీవితకాలం కేవలం పొడిగించబడుతున్నదేతప్ప మృత్యువు తప్పదనే కఠోరసత్యం అతన్ని చూసినప్పుడల్లా మా గుండెల్ని కోసి వేస్తుందేది.

1973 లో మీసాకింద మిగతామిత్రులతోబాటు అరెస్టు చేయమని చెరపై ప్రభుత్వవారెంట్. దాదాపు 16 సంవత్సరాల వైవాహిక జీవితం తర్వాత చెరబండ రాజు భార్య శ్రీమతి శ్యామల మొదటి పాపను కన్నది. ఆ పాపను నిలోఫర్ ఆసు పత్రిలో చూడాలనుకుంటే చుట్టూ గూఢచారి విభాగం పోలీసులు! అయినా ధైర్యంగా న్యాయవాది పత్తిపాటి వెంకటేశ్వర్లు సహాయంతో ఆసుపత్రికి వచ్చి పాపను చూసి మురిసిపోయాడు. ఆ మరుసటిరోజే పోలీసులు అరెస్టుచేసి జైలుకు తీసుకవెళ్ళారు. ఆ తర్వాతే ఆ అనుభవం ఇలా రాయించింది కాబోలు.

"నా నీడలో నా భావాలవేడిని అనుమానించి
తుదకంటా నాశనం చెయ్యాలని
నన్ను వెన్నంటే నడుస్తుంటారు పోలీసులు" - (పునర్జన్మ)

సమకాలీన పోరాటకవిత విలక్షణమైన అనుభవం మరొకటివుంది. 1971 లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో జడ్జీల ముందు చెరబండ నిర్భయంగా "అమ్మమ్మ ఇందిరమ్మా - చేసింది చాలుపొమ్మా నీ నకిలీ సోషలిజం - మాకసలేవద్దమ్మా" చదివి వినిపించాడు. సికింద్రాబాద్ కోర్టు ఆవరణలో, జైళ్లలో తన పాటలను గొంతెత్తి ఆలపించాడు.

ఆ తర్వాత 1977 నుంచి మృత్యువుతో ఎడతెగనిపోరాటం. చెరబండరాజు గాంధీఆసుపత్రిలో మెదడు ఆపరేషన్లు తట్టుకుంటూ- ఆరోగ్యాన్ని నిలదొక్కుకుని గృహస్థజీవితాన్ని, విరసం కార్యకలాపాలను, కవితారచనను, సైకిలుతొక్కుతూనే నగరంలో మామూలుగాతిరగడం, అతని చెదరని ఆత్మవిశ్వాసానికీ, గుండెబలానికీ గుర్తులు!

ఒక హృదయమున్న విప్లవకవి మూగవేదనను నేను కళ్ళారాచూసాను. ఇక ఎలాగూ ప్రాణంనిలవదు. శరీరం లోలోన కృశించి ఎముకల పోగులా మారి

పోతుంటే "మరణమేమేలు" అనుకునే దైన్యస్థితి మా అందరిని ఆవహించింది, భర్తను 24 గంటలు మృత్యువు సమక్షంలో ఎలాగైనా కాపాడుకోవాలనే సేవాతత్పరతతో శ్యామల తన పిల్లలకి మాతృప్రేమను పంచివ్వలేని దయనీయస్థితిలో ఆసుపత్రినే ఇల్లుగాభావించింది. చెర కవిత్వంతోబాటు ఆయనలోని అంశగావున్న ఇద్దరుపిల్లలు ఉదయిని, కిరణ్.

మనకు అత్యంత ఆప్తులు ఆకస్మాత్తుగాలేదా మెల్లిమెల్లిగా మృత్యువుముఖంలోకి జారిపోతుంటె ఈ బైబిల్ వాక్యం నిజమైతే ఎంతబాగుండేది అని. ఇది ఏనాటికైనా మానవుడు ప్రకృతిపైసాధించే అంతిమవిజయంకాదా అనిపిస్తుంది. ఆ వాక్యం

"The last enemy that shall be destroyed is death"
(మనిషికి చావుచివరి శత్రువు. అది ధ్వంసంకాబడుతుంది)

ఆనాడు జీవన్మరణాలమధ్య తపించిన సహచరుడైన చెరగురించి ఆసుపత్రిలో చివరినెలల్లో చూసినపుడు నేను నాడైరీలో రాసుకొన్నఈవాక్యాలు ఆ విషాదస్థితిని కొంతైనా వ్యక్తంచేస్తాయని....

18 ఆగస్టు 1981

"చెరబండరాజు మామూలుగా బెడ్‌పైకాకుండా ఆసుపత్రి గేటుదగ్గర ఆవరణలో వీల్‌చేర్‌పై ఎర్రని రగ్గుకప్పుకుని తలనిండుగా తెల్లని బ్యాండేజీతో.... దగ్గరికి వెళ్ళి పలకరించగానే స్థిరంగాచూస్తున్నకళ్ళు - ఒకకన్ను కనపడదు.... ఆ చూపుల్లో ఇప్పుడే నిస్సహాయత - ఏదో పోగొట్టుకుంటున్న తపన।

మూడోసారి మృత్యువుతో హోరాహోరి పోరాడి క్షతగాత్రుడై సజీవంగా అందరిని మళ్ళీ చూడగలుగుతున్నాడు.

ఆకాశంలో స్వేచ్ఛగా ఎగురుతూ గూళ్లవైపు సాగిపోతున్న సాయంత్రం పక్షులు- ఆసుపత్రిచుట్టూ బయట రోగులు, డాక్టర్లు, నర్సులు- పల్కరించడానికి వచ్చిన బంధువులు.

చెరబండరాజును ప్రస్తుతం వుంచిన ఇంటెన్సివ్ కేర్ వార్డ్‌లో అప్పుడే మొన్నటి రోజు రెండుచావులు। స్కూటర్ ఆక్సిడెంట్‌లో తలలోని నరాలు చిట్లి

ప్రాణాలు వొదిలిన ఒక డాక్టర్. బస్సులో వస్తుండగా ఏదో గొడవలో దెబ్బలుతగిలి మరణించిన ఒక మరాఠీవ్యక్తి. ఈ మరణాల మధ్య ధైర్యంగా చెరను చూసు కుంటున్న శ్యామల !

చెరబండరాజు ఈ రోజు నిలబడి నడవలేని సిరిసస్థితిలో వున్నాడు. ఆ అపరణ లోనే మేము నడిపించే ప్రయత్నం చేసాము. ఆయన ఇద్దరు బావమరదులు చెరో పక్కపట్టుకుని లేపి నిలబెట్టారు. నా చెప్పులు ఇచ్చి కాళ్ళకు తొడిగించారు.... ఇరవై ముప్పై గజాలు చేసు నడిపించారు. నడుస్తుంటే కడుపులో తిప్పుతున్నట్టు వుందని అంటున్నాడు.

1977లో మొదటిసారి బ్రెయిన్‌ట్యూమర్ ఆపరేషన్.

1979లో రెండోసారి అదేమెదడుపై పెద్ద ఆపరేషన్ పద్నాలుగుగంటలపాటు.

ఇప్పుడు తిరిగి 1981లో మూడో ఆపరేషన్ !

ఆత్మవిశ్వాసంతో శరీరయాతనను తట్టుకుంటూ జీవించేపోరాటంలో నిరం తరం నెగ్గుతూ ఈ నాటికీ చెరబండరాజే !"

14 అక్టోబర్ 1981

"ఆసుపత్రిలో చెర ఆరోగ్యం మళ్ళీ విషమించిందని మొన్నతెలిసింది ఈ రోజు రాత్రి మోహన్‌రెడ్డి (శ్యామలఅన్న) మా ఇంటికివచ్చి మరో ఆపరేషన్‌కోసం చెరను ఇదేరాత్రి మద్రాస్ తీసుకెడుతున్నారని చెప్పి వెళ్ళాడు.

మా కుటుంబంతో మేము నలుగురం సికింద్రాబాద్ స్టేషన్‌చేరుకోవాలని చివరినిమిషంవరకు చేసినప్రయత్నం ఫలించలేదు - లోకల్‌ట్రెయిన్, ఆటో-బస్సులు ఏవీదొరకలేదు. మద్రాసునుంచి ఎలాంటిస్థితిలో చెరతిరిగివస్తాడో తెలియదు. అందువల్ల కనీసం ఆయన్నుచూడాలనే కోరిక నెరవేరలేదు. మనస్సంతా వికలమై పోయింది....

1965-75 మధ్య పదేళ్ళ కాలప్రవాహంలో ఎన్నెన్ని మధురస్మృతులు-మధ్యలో చిన్నచిన్న చేదుఅనుభవాల అలలు - అన్నింటిని తలదన్నే స్వచ్ఛమైన స్నేహం !

మెదడుపై మూడుసార్లు కత్తికోత- అయినా తట్టుకుని ఆ శరీరం నిలదొక్కు కుంది. ఇప్పుడు ఒకచెయ్యి, ఒకకాలు కదపలేనిస్థితిలో- నిస్సహాయమైన చూపుల్తో

కావలసినంతా వైద్యసౌకర్యమున్నా ఆ మెదడులోని క్యాన్సర్ వ్యాధి అతన్ని మృత్యువు దగ్గరికి లాక్కెళ్ళిపోతోంది. న్యూరోసర్జన్ డా॥ రాజారెడ్డిగారు ఆమృత్యువును దూరంనెడుతూనే వున్నారు.

ఇలా *ప్రతినిమిషం శత్రుకోతకు, శరీరంలోని యాతన్ను భట్టుకునేకంటే* మరణమే సుఖప్రదం కాదా? అని ఒకరచయిత మిత్రుడు నిర్వేదంతో అంటున్నాడు. కాని ప్రాణాలను నిలుపుకోవాలనుకోడం ఎలాంటి అనూహ్యమైన భయంకరస్థితిలో కూడా అన్నింటిని అధిగమించే సజీవ సుఖలక్షణం!"

23 ఫిబ్రవరి 1982 :

"అకస్మాత్తుగా ప్రాణంపోవడం విషాదానికి ఒక ఆదిఅంతాన్ని కలిగిస్తుంది.

కాని ఇక చావు క్రమంగా ఆవరిస్తున్నదని ఆ చావును నివారించే ప్రయత్నాల వల్ల ప్రయోజనం లేదనుకుని ప్రతినిత్యం మృత్యువుహస్తాల్లో నలిగి కొనఊపిరితో చూస్తుంటే చుట్టూవుండే ఆత్మీయుల నిస్సహాయత.

గత ఐదారు సంవత్సరాలుగా శల్యచికిత్సకు లోనవుతూ చివరికి మృత్యువు ముందు వోటమి: ఎవరైనా ఒకనాడు చావుతో ఇలా వోడిపోవలసిందేనా? చివరికి చావును నిజంగానే జయించి మానవుడు మృత్యుంజయుడు కాగలడా? ఇది ఈనాటికీ ఒక కలమాత్రమే! కాని చెరబండరాజు సమాజంలోని అన్యాయాన్ని ఏదోరూపాన ప్రతిఘటించే మహోద్యమంలో చావును అక్షరాల్లో నిరంతరం జయించే మనిషికి నిదర్శనం"

అందువల్లనే ఈనాటికీ పోరాటాల్లో "పునర్జన్మ" పొందుతున్న చెర తన "పునర్జన్మ" కవితలో మనతో అంటున్నాడు.

"బందీనైనా బానిసను కాను
వన్ను కదిపినా ఖండించినా
మళ్ళీ మళ్ళీ అలలా పుట్టుకొస్తూనే వుంటాను."

చరిత్ర మా చేతుల్లో వికసిస్తుంది
మనసారా మేం సంఘర్షణను ఆహ్వానిస్తాం
శ్రమజీవికి పట్టం గడతాం

దిక్సూచి

దేబబ్రత పాండా

చెరబండరాజూ, గద్దర్, మహేశ్వర్, కోబడ్‌గాంధీ, నేనూ కలకత్తాలో జన సమర్థంగావున్న ఓ వీధిలో నడుస్తూపోతున్నాం. 1980 చివరిరోజులు. అమితవేగంగా వచ్చేపోయే వాహనాల్తో, ఆఫీసుల్నుంచి తిరిగొస్తున్నజనంతో, దుకాణాల్లోనూ పేవ్ మెంట్లపైన సరుకులుకొంటున్న స్త్రీలతో నగరం వడిబొడ్డు జీవంతొణికిసలాడుతోంది ఆ నీరెండ సాయంకాలం. వాహనాలూ కార్లూ విడిచినపొగ పల్చటిమేఘంలా ఇళ్ళ కప్పుల్ని ఆవరిస్తూంది. 'కాలేజ్‌స్ట్రీట్'అని పిలవబడే ఈ బజార్లో నివసించేది ఎక్కువగా బెంగాలీ మధ్యతరగతి ప్రజానీకం. మౌనంగా నడుస్తూ పోతూవుండగా రాజు అన్నాడు. "ఓహో! ఇదా సామాన్యప్రజానీకం బ్రతికే కలకత్తా! పెద్ద పెద్ద ధనవంతులువుండే హైదరాబాదుకు దీనికీ ఎంతతేడా!"

ఈ అభిప్రాయాన్ని మార్చుకుందుకు రాజుకు ఆట్టేకాలంపట్టలేదు. రెండు రోజుల తర్వాత రాజూ, కోబడ్ ఇద్దరూ సమర్ సేన్‌ను స్వయంగాకలిసి ఆయనంటే తమకుగల గౌరవాన్ని తెలియచేయాలని వుందనిచెపితే వాళ్ళతోకలిసి ఫ్రాంటియర్ ఆఫీసుకువెళ్ళాను. (అంతకుముందురోజే నల్లచట్టాలకు వ్యతిరేకంగా జరిగిన ఒక సమావేశంలో వాళ్ళ సమర్ సేన్‌నుకలిశారు.) తిరిగి ఇంటికివస్తూ ధనికవర్గాలవాళ్ళ నివసించే 'చౌరంగీస్ట్రీట్'లో ఓ పెద్దమైదానానికి ఎదురుగావున్న బస్టాప్‌లో నిల బడ్డాం. (దీనినే 'సాహిబ్‌పారా' అనికూడా పిలుస్తారు) వరుసలు వరుసలుగా చుక్కల్ని తాకుతున్నట్లు ఆకాశసౌధాలు, ఎడతెగకుండాపోయే ప్రయివేటుకార్లూ. పేవ్‌మెంట్లపై దయనీయమైన బ్రతుకులీడ్చే పేదప్రజానీకంవుండే చుట్టుపక్కల ప్రాంతాలకి దీనికీ ఎంతతేడా! "లేదు. ఇకముందిలా సాగటానికి వీల్లేదు. లక్షలాది ప్రజానీకం దుర్భరమైన బ్రతుకులీడుస్తుంటే కొద్దిమందిచేతుల్లో ఇంతధనమా! ఈ అన్యాయాన్ని సహించి మనం మౌనంగా వుండరాదు. మనం దీన్నిగురించి మాట్లా డాలి," అన్నాడు రాజు. "మనంపాడుతూనే పోవాలి పాండాజీ! మౌనంగావున్న అశేష ప్రజానీకాన్ని మేల్కొలిపేంతవరకూ 'కొండలుపగలేసినం' అంటూ పాడు తూనే పోవాలి." తనలోతనే అనుకున్నట్టుగాఅన్నా రాజుకంఠంలోని దృఢత్వం అతనిలోని సున్నితమనస్తత్వంగల కళాకారుణ్ణీ, విప్లవదీక్షను బహిర్గతంచేయకుండా వుండలేకపోయాయి ఆ మాటలు.

* * * *

ఈ విప్లవకవినిగురించి నాకుతెలిసింది కామ్రేడ్ కె. వి. ఆర్. నాకురాసిన వుత్తరాలద్వారా. రాజంటే కె.వి.ఆర్‌కు ఎంత వాత్సల్యమో అనుకుంటూవుంటాను. రాజునుగురించీ, ఆయన ఆరోగ్యంగురించీ, ఆయన కుటుంబాన్ని గురించీ (ముఖ్యంగా 1979 తర్వాత) రాయకుండా ఒక్క వుత్తరంకూడా నాకురాయలేదు కె. వి.ఆర్. కే వి.ఆర్‌రాసిన చిన్నవ్యాసం ఆధారంగానే నేను కొన్ని చిన్నచిన్న బెంగాలీ పత్రికల్లో చెరబండరాజును గురించి కొన్ని పరిచయవాక్యాలు రాసినట్టుగామాత్రం గుర్తు. ఈ పరిచయవాక్యాల ప్రభావం ఎంతటిదంటే రాజు కవితల అనువాదాలేమైనా దొరుకుతాయాఅంటూ ఎన్నో బెంగాలీపత్రికలు మాకువుత్తరాలురాయడం మొదలైంది. దీని ఫలితంగానే కె.వి.ఆర్, జగన్‌మోహన్ల ఇంగ్లీషు అనువాదాలు ఆధారంగా బెంగాలీలో రాజుపాటలు, కవితలపుస్తకాన్ని ప్రచురించాం. దీని ప్రచురణకాలం లోనే కలకత్తాలో 'చారందల్'ఆనే వృత్తి కళాకారుల సంఘంతో మాకు పరిచయమేర్ప డింది. చెరబండరాజు సహాయార్థం ఈ థియేటర్ గ్రూపు కలకత్తాలోని అతిపెద్ద థియేటర్ రవీంద్రసదన్‌లో ఒక నాటకప్రదర్శన యిచ్చింది. ఈ ప్రదర్శనలోనే హేమాంగో బిస్వాస్‌లాంటి గాయకులు పాటలుపాడారు. ఈ ప్రదర్శనను చూడాలే గాని ఎంతని రాయగలను! నాకు అప్పట్లో రాజును గురించి తెలిసిన కొద్ది జ్ఞానం తోనే రాజునుగురించీ, ఆయన కవిత్వాన్నిగురించీ, ఆయన విప్లవదీక్షనుగురించీ చిన్న ఉపన్యాసంకూడా ఇవ్వవలసివచ్చింది. నేను మాట్లాడిన ప్రతివాక్యానికి ప్రేక్షకులు చప్పట్లుకొట్టడం, 'చెరబండరాజు జిందాబాద్' అంటూ స్లోగన్లుఇవ్వటం, ఎన్నో తప్పుడు కేసుల్లో ఇరికించి రాజును ఎన్నోసార్లు జైలుకుపంపిన దోపిడీప్రభుత్వ యంత్రాంగాన్ని ఖండించిన ప్రేక్షకులఉత్సాహం, నా ఉపన్యాసంముగింపు తర్వాత ఎంతోసేపు హాలుమారుమోగేటట్లు చప్పట్లుకొట్టి స్లోగన్లుఇవ్వటం - ఇవన్నీఇంకా నాకుబాగాగుర్తే. ఎక్కడో తమకు సుదూరంగా హాస్పటల్‌బెడ్‌పై పడుకున్న తమ కామ్రేడ్‌కు తమ ఆకాంక్ష వినిపింపచేస్తున్నారా అనిపించింది. ఇందులో ఆశ్చర్య పడాల్సిందేమీలేదు, ఎందుకంటే 1980 సమావేశంలో ఆంధ్రకామ్రేడ్స్ కలకత్తాకు వచ్చిన విషయంచెప్పి రాజును, గద్దర్‌ను వళకు పరిచయంచేశానోలేదో ప్రేక్షకుల్లో చెలరేగిన ఆనందోత్సాహాలు అంతాయింతాకాదు. బజార్లన్నీ పాకిపోయిందీవార్త. ఈ దృశ్యం గద్దర్‌కి ఇంకాబాగానే జ్ఞాపకంవుండివుండాలి.

* * * *

ఎప్పుడో ఒక్కసారికాబోలు, అదీ వి.ర.సం పదవవార్షికోత్సవం సందర్భం లో, చూడటంతప్ప చెరబండరాజు నాకు అంతగాతెలియదు. వి.ర.సం. సభలో

ఆయన్ని చూసినప్పుడు - మిగతా అంశాలలావుంచి - ఆయన్లో ఒక మంచి తండ్రిని, మంచిభర్తను, ఒక మంచిస్నేహితుణ్ణి చూడగలిగాను. ఎప్పుడూ నవ్వుతూ ఎంతో సాదాసీదాగా కనిపించేవాడు. ఆయన కవితాసామర్థ్యం, నక్సల్‌బరీ కాలంనుండీ దేశం నలుమూలలా ఎగసిన ప్రజావిప్లవ పోరాటాలపట్ల ఆయనకున్న అవగాహనా, విప్లవ దీక్ష - వీటి గురించి తర్వాత తెలిసింది. రాజు కలకత్తా సమావేశానికి హాజరైనప్పుడు ఎంతో దగ్గరగామెదిలే అవకాశం ఏర్పడటంతో ఆయన గొప్పసహచర్యంవల్ల ఎంతో తెలుసుకునే అవకాశంకలిగింది.

ఇప్పటిలాగానే అప్పట్లోకూడా మనం ఎదుర్కొంటున్నసమస్య జనతా ప్రజాతంత్ర విప్లవంలో భాగంగా ఒక సాంస్కృతికోద్యమాన్ని నిర్మించటం ఎలాఅనేదే. అందుకే మా చర్చ ఎంతో విలువైన అనుభవాల్ని గడించిన వి.ర.సం. జననాట్య మండలిపైనే కేంద్రీకరించింది. చర్చాసమయం అంతా, తను మాట్లాడింది మధ్య మధ్యలో గద్దర్‌తో తెలుగులోమాట్లాడి స్పష్టంచేసుకుంటూ, ఉర్దూ కలిసిన హిందీలో ఎడతెరిపిలేకుండా మాట్లాడుతూనేవున్నాడు రాజు.

ముఖంచూసి మనిషేమిటో చెప్పొచ్చంటారు. ఇది చెరబండరాజుకక్షరాలా వర్తిస్తుంది. ప్రజా విప్లవపోరాటాల్లో ధైర్యంగానిలిచిన అతని ఆశావాదం ఎప్పుడూ నవ్వుతూవుండే ఆయనముఖంలోనే కనిపిస్తుంది. ఆయన స్వభావం ఎంతటియ్యటిదంటే రెండురోజుల జాతీయ సమావేశకాలంలో (1980 డిసెంబర్‌లో జరిగింది) శ్రోతలపై ఆయన తనదైన ఒక శాశ్వతముద్రవేశాడు. (గద్దర్, కోబడ్‌ల విషయం లో కూడా అలాగే జరిగిందనుకోండి). ఆ రెండురోజులూ ఆయన ఎంత ఉత్సాహంగా వున్నాడంటే ఎప్పుడు వేదికమీదికి ఆహ్వానించినా అలుపులేకుండా ఎగిరి గెంతి వేదికనెక్కేవాడు మెట్లు వాడకుండా. బహుశా ఆయన్ని పట్టుకున్న భయంకరమైన జబ్బు తననేమీ చెయ్యజాలదని, తను ఆరోగ్యంగానే ఉన్నానని మమ్మల్ని నమ్మించటానికేనేమో అలాచేశాడు.

*　　　*　　　*　　　*

తనకు కలిసిన వాళ్ళనందరినీ స్నేహితుల్నిచేసుకునే సామర్థ్యంగల రాజులాంటి వ్యక్తి స్నేహంలభించడం నిజానికి జాగ్రత్తగా భద్రపరుచుకోవాల్సిన అనుభవం. సభలో నిత్య శంకితుడుదైన ఒక ముసలాయన (కలకత్తాలో ఓ కాలేజీలో జూఆలజీ లెక్చరర్) రాజు ఉపన్యాసాన్నివిని, మిగతా ఆంధ్రికామ్రేడ్స్‌ను గమ

నించి ఎంతగా ముగ్ధుడైపోయాడంటే ఆయన నన్ను పక్కకుపిల్చి "నాకిప్పుడు నమ్మకం కలిగింది. ఈ దేశభవిష్యత్తు కమ్యూనిజంలోవుంది. పరిచయం చేసుకోవటంతోనే ఎంతో ఆప్యాయతతో మనలో ఒకళ్ళుగా, మనకుటుంబంలో సభ్యులుగా మెలిగే ఇలాంటివ్యక్తులు జనతా ప్రజాస్వామిక విప్లవంకోసం పనిచేసేందుకు ముందుకురావటం సంతోషించవలసిన విషయం, మిగతాది అదేజరుగుతుంది. మీది చాలా తక్కువసంఖ్యేకావచ్చు. గెలుపుమీది, భవిష్యత్తుమీది," అన్నాడు. నిజం, చెరబండరాజులోని ఈ అంశం ఒక మరచిపోలేని అనుభవం.

కామ్రేడ్ సి. వి. సుబ్బారావు నన్ను మొట్టమొదటగా చెరబండరాజుకు పరిచయం చేసిన సంఘటన నాకింకాగుర్తే. అది నాజీవితంలో మర్చిపోలేని సంఘటన. సుబ్బారావూ నేనూ ఆటోరిక్షలో సికింద్రాబాదు వెలుపల ఓచోట ఆగి ఆటో దిగి రెండడుగులువేశాం. ఎదురుగా ధోతీ, చొక్కా, కళ్ళద్దాలతో ఓవ్యక్తి మాదగ్గరకువచ్చి ఎప్పటినుంచో తెలిసిన ప్రాణమిత్రులు చాలాకాలం తర్వాత కనిపించినట్లుగా ఎంతో ఆప్యాయతతో మమ్మల్ని కౌగిలించుకున్నాడు. నిజంగాచెబుతున్నా, సుబ్బారావు ఆ వ్యక్తిని చెరబండరాజేనని గుర్తుచేసేవరకూ నేనాయన్ని గుర్తించలేకపోయాను. ఇంతలో రాజు మొహంనిండా నవ్వుతూ ఆపరేషన్‌చేసిన గుర్తులుకనిపించకుండా తలకుచుట్టుకున్న మఫ్లర్ తీసిపారేసి నాటకఫక్కీలో, కళ్ళనీళ్ళతిప్పుతూ "ఏమిటీ! నన్ను గుర్తుపట్టలేరా?" అన్నాడు. తడుముకునే అవసరంలేకుండా "అవును, గుర్తించా" అన్నాను. ఆ క్షణంమొదలు మేం ఎన్నోవిషయాలు అడ్డూ, అపూలేకుండా మాట్లాడుకుంటూనే పోయాం. మా మాటల్లో అంతగాముఖ్యంకాని, బెంగాలీతిండి, వస్త్రధారణ, విశ్వభారతి, ఠాగోర్, కలకత్తా జీవితంలాంటి ఎన్నివిషయాలుదొర్లాయో! 'కన్వీనర్స్ కౌన్సిల్' బెంగాలీలో ప్రచురించిన ఆయన "కత్తిపాట" అనువాద సంకలనం "ధుయే ధుయే తల్వార్"ను రాజుచేతికి ఇచ్చినపుడు ఆయన దాన్ని బెంగాల్ ప్రజాహృదయాన్ని తనగుండెలకు హత్తుకున్నట్టు హత్తుకున్నాడు. సంకలనాన్ని గురించి మాట్లాడుకుంటుండగా ఆయనపేరు ముద్రించటంలో బెంగాలీ ఉచ్చారణ దృష్టిలోఉంచుకోవటంవల్ల చిన్నపొరబాటు జరిగిందని తెలిసింది. తెలుగులో ఆయన కలంపేరులోని మూడుమాటలకూ మూడునిర్దిష్టమైన అర్థాలున్నాయని మాకు తెలియక ఆ పొరబాటు జరిగింది. మాకు చాలాబాధేసింది. కాని రాజు మమ్మల్నెంతో సముదాయించాడు. "చూడండి, ఇతరభాషల సాహిత్యాన్ని మేము ప్రచురించినా

ఇలాంటి చిన్నచిన్న పొరబాట్లు తప్పవు. దాన్నిగురించి అంతగా ఆలోచించకండి" అని ఎన్నిసార్లుచెప్పాడో ! అది ఇంకా నాచెవుల్లో గింగురుమంటూనేవుంది.

*   *   *   *

రాజు ఎంతటి ఉన్నత భావాలుగలవ్యక్తో సన్నిహితంగా మెలిగిన ఆయన స్నేహితులందరికీ తెలుసు. తెలియంది ఆయన చిన్నపిల్లమనస్తత్వమే. ఈ రెండో అంశమే ఆయన చాలామందికి ప్రియమిత్రుడు కావడానికికారణం. రాజూ, గద్దర్ కలిసి కలకత్తావచ్చినప్పుడు వాళ్ళను రిసీవ్ చేసుకోవటానికి హౌరా స్టేషన్ కు వెళ్ళాను. కాని నేను స్టేషన్ కు చేరకముందే రైలువచ్చేసింది. తెలిసినచోట్లల్లా వాకబుచేశాను స్టేషన్లో. చివరకు నిరాశతో వెనక్కితిరిగాను. నేను ఇంటికితిరిగొచ్చి చూద్దునుగదా రాజూ, గద్దర్ ఇద్దరూ మా వంటగదిలో ప్రత్యక్షం, నేవచ్చేప్పటికే సతి (నాభార్య) తోనూ సౌమ్య (మా అబ్బాయి)తోనూ ఎంతో పరిచయమున్న వాళ్ళలా ఫ్రీగా మాట్లాడుతూవంటచేస్తున్నారు రాజూ, గద్దర్. రాజు మంచివంటకాడు. ఈవిషయం నాకు కె.వి. ఆర్ వల్ల తెలిసింది. జైల్లోవుండగా కామ్రేడ్స్ అందరికీ వంటవిషయం అంతా తనే చూసేవాడట. ఇక్కడ మాఇంట్లోకూడా నేను తిరిగొచ్చేటప్పటికే సతిని సంప్రదించి 'మెనూ' నిర్ణయించేశాడుకూడా. మాంసాహారంఅంటే రాజుకు ఎంతోఇష్టం. బెంగాలీ భోజనమంటే నాలిక్కొసుకునేవాడు. బెంగాలీ వస్త్రధారణఅన్నాఅంతే. ఒకసారి 1965 ప్రాంతంలో మంచి కవినవుదామని టాగోర్ ప్రేమించిన విశ్వ భారతికి వచ్చాడట. విశ్వభారతికి వచ్చాక తనెంతప్పుచేశాడో తెలుసుకున్నాడట. అతి సాదాగా కనిపించేరాజు తనుచేసిన ఈ 'చిన్నపిల్లల సాహసకృత్యాన్ని' ఏమాత్రం సిగ్గుపడకుండా చెబుతాడునాతో.

ఈ విప్లవకవి వ్యక్తిగత జీవితంలో చాలా 'నీట్'గా 'స్మార్ట్'గా కనిపించే 'జంటిల్ మన్'. ఒక సంఘటన నాకిప్పటికీ గుర్తు. రాజూ, గద్దర్ సౌత్ కలకత్తాలో కొందరు కళాకారుల్ని కలిసేందుకు మా ఇంటినుంచి పొద్దునే బయల్దేరవలసివుంది. గద్దర్ ఎప్పుడో రెడీఅయ్యాడు. ఎందుకంటే అప్పటికీ ఇప్పటికీ కూడా పెరిగిన గెడ్డాన్నిగాని మాసిన బట్టల్నిగాని గద్దర్ పట్టించుకునేవాడుకాదు. టైమవుతుందని గద్దర్ వెనకబడి తరుముతున్నా రాజు గెడ్డంచేసుకుని, బట్టలు మార్చుకుని నీట్ గా తయారయిగాని కదల్లేదు.

కాని ఇవన్నీ వ్యక్తి జీవితంలో చాలచాల చిన్నవిషయాలు. చెరబండరాజు తన పాఠకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తాడు. ఆయనలోని కవితాశ్లేషిమ అలాంటిది.

కామ్రేడ్ల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తాడు, ఆయన విప్లవదీక్ష అలాంటిది. ఆయన మిత్రులందరి హృదయాల్లో, జ్ఞాపకాల్లో ఎల్లకాలం వుంటాడు, ఆయన మృదువైన వ్యక్తిత్వం చిన్నపిల్లాడి మనస్తత్వం అలాంటివి.

ఈ సాదా మనిషిలోని దృఢత్వాన్ని తెలిపే ఒక సంఘటనచెప్పి ముగిస్తాను. సమావేశపు మొదటి రోజునే రాజును, గద్దర్‌ను ఎరిగిన ఒక మధ్యవయస్కుడైన బెంగాలీ కవి, ఒక ప్రసిద్ధ బెంగాలీ సినిమా దర్శకుడు ఆంధ్రకామ్రేడ్స్‌ను కలవాలనుకుంటున్నాడనీ, తన ఇంటికి రావలసిందిగాకోరాడనీ రాజును, గద్దర్‌ను అడిగాడు. కాని ఇద్దరూ కూడా సమావేశపు నిర్వాహకులతో చర్చించకుండా ఎటూరాలేమని ఆ పెద్దమనిషికి చెప్పారు. చేసేదిలేక ఆ పెద్దమనిషి నన్ను పట్టుకున్నాడు. రాజూ, గద్దర్ ఆసినిమా దర్శకుడింటికి వచ్చేఏర్పాటుచేసి పెట్టమన్నాడు. ఇద్దర్నీ పక్కకుపిల్చి ఈ విషయం చెప్పాను. రాజు ఇలా అన్నాడు, "లేదు కామ్రేడ్! మేం అక్కడకు పోలేము. మేమిక్కడికి వచ్చింది ఎందుకు? మేము ఎందుకొచ్చామో 'ఆయన'కు తెలుసుగదా! ఆయన ఇక్కడకువచ్చి మనతో సంఘీభావాన్ని తెలపొచ్చుగదా! దానికి బదులు మేంవెళ్ళాలా? వెళ్ళితేమాతో ప్రయివేటుగా కలుస్తాడన్నమాట. ఈ ఉదారతని మేం పాటించలేం కామ్రేడ్. ఇలాంటి వాటిని సమర్థించరాదు." చివరికి నేనే ఆ పెద్దమనిషినిపిల్చి ఆ సినిమాదర్శకుణ్ణి తీసుకుని సమావేశానికివచ్చి కామ్రేడ్స్‌ను కలుసుకొని ఫైంతీసుకోవచ్చుగదా! అని సలహాఇచ్చాను. ఇది పట్టించుకునే అవసరంలేనంత చిన్నవిషయమే. కాని ఇదే అతిసాదాగా కనిపించే రాజులో ఎంతపట్టుదల వుందో చెబుతుంది.

* * * *

అంతిమఘడియలకు ఓ నెలరోజులే టైముంది. ఆయన క్రియాశీల జీవనం అప్పటికేముగిసింది. బ్రతుకుకోసం పోరాడుతూ ఆస్పత్రి బెడ్ మీద పడివున్నాడు. అంతే. నేనూ, బిద్యుత్ భౌమిక్, కాంచన్ కుమార్ ముగ్గురం గాంధీఆస్పత్రికి వెళ్ళాం. ఆ చివరిఘడియకోసం గుండెదిటవుచేసుకుంటున్న శ్యామలను చూడటం హృదయ విదారకమైనదృశ్యమే. కళ్ళనిండానీళ్ళు చెంపలమీదుగా దోకిపడుతూ మాట్లాడితే తిరిగి బదులు మాట్లాడలేని మా కామ్రేడ్‌కు వీడ్కోలుచెప్పాం.

* * * *

కుళ్ళి కంపుగొడుతున్న ఈ సామాజికవ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పు కోసం నడుంకట్టిన ప్రగతిశీలురైన అందరిజ్ఞాపకాల్లో ఎప్పుడూ జీవించే వుంటాడు రాజు. విప్లవకర్తవ్యాన్ని నిర్వహించేందుకు ఆయన చాలాకాలం జీవించలేకపోయిన మాట వాస్తవమే. కాని ఆయనపథం ఎందరోయువకుల్ని ఉత్తేజితుల్నిచేస్తుంది. రోజులు గడుస్తున్నకొద్ది మరెందరో యువకులు ఆయనఆశయాన్ని ఉన్నతశిఖరాల నిలిపేందుకు ముందుకుకదులుతారు, అఖిలభారత విప్లవరచయితల సాంస్కృతిక సమాఖ్య యదార్థరూపం దాల్చుతున్న ఈరోజు చెరబండరాజుకలను నిజంచేస్తున్నది. కలకత్తానుంచి వెళ్ళిపోయేరోజు కామ్రేడ్ రాజు తనమృదుస్వరంతో అన్నాడు: "కామ్రేడ్, భాషమనల్నివిడదీస్తూ హిమాలయంలా అడ్డునిలుచుంది. అయినా హిమాలయాన్ని అధిరోహించవచ్చుననే విషయాన్ని నువ్వుకాదనలేవు. ఒక్కసారి శిఖరాగ్రాన్ని చేరింతర్వాత సూర్యుణ్ణి, వెలుగునీ, మనముందుకనిపించే సర్వాన్నీ మనం అనుభవించగలం. సాంస్కృతికరంగంలోవున్న మనమంతాకలిస్తే ఎంతోబాగుంటుంది. శిఖరాన్ని అధిరోహించటం ఎంతోకష్టమేకావచ్చు. కాని మనమంతాకలిసి దాన్ని సాధించేందుకు కావలసినధైర్యాన్ని బలాన్ని సంపాదించవచ్చు."

అఖిల భారత విప్లవ రచయితల సాంస్కృతిక సమాఖ్యను శక్తివంతమైనదిగా తీర్చిదిద్దుకోగలగటమే చెరనుగౌరవించే మంచిమార్గమవుతుంది. శిఖరాన్ని అధిరోహించేందుకు పోరాడదాం.

ఈ మట్టినాకు
పచ్చైదన్నం పెట్టి పాలుతాపింది
రాక్షస భూస్వామ్య రంపపు కోతల్నుండి
తనను విముక్తి చేసి
రుణం తీర్చుకుంటాను

విప్లవవీరుల త్యాగాల నెత్తుటిదీపాల్ని చేతికందించింది
గమ్యాన్నిచూపి తుదివరకూ కొనసాగమంది
గొంతులో ఊపిర్లు ఉన్నంత వరకు
మదిలో ఓనమాలు మెదిలేంత వరకు
ఈ బాధ్యతను పూలమాలగా స్వీకరిస్తాను

బెంగాలులో చెరబండరాజు

సచిన్ బిస్వాస్

1980 విరసం మహాసభల్లో చెరబండరాజును కలిసిన రోజు నాకు ఎంతో ప్రముఖమైన రోజు. హైదరాబాదులో కాన్ఫరెన్స్ గేట్ దగ్గర మేం ఆటోదిగ్గానే మమ్మల్ని ఆయనకు పరిచయంచేశారు. మమ్మల్ని రాజుకు పరిచయంచేసింది కామ్రేడ్ కె. వి. ఆర్ అని గుర్తు. మాచేతుల్ని తన చేతుల్లోకి ఆప్యాయంగా తీసుకుంటూ మమ్మల్ని ఆహ్వానించారు రాజు. అదో పాతకత. వర్గసమాజాన్ని వర్గరహిత సమాజంగా మార్చే పోరాట క్రమంలో ఇప్పుడు మేమంతా ఒకేవేదికమీద నిలిచినా రాజు మాకంటే ఎంతో ముందున్నారన్న విషయం మాకు తెలుసు. ప్రజలపట్ల ఆయనకు గల ప్రేమ అపారం. 'ప్రజల నుంచి ప్రజలకు' అన్న సూత్రాన్ని ఆయన తన కవితల్లోనూ, పాటల్లోనూ విధిగా పాటించారు. సాధారణంగా ప్రజల్లో కనిపించే జానపద కళారూపాల్ని విప్లవకవి చెరబండరాజు తమ కవితలకు, పాటలకు బాణీగా చేసుకున్నారు. కవితావస్తువులో వైవిధ్యాన్ని గురించి ఇక చెప్పనే అక్కరలేదు. అది అందరికీ తెలిసిందే. దేశంలో వేళ్ళూనుకుపోయిన భూస్వామ్యవ్యవస్థపై పోరాటంలో భాగస్వాములైన కార్మిక, కర్షకవర్గాల పోరాటమే అది. భూస్వామ్య, వలససాంప్రదాయ సంస్కృతిని తుడిచిపెట్టి అశేషప్రజానీకమూ, కార్మికవర్గమూ కోరుతున్న ఆదర్శప్రాయమైన జనతా ప్రజాతంత్ర సంస్కృతిని ఆవాహన చేసేందుకే తన సాహితీ జీవనంలో రాజు ప్రతినపూనాడు.

దోపిడినే కాకుండా, దోపిడీకి గురవుతున్న అశేష ప్రజానీకంలో నుంచి, కార్మికవర్గంలో నుంచి వాళ్ళజీవితాలకు అద్దంపట్టే కొన్ని మంచిపాత్రలను సృష్టించాలని రాజు ఒకసారి నాతో ఏదోవిషయాన్ని చర్చించుకుంటున్న సందర్భంలో అన్నారు. ప్రజాపోరాట పంథాను అనుసరించిన గోర్కీలాగా, లూసున్ లాగా కార్మికవర్గాన్ని ప్రతిబింబించే పాత్రలని ఆయన ఉద్దేశ్యం.

రానురాను చెరబండరాజు బెంగాలీకవులకు, బెంగ్గాలీ పాఠకులకు ఎంతో దగ్గరయ్యారు. మొదటిసారిగా ఆయన కవితల్నీ, పాటల్నీ బెంగాలీలో "ధుయే ధుయే తల్వార్" అనేకవితా సంకలనంగా "కన్వీనర్స్ కౌన్సిల్ అఫ్ రివల్యూషనరీ రైటర్స్, ఆర్టిస్ట్స్ అండ్ ఇంటలెక్చువల్స్, వెస్ట్‌బెంగాల్" అనేసంస్థ ప్రచురించింది. బెంగాలీ కవులైన సమర్ సేన్, శంఖాఘోష్, మణిభూషణ్ భట్టాచార్జీ, సవ్యసాచీదెబ్, బిపుల్

చక్రవర్తి లాంటివారు రాజు ఇంగ్లీషు తర్జుమాకవితల్ని బెంగాలీలోకి అనువదించారు. చెరబండరాజు సహాయార్థం ఈ సంకలనాన్ని 1980 వి.ర.సం సభల్లో అమ్మాం. ఎంతోమంది ఈ సంకలనాన్ని కొన్నారు. ఇంకా ఇప్పటికీ కొంటూనేవున్నారు, బెంగాలు మారుమూలగ్రామాల్లో ఈ సంకలనాన్ని చదువుతున్నారు ప్రజలు. ఇంకా కావాలనికోరుతున్నారు. దీనిద్వారా వసూలైనడబ్బు- పెద్దమొత్తమేమీ కాదనుకోండి- 'కన్వీనర్ కౌన్సిల్'ద్వారా చెర సహాయానికిపంపాం. ఆయనదాన్ని కృతజ్ఞతాపూర్వకంగా బెంగాలుప్రజల సహాయంగా స్వీకరించారు. మరో ముఖ్యమైనవిషయమేమిటంటే మృతవీరులైన విప్లవకవులు సుబ్బారావు పాణిగ్రాహి, సరోజ్‌దత్తాలకు ఈ సంకలనాన్ని అంకితంచేయడం. అదిమొదలు బెంగాలీకవులూ, రచయితలూ, పాఠకులూ చెరబండరాజువైపు ఆకర్షితులయ్యారు. ఆయనవి ఎన్నోకవితలు బెంగాలీ పత్రికల్లో పునర్‌ముద్రితమయ్యాయి. "కొలిమంటుకుంది", "కొండలు పగలేసినం", "ఏ కు ల మ బ్బా", "మా ప ల్లె", "వ ం దే మా త ర ం", "ఫో", అన్న ఆయన రచనలు బెంగాల్లో ఎంతోప్రచారంపొందాయి. పాలకవర్గాల ESMA లాంటి నల్లచట్టాలను ఖండించేందుకు కలకత్తాలో ఏర్పాటుచేసిన ఒక సమావేశానికి చెరబండరాజు వస్తే ఆయన్నిచూడాలని కవులూ, రచయితలూ, మేధావులూ ఎందరోవచ్చారు, అప్పుడు ఆయన్తో గద్దర్‌కూడాఉన్నారు. ప్రజలపాటలు పాడుతూ, మధ్యమధ్యన వివరణఇస్తూ ఇద్దరూకలిసి ప్రదర్శనఇచ్చారు, వాళ్ళపాటలుఎలారాసిందీ వివరించి చెబుతే మా బెంగాలీ కవి గాయకులెంతో ఆకర్షితులయ్యారు. కన్వెన్షన్‌హాల్లో రాజునన్ను ఆప్యాయంగా కౌగిలించుకోవటం నాకిప్పటికీబాగాగుర్తే. ఆరోజు రాత్రికి నన్ను కలకత్తాలో ఉండమని కోరాడురాజు. కాని నాకు వీలుచిక్కక ఉండలేకపోయాను. ఆ రాత్రికి వెళ్ళిపోవలసి వచ్చింది. ఎంతదురదృష్టమో !

ఒక సంవత్సరం గడిచింది. నాడియాజిల్లాలో కవులమీద గాయకులమీదా జరుగుతున్న నిర్బంధకాండకు వ్యతిరేకంగా కరపత్రాలు పంచుతూ, బజార్లలో ప్రదర్శనలిస్తూ, ప్రజలపాటలుపాడుతూ చాలాబిజీగావున్నాం. నాడియా జిల్లాకేంద్రమైన క్రిషినగర్‌లో జిల్లాఅధికారులవద్దకు వెళ్ళేందుకు ప్రజాప్రదర్శన నిర్వహిస్తూవుండగా రాజు మరణవార్త తెలిపింది. ఎంతోవున్నతమైన విప్లవభావుకుడు, నూతన ప్రజాతంత్ర విప్లవం, సంస్కృతికోసం పోరాడినవీరుడుగా అప్పటికప్పుడే రాజు మరణానికి సంతాపతీర్మానాన్ని ఆమోదించింది అశేషప్రజానీకం. మేం ప్రచురించిన రాజు "కొలిమంటుకుంది" సంకలనంలోని పాటల్ని ఎన్నిటినోపాడారు ప్రజలు. బెంగాలు పత్రికలన్నీ మా రిజల్యూషన్లతోపాటు రాజు సంతాపతీర్మానాన్నికూడా ప్రముఖంగా ప్రచురించాయి.

మళ్ళీ మేం జూలై 24, 1982న కలకత్తాలోని 'స్టూడెంట్స్‌హాల్'లో సమావేశమయ్యాం. అది చెరబండరాజు సంస్మరణసభ. హాలంతా జనంతో కిటకిట

లాడింది. చెర జీవితాన్నిగురించి, కవిత్వాన్నిగురించి, ఆయన విప్లవభావాలగురించి, రచనలగురించి వి.ర.సం. ప్రతినిధి చలసానిప్రసాద్ ఒక సుదీర్ఘమైన ఉపన్యాసం ఇచ్చారు. మిహిర్ ఆచార్జీ సంపాదకుడుగా వెలువడిన "లేఖక్‌సమావేష్" ప్రత్యేక సంచిక ఆరోజు ఆవిష్కరించబడింది. ఈసంచిక "Cherabanda Raju is dead ! Long live cherabanda Raju" అనే పతాకశీర్షికతో ప్రారంభమౌతుంది. రాజు కవిత్వాన్నిగురించి, ఆయన జీవితాన్నిగురించి సంపాదకీయం, ఆయనవే కొన్ని కొత్త కవితల ఇంగ్లీషుఅనువాదాలు, I'll defy/the enemy/while rediculing/death, అనే చరణాలతో మొదలయ్యే ఆయన "కత్తిపాట" అందులో ప్రచురించబడ్డాయి.

అది మొదలు చెర కవితల్నీ, పాటల్నీ, జీవితవిశేషాల్నీ, ఆయన గురించిన మరెన్నోవ్యాసాల్ని ఎన్నో బెంగాలీ పత్రికలు ప్రచురించటం ప్రారంభమైంది. హరిధన్‌రామ్, జయంతి చటోపాధ్యాయ, బిషన్‌రుద్ర, అరుణసన్యామత్, ప్రశాంత్ భట్టాచార్య ఆయనపై ఎన్నో కవితల్నీ, ఆయన కవిత్వతత్వానికి సంబంధించిన వ్యాసాలను "తరంగపత్రిక" అనే బెంగాలీ పత్రికలో ప్రచురించారు. ద్విజేంద్రనాథ్ సస్మల్ ఒక వ్యాసంలో చెరబండరాజును గురించి రాస్తూ "నక్సల్‌బరీతో మొదలైన విప్లవకవితా యుగంలో ధృవతార"గా రాజును అభివర్ణించాడు. చెర జీవితంలో కొన్ని సంఘటనల్ని ఉటంకిస్తూ ఆయన కవిత్వంలో అవి ఎలా ప్రతిబింబించాయో కూడా సస్మల్ పేర్కొన్నాడు. రాజు నక్సల్‌బరీతోనూ, మార్క్సిజం - లెనినిజం - మావో ఆలోచనా విధానంతో ప్రభావితుడయ్యాడన్న విషయాన్ని బెంగాలీలు ఎన్నటికీ మరిచిపోలేరు. చెర ఆలోచనా సరళికి ఈ తాత్వికసిద్ధాంతమే పునాది. "సమీక్ష" అనే పత్రికలో చెర జీవితాన్ని గురించి, ఆయన కవితాప్రపంచాన్ని గురించి నేను కూడా ఒక వ్యాసంరాశాను. చెరపై మావాళ్ళు చాలా గేయాలు రాశారు. మనోరంజన్ బిస్వాస్ చెరపై రాసిన గేయాన్ని రాసిముగిస్తాను.

ఓ చిన్న ఉప్పురాయికోసం
ఓ గోచిపేల్కకోసం
ఓ మడిచెక్కకోసం
ఓ ఆయుధంకోసం
నువు నీకలాన్ని నేలలోపాతావు

కాని ఆ ఉప్పు యజమానులు
భూ కామందులు
ఆయుధాల స్వంతదారులు
నీరక్తాలు పారించారు

ఈ చీకటిచంపేసే శిలువ
తరతరాలకాలపు ప్రవక్త
అలానే శిలువవేయబడ్డాడు

నేను, ఒక కవిని
నీ రక్తంకాచే
ఆయుధం సంపాదించడానికి
నాకాలాన్ని గడుపుతున్నాను

ముఖపరిచయం మాత్రమే

అజ్ఞాతసూరీడు

మొదటిసారి ఆయన్ను పర్చూరులో చూశాను. డా॥ బాగంటి భాస్కర్ స్మారక స్థూపం ఆవిష్కరణ సభలకి 1973 లో అనుకుంటా లేదా 74 కావచ్చు. అప్పటికే ఆయన రాసిన "చెట్టూ నీ పేరు చెప్పు" అనే పాటని రాజకీయ ప్రత్యర్థుల్ని ఓడించటానిక్కి, నా చేతిలో గొప్పసాధనంగా ఉపయోగిస్తున్నాను. "పశుసంతతి పాలనయిది- శిశుహంతక రాజ్యం ఇది" అన్న ఆయన నినాదం మా కుంచెలద్వారా గోడల్ని - వాడల్ని హడలగొడుతోంది. స్మారకసభకు ముందు మధ్యాహ్నం ప్రతినిధుల సమావేశం జరిగింది. ఆ సమావేశంలో డా॥ భాస్కర్ కోసం శివసాగర్ రాసిన 'నరుడో - భాస్కరుడా' పాడితే బాగుంటుంది అని డా॥ చెరబండరాజు సూచించారు. అప్పటికింకా JNM వ్యాప్తిచెందలేదు. నాసర్ బుర్రకథతోనే సభలు నెట్టుకొస్తున్న కాలం. ఆపాట పాడటానిక్కి అక్కడెవరూ లేరు. నా మిడి మిడి స్వరంతోనే సమావేశంలో ఆపాట పాడాను. చాలా బాగుందని మెచ్చుకున్నాడు చెర. బహిరంగసభలో కూడా పాడమని ప్రోత్సహించాడాయన కానీ నేను పాడలేదు. అందుక్కారణాలు వేరేవున్నాయి.

చివరిసారి ఆయన హాస్పిటల్‌లో వుండగా కలిసాను. అప్పటికి ఆయన కంఠం మూగబోయింది. నన్ను గుర్తించలేదు నేనూ చెప్పలేదు. నా ప్రక్కనున్న మిత్రుడ్ని కళ్లతో చాలాసార్లు "ఎవరీయన?" అన్నట్లు నన్ను గురించి ప్రశ్నించాడు. ఆయనా చెప్పలేదు చివరిసారి చేతిలో చెయ్యికలిపి అరగంట తర్వాత బైటకువచ్చేశాను. తర్వాత కొద్దిరోజులకే ఆయన మరణించారు.

ఈ రెండు సంఘటనలకీ మధ్య, ఓ అమరవీరుని స్మారకసభకి ఆయన వచ్చారు. బహుశా అదే ఆయన ఆఖరిసారి స్టేజీఎక్కడం అనుకుంటా. సంజీవితో కలిసి ఒగ్గుకథ చెప్పాడని, మీటింగు అయిపోయాక చాలా అవస్త (Health) పడ్డాడని తెలిసింది. అప్పుడే నాతో కలవాలని అక్కడి నిర్వాహకుల ద్వారా కబురు చేశాడు. పనులవత్తిడివల్ల నేను కలవలేకపోయాను. నన్ను నేను క్షమించుకోలేని సంఘటన ఇది.

ఆయనతో నాకు ముఖపరిచయం తప్ప మరేమీలేకపోయినా, ఆగొప్ప సాంస్కృతిక యోధుడు- ప్రజాకవి మరణించటం (లేదు చంపబడటం), నన్ను బాధించటం ఆశ్చర్యం కాదు. ఎందుకంటే ఆయన పట్టుపడలని విప్లవ దీక్షవల్ల, ఆచరణ - సాహిత్యాలవల్ల ప్రజల మనసుల్ని ఆకట్టుకొన్నాడు. అందుకనే ఆయన మరణం మనల్నింతగా బాధించటం.

మరోమాట. ఆయన బ్రతికినన్నాళ్లూ ప్రజల్ని మనల్ని ఉత్తేజపరిచాడు. మరణించీ ఉత్తేజపరుస్తున్నాడు. అందుకు సాక్ష్యం ఆయన స్మారకసభలకు హాజరవుతున్న వేలాది ప్రజలే.

'గాంధీ రోగనిలయంలో' చెర

శ్రీ కాకుళరావు

కమ్యూనిజంఅంటే ఏమిటో తెలుసుకొన్నాక, ఆ వుద్యమంలో భాగం అయ్యాక- ఆ క్షణంనుంచి జీవన్మరణ పోరాటంలో చివరిక్షణంవరకూ ఆ విలువలు నిలుపుకొన్న విప్లవకవి, యోధుడు కామ్రేడ్ చెరబండరాజు. విప్లవకవిత్వాన్ని ప్రేమించటంకాదు, పాణిగ్రాహి వారసత్వంలో తానే విప్లవాంకితగీతమై రగిలి వెలిగిన అగ్నిపుత్రుడు. నక్సల్బరీ శ్రీకాకుళాలు పూయించిన ఎర్రపూలవనంలో "ప్రజలు వేలు మృతులైనా/పోరాటం జయిస్తుంది" అన్న విశ్వాసంతో యివాళ నేల నాలుగు చెరగులా పరిమళిస్తున్న ఎర్రమొగ్గ చెర.

చుట్టూవున్న సమాజాన్ని 'తప్పు' పట్టడమే చాలామంది పనికాగా చెర సమాజం లోని తప్పునిఎత్తిపట్టి వివరించాడు. తనమాటద్వారాకన్నా కవితద్వారా, అంతకన్నా పాటద్వారా ఆతప్పుని ఒప్పుచేసే ప్రజాయుద్ధపంథాని వివరించాడు. ఆ వివరణ కూడా సూటిగా స్పష్టంగా ఎంతోనిజాయితీగా వుంటుంది. కెవిఆర్ అన్నట్లు, రాజకీయ దృక్పథంలో 'నిజాయితీ చెరబండరాజు స్వదస్తూరీ,'

'సెరాబందిరాజు' 'జాతకం'తోపుట్టి బక్కయ్యగాబతికి, బాలనరసిమ్మగా పూశ్చోతెలిసి, భాస్కరరెడ్డిగా నాగరీకంకాదోయి, చెరబండరాజుగా విప్లవీకరించబడ్డాడు. పుట్టిన అంకుశాపురానికి పేరుదెచ్చేలా యీ వ్యవస్థపైకి కలాన్ని అంకుశంలా విసిరాడు.

జీవితాన్ని, పోరాటాన్ని ఎంతగాప్రేమించాడో అంతగా పరీక్షకుగురయ్యాడు. 'అనారోగ్యబాధితుణ్ణే/అయితేనేం యోధుణ్ణి'- చెర స్వగతంకాదు, అదిచరిత్ర. తనను వెనక్కినెడ్తున్న, నిలదీస్తున్న వ్యవస్థకి సవాల్‌గా నిలిచాడు.

ప్రారంభంలో తలనొప్పిగావున్నది అంతానికి కాన్సర్‌గా పరిణమిస్తుందని ఎవ్వరూ ఊహించలేదు. రెండుసార్లు ట్యూమర్ఆపరేషన్ చేయించుకొనికూడా ఎన్నడూ అనారోగ్యబాధితుడిలా వ్యవహరించలేదు. ఆటో, సైకిల్ ఏదీలేకుంటే కాలినడకన తిరిగాడు, నోటిలో పాటతోడుగా నడిచిపోయేవాడు.

ఉద్యమం పూపందుకొన్ననాటినుంచి చెరజీవితం అయితే బందిఖానా లేదా దవాఖానా. చెరభార్య శ్యామల చెరతో ఎక్కువకాలం ఆసుపత్రిలోనే గడపగలిగింది. ఆ క్రమంలో ఆమె ట్రెయిన్డ్‌నర్సుతో సమానంగా చెరని రెప్పవేయకుండా కనిపెట్టు

కొంది. క్షణం ఆలస్యంకాకుండా డాక్టర్లు చెప్పినట్లు మందులువాడింది. కేవలం తనభర్తని కాపాడుకోవాలనే తపనతోనేకాక, ఈ సాంస్కృతిక సైనికుడిని తిరిగి ఆదశానికి వప్పచెప్పాలనేదీక్షతో కృషిచేసింది.

సికిందరాబాదు కుట్రకేసులో ముద్దాయిగావుండగా 74 జులై-సెప్టెంబర్ మధ్య కాలంలో ఒకసారి బట్టలుఉతుక్కుంటూ జారిపడ్డాడు, ఆ తర్వాత ఒకసారి మెడ వంకరపోతూ కళ్ళుతిరుగుతూ ఎట్లాగో అవుతుందన్నాడు. సికిందరాబాదు గాంధి ఆసుపత్రికి పంపించి చికిత్సచేయించడం జరిగింది. 75 జనవరిలో బెయిలుమీద విడుదలయ్యాడు.

1974లో చెరకి తలనొప్పిగా ప్రారంభమైన అనారోగ్యం 75 నాటికి కళ్ళు బాదరలుకమ్మడం, తలతిప్పడుగామారింది. ఎమర్జెన్సీ నిర్బంధానికి గురికావడంతో చికిత్సకూడా వెంటనే వీలుకాలేదు. తలనొప్పితోపాటు కడుపులోనొప్పికూడా విపరీత మైంది. డాక్టర్లు డియోడినల్ అల్సర్ అనితేల్చి దానికి చికిత్సచేసారు. డియోడినల్ అల్సర్‌గురించి ఆపరేషన్‌కూడ జరిగింది. కాని తలనొప్పి వదలలేదు. 76 లో సర్కారువారు చెరని ఉస్మానియా ఆసుపత్రికి పంపారు. పరీక్షించిన డాక్టర్లు చెప్పకున్నా మెదడులో కణితి (TUMOUR) వల్లనే చెరకి యీ అనారోగ్యం వచ్చినట్లు కొందరు ఆయననుచూసిన పరిచయస్తులైన మిత్రులైనడాక్టర్లు తెలుసుకోగలిగారు. ఆస్థితిలో ఉస్మానియా ఆస్పత్రిలో మెదడుకి యివ్వకూడని కరెంట్‌షాక్స్ యిచ్చారు. ఆ షాక్స్‌కి కణితిపగిలి చెర ప్రాణంపోవాల్సిందె. చెర మానసికస్థైర్యాన్ని దెబ్బకొట్ట లేకపోయిన ప్రభుత్వం, యిక ఆ శరీరంపై దాడిని ప్రారంభించిందా అనిపించింది.

సమాజంలోని చెడుని నిర్మూలించే క్రమంలో చెర కలంతో కత్తిపాటపాడుతూనే మరొకవంక ఆఖరికి తన అనారోగ్యంతో కూడా పోరాటం సాగించాడు. చెర కన్నా మొండి వ్యాధులతో యింకా దీర్ఘకాలం యింకా అసహాయంగా కుమిలిపోయిన విషాద జీవితాలు ఎన్నెన్నో! అయితే అనారోగ్యంతో కూడా సడలని చెదరని చెర రాజకీయ విశ్వాసం, ఆ పోరాటంపట్ల కమిట్‌మెంట్, చెరని ప్రత్యేకంగా స్మరించుకోవడానికి కారణం అవుతున్నాయి.

ఎమర్జన్సీ అనంతరం 77 లో చెర నిజాం ఆసుపత్రిలో చేరాడు. పోలీసుల వొత్తిడికి లొంగి రక్తంలేదన్న నెపంతో డాక్టర్ ఆపరేషన్ చేయలేదు. పైగా

"మీ వెనక ప్రజలున్నారా? వుండేదేరీ?" అని వ్యంగ్యంగా అక్కడి సర్జన్ ప్రశ్నించాడు. రోగాన్ని నయంచేయకపోగా, రోగిని మానసికంగా చంపే ఆ శాడిస్ట్ డాక్టరుకి చెప్పుతో కొట్టినట్లు సమాధానం చెప్పాడు. ఆ తర్వాత మిత్రులసలహాపై 77 అక్టోబరులో గాంధీ దవాఖానాలో చేరాడు.

రక్తగానంచేసిన కవికి రక్తానికేం కొదవఅంటూ ఉస్మానియా విద్యార్థుల నుంచి ఫ్యాక్టరీ కార్మికుల దాకా ప్రతిఒకరు చెరకోసం రక్తాన్నిచ్చారు. అవసరానికి మించి సమకూడిన రక్తాన్ని చూసి ఆస్పత్రి సిబ్బంది కూడా ఆశ్చర్యపోయారు. తన చుట్టూ పరుచుకొంటున్న స్నేహ హస్తాలని సంతోషంగా స్పృశించి, మృత్యు శిరస్సుపై చెర ధీరంగానిలబడ్డాడు. ఆపరేషన్ జరిగే ప్రతిసారీ చెర నవ్వుతూ ఆపరేషన్ థియేటర్‌లోకి పోయేవాడు మౌనంగా, ప్రశాంతవదనంతో బయటకు తీసుకరాబడే వాడు. కొద్దిగంటల తర్వాత మెల్లగా కళ్ళువిప్పి చిరునవ్వుతో అందరినీ చూసేవాడు.

క్రమంగా చెర ఎడమకన్ను చూపు బలహీనమై రానురాను అసలేకనబడకుండా పోయింది. 79 నవంబర్ 3న రెండోసారి 14 గంటల పాటు ఆపరేషన్ జరిగింది. ఆ తర్వాత పిడుగుపాటు లాంటి నిజం బయటపడింది. చెర ట్యూమర్ ముదిరి అది బ్రెయిన్ క్యాన్సర్‌గా మారిందని, రెండోకన్ను కూడా 81 నాటికి బలహీనం కావడంతో మూడో ఆపరేషన్ జరిగింది. సుమారు సంవత్సరంపాటు ఆ తర్వాత చెర చావుతో ముఖాముఖి పోరాటం చేశాడు. రేపులోకి చూసి కవితాగానంచేసే ఆ ఆలోచనకి 2-7-82 ఉదయం 2-45 కి తెరపడింది. ప్రజాతంత్రి ఉద్యమాలని అభిమానించి ప్రేమించిన వాళ్ళంతా, చెర కుటుంబానికి అనేకవిధాల తోడ్పడ్డారు. విప్లవ రచయితల సంఘం తరఫున కె వి. రమణారెడ్డిగారు చేసిన విజ్ఞప్తికి, జరిపిన కృషికి తగ్గట్లుగా ఆర్థిక సహాయం లభ్యమైంది. దేశవిదేశాల్లోని మిత్రులు ఆ విజ్ఞప్తిని అందుకొన్నారు. ఒక కవి వెనక వ్యక్తమైన సంఘీభావం చాలామందికి ఆశ్చర్యాన్ని కలిగించింది. ఈ క్షణంవరకూ అనేకరూపాల్లో అనేకచోట్ల నుంచి ఆ సహకారం అందుతూనేవుంది. ఇదంతా చెర కేవలం గొప్పకవి కావటంవల్లకాక, స్వయంగా తను విప్లవ రాజకీయాలతో మమేకం కావటంవల్లనే యింతగా ప్రజలకి చేరువయ్యాడు

ఆర్థిక దారిద్ర్యం, ప్రభుత్వ దమననీతి చెర కుటుంబం నైతికవిలువలని ఏ మాత్రం దిగజార్చలేకపోయాయి. ఎంతగడ్డుస్థితిలోనూ ఎవరి ముందు చెరగాని, శ్యామలగాని వాళ్ళ పరిస్థితి ఏకరువుపెట్టే వాళ్ళుకాదు, సహాయం అర్థించేవాళ్ళుకాదు.

తమస్థితిని పరోక్షంగా కూడా తెలియనిచ్చే వాణ్ణికాదు. చెర 'బావా' అనిపిలిచి, పిలిపించుకొనే కె. వి. రమణారెడ్డిగారొక్కరికీ మనసువిప్పి తమస్థితి చెప్పేవారు అదీ సహాయం కోసంకాక, ఉపశమనం కోసం.

చెర ఆసుపత్రిలోవున్న ప్రతిసారీ శ్యామల సేవాదీక్ష చూసినవాళ్ళకి తెలియాల్సిందేగాని' అది రాతలో వ్యక్తంచేయలేం. పెద్దపిల్ల 'ఉదయిని' సరే, తండ్రితో అనుబంధమేలేకపోయిన పసివాడు కిరణ్ యింకా చేతుల్లోవుండగానే, వాడిని నట్టింటిలో వొదిలి శ్యామల ఆస్పత్రిలో బందీఅయిపోయింది. ఆ ఆస్పత్రి అనారోగ్య వాతావరణం, వాసనలమధ్య. వంటికిపడక వస్తున్న ఎలర్జీలో చెరలానే తానూ మొండిగావుంటూ బిడ్డకు తల్లిలా సేవచేసింది. చెర మరీలేవలేనిస్థితిలో ఒక్కోసారి ఎవరూలేక చాలాఅవస్థలయ్యేది. చాలావరకు రాత్రిలు రాడికల్ పిల్లలు శ్యామలకి తోడుండేవారు. ఎవరూలేకున్నా అలానే ఒకచేత్తో కూచోబెట్టి, మొహం కడిగి, పాలుతాపించేది. మెత్తగా ముద్దలుచేసి అన్నంతినిపించేది. యీ వొక్కపని గంట గంటన్నర పట్టేది. ఒకపట్టాన ముద్దమింగడు. నోటినిండా నీరుపట్టి గుటక వేయడు. ఎన్నితిప్పలుపడితేనో నోటిలోనివి కడుపులోకిపోయేవి. ఒకసారి మందులు పొడిచేసి నీళ్ళలోకలిపి నర్సేబలవంతంగా మింగించబోతే, పావుగంటసేపు ఆ నర్సుని విసిగించి, ఆఖరికి పుక్కిలిపట్టిన ఆ నీళ్ళన్నీ ఆమెమీద కక్కేశాడు. వాళ్ళకి కూడా అలవికాక, ఆ పనులుకూడా శ్యామలకే వొప్పచెప్పేవారు. యీ పనులలో నిలబడి నిలబడి ఆమెకాళ్ళు కొయ్యలైపోయాయి.

మొదట్లోవున్నస్పృహ రానురాను బాగాతగ్గటంతో, ఎప్పుడు మూత్రింపోస్తాడో, దొడ్డికిపోతాడో తెలిసేదికాదు. బట్టల్లోనే బయలుకుపోయేవాడు. పిల్లవాడికి శుభ్రం చేసినట్లు చేసేది. మైలబట్టలు ఆరేసి, ఎండినబట్టలుకట్టేది.

ఆస్పత్రిలోచేరి ఆపరేషన్ అయ్యాకకూడా, కొంతకాలం సాహిత్యచర్చలు జరుగుతుంటే బెడ్‌మీద పడుకొనే తనూపాల్గొన్నాడు. ఆ తర్వాత ఎక్కువగావిని తక్కువగా మాట్లాడేవాడు. ఆ ఒక్కమాటలో కూడా 'చెరముద్ర' స్పష్టంగా వుండేది. ఒక్కోసారి చాలా వ్యంగ్యంగా, మరోసారి చాలా నిర్మొహమాటంగా.... చాలా అరుదుగా అసందర్భంగా. రానురాను యీమాటకరువై చూపే మిగిలింది. చెర ఒక్కమాట మాట్లాడినా చాలనుకొనేది శ్యామల. నవంబరు 81 కే మాట బాగా క్షీణించిపోయింది. మనం మాట్లాడేది అర్థమయినా చాలా ప్రయాసతో ఎంతో అవస్థ

పడుతూ ఒకటికి రెండు మాటలు అనేవాడు. ఒకసారి కావాలని కామ్రేడ్ కె. ఎస్. మీ గురించి అడిగారు. ఆయనకు ఏం చెప్పమంటావ్" అనడిగాను. అయిదు నిము షాల ప్రయాసతో "లాల్ సలామ్" అన్నాడు. కుడిచేయి కొద్దిగా పైకిలేపాడు. ఆ తర్వాత పోలీస్ ఎస్కార్ట్‌తో కామ్రేడ్ సీతారామయ్య పార్శ్వార్డ్‌కి వచ్చి అచేతన మైన స్థితిలోవున్న చెరనిచూసి సంకెల తగిలిన చెయ్యిపైకెత్తి పిడికిలిబిగించి రెడ్ శాల్యూట్స్ చెప్పారు. రానురాను బాగా గగుర్పాటు కలిగించేవో, ఆశ్చర్యంకలిగించే విషయాలు అయితేనే వాటికి ప్రతిస్పందించేవాడు. దానికే శ్యామల మొహం వెలిగి పోయేది. 13-3-82న దాదాపు ఆఖరుసారిగా మాట్లాడాడు.

రోజుకి రోజు శ్యామల ధైర్యంచెప్పుకొనేది. డాక్టర్లకే అంతుపట్టని చిత్రవిచిత్రమైన మార్పులు వచ్చిపోతుంటే అలానే నిర్నిమేషంగా నిలబడేది. చెర శరీరానికి తగిలించే గొట్టాలు, పోస్తున్నమందులు, యిస్తున్నయింజెక్షన్లు చూసి ఆ పేద శరీరంపై జరుగుతున్న హింసకి విలవిలలాడిపోయేది. యింజెక్షన్లతో రెండుజబ్బలు చిల్లులుపడి ఆఖరికి సూదికూడా దిగనంతగట్టిగా మొద్దుబారిపోయేవి. ఆ గడ్డలు కరిగించను ప్లాస్టర్లు అతికించేవారు. అలోపు ముక్కులోవేసిన గొట్టంద్వారా మందులు పోసేవాళ్ళు. గడ్డలుకరిగాక తిరిగి యింజెక్షన్లు. ఒక్కొసారి గ్లూకోజ్ ఎక్కించను రక్తనాళం దొరికేదికాదు. 82 మేలో చెరకి వృధృతంగా ఫిట్స్‌వచ్చాయి. అప్పటికే చెర శల్యం అయిపోయాడు. రక్తనాళందొరక్క తొడవద్దకోసి గ్లూకోజ్ ఎక్కించే ప్రయత్నం చేశారు. కాళ్ళమడిమలవద్ద ప్రయత్నించారు. ఆఖరికి ముక్కులోంచి కడుపులోకి వేసినగొట్టంద్వారా ఎక్కించారు. ఆ శరీరం ఎంత హింసను తట్టుకొందో చెప్పాలంటే అది అంతతేలిగ్గా మాటలకందదు. ఆపరేషన్లకి ముందు ఎక్స్-రే తీసేవారు. దానికోసం గొంతుదగ్గరి నరాలలోకి మందు ఎక్కించేవాళ్ళు. ఆ మందు సురసురలాడుతూ మంటపుట్టించేది. ఆపరేషన్ అంటే నవ్వేసేచెర, ఎక్స్-రే అంటే కనుబొమలు ముడిచేవాడు. శ్యామల యీ దృశ్యాలన్నీ చూస్తూ మూగగావిలపించేది. ఎప్పుడోకాని కంటినీళ్ళు చెక్కిళ్ళు దాటేవికావు.

82 ఏప్రిల్‌లో చెర రెండుకళ్ళు గుడ్డివైపోయాయి. కనుగుడ్డుకదలదు రెప్ప వాలదు. గుడ్డుపైచీముచేరి బుడగలాబయటకువస్తోంది. చైతన్యప్రవాహంలా బ్రతికిన చెర ఘనీభవించాడా అన్నట్లున్న ఆస్థితిలో చూడాలంటే కడుపులో దేవినట్లవుతుంది. నడకపడిపోయి, మాటపోయి, ఆఖరికి చూపుపోతే శ్యామల గుండెపగలక

ఏమౌతుంది. మాటయితే ఎంతమాత్రం రాదనుకొన్నప్పుడే శ్యామల ఆకులావాణికి పోయింది. పోయినమాట తిరిగొస్తుందని, మళ్ళీ పాటలుపాడతాడని గద్దర్ నేనూ ధైర్యంచెప్తూంటే "ఆటలుఆడి, పాటలుపాడి నినాదాలిచ్చినగొంతు.... ఆ గొంతు విన్పించదేం? ఆగొంతుకేమయింది?.... ఆ గొంతునెవరు నొక్కేస్తున్నారు?" అంటూ బావురుమంది. నోరుండీ, లేనివాళ్ళమయ్యాము. శ్యామల దుఃఖం నోరున్న వాణ్ణికూడా మూగవాడిని చేస్తోంది.

చెరపరిస్థితి యిలావుంటే ఒకపత్రికాధిపతి రచనలు పంపమని వుత్తరం రాస్తాడు. మరోసినీమా(య) నిర్మాత/దర్శకుడు "కొండలుపగిలేసినంభే" పాట యిస్తారా అని సందేశంపంపుతాడు. అక్టోబరు'81లో ఆ పాటగురించి రికవరిరూంలో బెడ్‌పైవున్నచెరని అడిగాం. "పాటచివరిలైన్లు మారుస్తాడేమో" అన్నాడు, మార్చనని హామీయిస్తే యిస్తావా అన్నాం. వోపిక కూడదీసుకొని "పాటని వ్యతిరేకమైన సందర్భంలోనో, లేక పాటతర్వాత వేరేఅర్థం వచ్చేసీనుపెడితేనో" అన్నాడు. ఆ తర్వాత "ఆ పాట ఎవరికియివ్వాలో పార్టీ నిర్ణయిస్తుంది" అన్నాడు. యీ మొత్తంమాటలు మాట్లాడను అరగంటపైగా పట్టింది. ఆ తర్వాత ఆ రాత్రింతా మరిమాట్లాడలా, సినిమాల్లో విప్లవాలని చూసేమిత్రులు చెర ఆరోగ్యకరమైన ఆలోచననుంచి నేర్చుకోవాల్సిందెంతోవుంది. కథలపోటీలు, నవలలపోటీలు, సినీమాటల- పాటలవ్యాపకం చెరని ప్రలోభపెట్టలేకపోయాయి.

విరసం, జననాట్యమండలి.... యీ రెంటిని చెర ప్రాణప్రదంగా చూసుకొనేవాడు. రెండోసారి ఆపరేషన్‌జరిగాక సిటీయూనిట్ సంకలనం "అలలు"కి అదేపేరుమీద కవితరాయమంటే, రాసియిచ్చాడు. అప్పటికి ఆపరేషన్‌అయి కొద్దిరోజులే అయింది ఆ తర్వాత గుడివాడసభలకి రాలేనిస్థితిలో "సాంస్కృతిక రంగంలోని కలుపుమొక్కలని నిర్మూలించండ"ంటూ సందేశం పంపాడు.

జైలునిర్బంధంనుంచి ఆస్పత్రి జీవితందాకా చెరకుటుంబానికి అండగా నిలిచిన వ్యక్తి, శ్యామలతండ్రిడీ, రాంరెడ్డి. ఆయన హార్ట్‌పేషంట్ పైగా పక్షవాతంతో ఒక చేయి బలహీనంఅయింది. అయినా రోజూ బోలారంనుంచి ఆఫీసుకెళ్ళేముందు ఆస్పత్రిలో యిద్దరిని పరామర్శించి, సాయంత్రం యింటికివెళ్ళేముందు రెండు మూడుగంటలు మళ్ళీ వాళ్ళవద్దగడిపి ఏరాత్రికోయిల్లుచేరేవాడు. దుఃఖమంతా గుండెలో పొదుపుకొని నెట్టుకొచ్చేవాడు. ఆ కుటుంబంలో అన్న మోహన్‌రెడ్డినుంచి అంతా చెర శ్యామలకోసం అలానేమెలిగారు.

రాడికల్ పిల్లలు యింకా ఎందరో ఆస్పత్రిలో చెర కోసం పాటలుపాడి విని పించేవాళ్ళు. పార్శ్వార్డునుంచి రికవరీరూందాకా ఎప్పుడు ఎక్కడ గద్దర్‌నుంచి ఎవరైనాసరే పాడుతుంటే చేతితో దరువువేసేవాడు. ఒకసిస్టర్ అయితే యీ పాటలు వినివిని గద్దర్ పాటలు చెరపాటలు వీలయినంతవరకూ చదివిందికూడా. ఆమె పరిమిత దృష్టితో గద్దర్ మోటుగాను చెర సున్నితంగాను రాస్తాడని నిర్ధారించింది. ఆస్పత్రిలో గద్దర్ ఆడుతూ పాడుతుంటే చెర మొహంచూడాలి.

ఏనెలకానెల చెర డిశ్చార్జిఅవుతాడనుకొనే శ్యామల జనవరి 83 కి యిక అది జరగనిపని అనుకొంది. "కవిత్వంలోనే ఇక చెరబతుకుతాడేమో"అంది. వచ్చిపోయే అనేకమంది అనేమాటలు, చెప్పేవిషయాలు, జరుగుతున్న సంఘటనలు శ్యామల ఆలోచనలని, పద్ధతులని రూపుదిద్దాయి. చెర గర్వించేలా "చెర ఆకాశంలో సగం"గా ఎంతగా శ్యామల నిలదొక్కుకున్నది చెరఅనంతరం పరిణామాలే రుజువుచేశాయి.

"చెర మాట్లాడాడా ? డాక్టర్లు ఏమంటున్నారు?" అంటూ విజిటర్లు పలకరించే వాళ్ళు. అడిగిన వాళ్ళు ఎంతో ఆదుర్దాతో అడగవచ్చుగాక ప్రతిరోజు ఏమార్పులేని ఆ ప్రశ్నోత్తరాల కార్యక్రమం శ్యామలని బాధపెడుతున్నా, అలానే జవాబిచ్చేది. ఆస్పత్రిలో అడుగుపెట్టగానే ఎదురయ్యే శ్యామల మొహం చెర ఆరోగ్యానికి ఒక రకంగా సూచికగావుండేది. ఈ సంవత్సరకాలంలో డాక్టర్లు యిక లాభంలేదు అని చెప్పిన సందర్భాలు తొమ్మిదిసార్లన్నా వుంటాయి. అన్నిసార్లు శ్యామల నరకం అనుభవించింది.

ట్యూమర్ శరీరంలోని జీవకణాలని నిర్మూలిస్తోంది. కుడివైపు ట్యూమర్‌వల్ల శరీరంలోని ఎడమభాగం చచ్చుబడిపోయింది. ఆతర్వాత నడుం, కాళ్ళు శిలల్లా మారిపోసాగాయి. ఆఖరికి కుడివైపు చచ్చుబడిపోతోంది. మృత్యువునే పరిహసించే చెర స్పృహకోల్పోయే చివరిక్షణాలవరకూ స్థైర్యాన్నికోల్పోలేదు. చూడవచ్చేవాళ్ళ చేయి గట్టిగాపట్టుకొని వదిలేవాడుకాదు. గుర్తుపట్టావా అంటే తల కొద్దిగావూపేవాడు. చెరనుంచే శ్యామల బతకడం అంటే ఏమిటో అర్థంచేసుకునే క్రమం మొదలైంది.

చెర ఆస్పత్రిలో వున్నకాలంలో మిత్రులు చెర వుద్యోగ ప్రయత్నం చేసారు. హైకోర్టు ఆర్డరుప్రకారం చెర సర్వీసులో వున్నట్లే కాబట్టి వాళ్ళు బకాయీ వేతనం కోసం ప్రయత్నించారు. ఆడబ్బు చెరపోయాక చెర సంక్షేమనిధికి చేరింది. ఈ

సమయంలో ఉలుకుపలుకులేనివ్యక్తి తరఫున వాదించి న్యాయం చేయలేసు అని, ఏమవకాల్తా చేయాలంటూ కన్నాభిరాన్ వకాల్తా ఉపసంహరించుకొంటూ ప్రభుత్వాన్ని యిరకాటంలో పెట్టారు. పత్రికలు చెర బెడ్‌పై అస్థిపంజరంలా ఎలా అంటుకుపోయింది సచిత్రవ్యాసాలు రాశాయి. ఇక బతకడనే భరోసాతో ప్రభుత్వం రపై కేసు ఉపసంహరించుకొంది.

అంతకు కొద్దికాలంక్రితమే చెరపరిస్థితిపై డాక్టర్లు ఆందోళన వ్యక్తంచేశారు. డాక్టరు రాజారెడ్డిగారు యిచ్చిన మెడికల్ సర్టిఫికేట్ (15-2-1980) యిలావుంది.

"Certified that Mr. Bhasker Reddy, was admitted as an in-patient on 30-8-79. Patient was found to have Rt. Frontal Meningioma and was operated upon in Oct 77. Sub-total excission of the tumour was undertaken. The tumour recurred again in 19 9 and was again operated up on in Oct. 79 by me. Total excision was undertaken. The Biposy report confirmed this to be a Malignant Meningioma which was confirmed by the Director of Tumour Registration at Safderjung Hospital, New Delhi.

Now it is clear cut that the tumour is highly malignant and the PATIFNT MAY NOT SURVIVE FOR MORE THAN FEW MONTHS TO AN YEAR."

అంధేరిప్రభుత్వానికి నమ్మకంలేక ఎందరో సిఐడీలని ఆస్పత్రికి పంపింది. ఒకడు తాను ఆర్‌ఎస్‌యులో పనిచేస్తుంటానని చెబుతూ చెరవుండే పార్శ్వవార్డులోకి వచ్చాడు, అయితే వచ్చినతను పోలీసుధోరణిలో ప్రశ్నలుఅడగటం మొదలెట్టాడు. "ఎవరెవరు చూడవస్తుంటారు! అవసరమైతే లేచితిరగగలడా" అనికూడా అడిగాడు. ఇటువంటిస్థితిలోకూడా తనని వదిలిపెట్టని పోలీసులంటే శ్యామలకి కంపరంపుట్టింది.

"ఇన్నిపత్రికలు, యింతమంది ఆయనగూర్చిచెబుతున్నా, ఆఖరికి మీకళ్ళతో మీరుచూసినా మీకునమ్మకంలేదా? ఈమాత్రిందానికి దొంగపేర్లతో ఆర్‌ఎస్‌యు అనో మరొకటిఅనో చెప్పుకురాను సిగ్గుగూడాలేదా?" అని దులిపేసింది. వాడుమళ్ళ ఆస్పత్రి మొహంచూడలా.

శ్యామల చెరబండరాజులు గాంధీఆస్పత్రి ఉద్యోగులు డాక్టర్లకి అత్యంత ఆప్తులయ్యారు. చెరకి దాదాపుచిరునామాగా మారిపోయిన గాంధీఆస్పత్రిలోని సిబ్బంది శ్యామలకష్టం తమకష్టంగానే భావించారు ఒకవంక చెరని కంటికిరెప్పలా

కాపాడుకుంటూనే, అక్కడివాళ్ళతో శ్యామల ప్రవర్తించినతీరు ఎందరో ఆత్మీయు లని పొందేలాచేసింది. ఇంతకష్టంలోనూ, రాత్రిలు పడుకుబోయేముందు తప్పని సరిగా పుస్తకాలు చదువుతుండేది. ఈ అధ్యయనం, చైతన్యం పట్టుదల శ్యామల బాటని స్పష్టంచేస్తున్నాయి. ప్రజల్లోలీనమై, ప్రజాపుద్యమాల్లో సంలీనమైన కామ్రేడ్ చెరబండరాజుకోసం శ్యామల అన్వేషణ ఉద్యమాభిముఖంగానేసాగాలి.

కామ్రేడ్ చెర మెడికల్ రిపోర్టు

1974 సం॥రంలో కామ్రేడ్ చెరబండరాజుకి తలనొప్పి ప్రారంభమైంది.

1975 సం॥రానికి అపుడపుడు కళ్ళు బూదరలు కమ్మటం, తలనొప్పితోపాటు తలతిప్పుడు మొదలైనాయి. అల్సర్‌కిచికిత్స

1976లో ఉస్మానియా ఆస్పత్రిలో న్యూరోసర్జన్‌కి చూపించుకొన్నాడు. అప్పుడే చెరని సైకియాట్రిస్ట్ వద్దకి పరీక్షకి పంపారు.

తలనొప్పికి కారణం మెదడులో కణితి (బ్రెయిన్‌ట్యూమర్) అని అక్కడి డాక్టర్లు చెప్పకున్నా, కొద్దిమంది చెరమిత్రులు తెలుసుకోగలిగారు. మెదడుకి కరెంట్ షాక్‌ట్రీట్‌మెంటు ఆస్థితిలో సామాన్యంగా యివ్వకూడని షాక్స్ యివ్వటం జరిగింది. ఏమైనా అనూహ్యపరిణామాలు ఎదురయితే, ప్రాణం పోవచ్చుకూడా. ఎమర్జన్సీ కావటంవల్ల ఆస్పత్రి నుంచి తిరిగి చంచల్‌గూడా జైలుకి చెరని పంపారు.

1977 ఏప్రిల్ / మే చెరని నిజాం ఆస్పత్రిలో చేర్చారు. రక్తం దొరకలేదన్న నెపంతో ఆపరేషన్ జరగలేదు.

పోలీసులు డాక్టర్లపై వొత్తిడి తీసుకరావటం, ఆస్పత్రిలో అనుమానాస్పద పరిస్థితులు గమనించి, చెర అక్కడి నుంచి బైటపడ్డాడు.

1977 అక్టోబర్ గాంధీ జనరల్ ఆస్పత్రిలో చెరని పరీక్షించి, డాక్టరు రాజారెడ్డిగారి ఆధ్వర్యంలో చెర మెదడుకి శస్త్రచికిత్స చేశారు.

అప్పుడు పరీక్షవల్ల తెలిసింది. DIAGNOSIS BRAIN TUMOUR - (MENINGEOMA BENINE) - (PATHOLOGY - CONFINED Rto FRONTAL) మొదటిసారి మెదడుకి శస్త్రచికిత్స అయింది చెర క్రిమంగా కోలుకొన్నాడు.

1979 సంవత్సరం క్రితంపరిస్థితి తిరిగిఏర్పడటంతో పరీక్షించి, ఆపరేషన్‌కిఏర్పాట్లు చేశారు. ఎడమకన్నుచూపు బలహీనంగా మారిపోయింది.

నవంబర్ 3న రెండవసారి మెదడుకి శస్త్రచికిత్సజరిగింది. 14 గంటలపాటు ఆపరేషన్ జరిగింది. ఎడమకన్ను చూపునికోల్పోయింది. కుడికన్నుమాత్రమే కన్పిస్తోంది.

DIAGNOSIS - BRAIN TUMOUR - RECURRENCE - MENINGEOMA MALIGNANT TUMOUR - ఈ ఆపరేషన్ తర్వాతనే చెరమెదడుకి క్యాన్సర్‌సోకినట్లు కనుగొనటం జరిగింది. డాక్టరు రాజారెడ్డిగారి ఆధ్వర్యంలోనే రెండోఆపరేషన్ జరిగింది.

1981 తలనొప్పి, తలతిరగటం, కుడికన్ను సరిగా కనబడకపోవటంతో తిరిగి ట్యూమర్‌పెరిగిందేమోనన్న అనుమానంతో గాంధీఆస్పత్రిలో చూపించుకొన్నాడు.

14-7-81 న గాంధీ ఆసుపత్రిలో మూడోసారి ఆపరేషన్‌కి చెర జేరాడు.

28-7-81 న డాక్టరు రాజారెడ్డిగారి ఆధ్వర్యంలో మూడోసారి మెదడుపై శస్త్రచికిత్స చేశాడు.

ఆగస్ట్ వరకూ క్రమంగా చెరకోలుకోవటం, బాగామాట్లాడటం, చదవటం జరిగింది.

3-9-81 న జనరల్‌వార్డులోని పార్శ్వవార్డుకి చెరని తరలించారు.

సెప్టెంబర్ క్షీణత ప్రారంభమైంది. ఆగకుండా విరోచనాలు....

3-10-81 న డాక్టర్లు పరీక్షించి, నమోదుచేసిన అభిప్రాయం "పేషంట్ స్పృహలో వున్నాడు. బాగావుత్సాహంగా, మెలకువగాలేడు— సంజ్ఞలకి, మాటలకి ఒక్కోసారి పలుకుతాడు, ఒక్కోసారి మౌనంగావుంటున్నాడు." బాగా ఎక్కిళ్ళురావటం దాదాపు 15 రోజులపాటు....

7-10-81 గుడివాడలో జరిగే విరసం సాహిత్య పాఠశాలకి సందేశం

నవంబరు- ఎక్కిళ్ళు అలానే వస్తున్నాయి. ప్రత్యేక నిపుణుల పరీక్ష నిమిత్తం మద్రాసుకి ప్రయాణం. అక్కడ డాక్టరు కల్యాణరామన్ చెప్పిన అభిప్రాయం.

చెర బహుశా కోలుకోలేకపోవచ్చు- బాగా వేగంగా ట్యూమర్ పెరగటం దానికితోడు మరోవ్యాధి HYDRO CAPHALUS బయటపడటం. ఏ

యాంటీబయటిక్స్ పనిచేయకపోవటం (ANTIBIOTIC RESISTANT) ఎక్కిళ్ళు ఆగిపోయాయి. సికింద్రాబాద్‌కి తిరుగుప్రయాణం. కల్యాణరామన్ సూచనమేరకు A V. SHUNT అనే మైనర్ ఆపరేషన్ నిర్వహించటం ఆశాజనకంగా పరిస్థితిలో మార్పు-

26-11-81 చెర స్పృహలో వుండి తిరిగి మాట్లాడగలగడం.

29-11-81 మాటబంద్.... పరిసరాలు మౌనంగా గమనిస్తు వుండటం 'ప్రస్థానం'పై వచ్చిన రివ్యూలు చదివివినిపిస్తే, వింటున్నాడు.

డిసెంబరు శరీరంలో ఎడమభాగం చచ్చుబడిపోసాగింది.

డిసెంబరు చివరివారం- పరిస్థితి మరింత ఆందోళనకరం - జ్వరం - వాంతులు - విరేచనాలు - మాటలేదు - ట్యూబ్ ద్వారా కడుపులోకి ఆహారం

జనవరి గట్టిగా పిలిస్తే చూస్తాడు. చేయి పట్టుకొని వదలడు. చేయిబాగా నొప్పిస్తే 'అయ్యో' అంటాడు.

25-2-82 X-రే థెరపీ (రేడియమ్) ప్రయత్నించడం వారంపాటు కాన్సర్ ఆస్పత్రిలో వుండటం- మొదటిసారి రేడియమ్‌చికిత్సకీ శరీరం తట్టుకోలేనిస్థితి-

3-3-82 ఘెరప్రాణం గంటలునిముషాల్లోవుందని డాక్టర్లు హడావుడిచేశారు వాళ్ళ నిర్లక్ష్యాన్ని, అక్కడిపరిస్థితిని గమనించి చెరని రాత్రి 9-20 ని॥లకి గాంధీ ఆస్పత్రికి తరలించారు,

8-3-82- పాతషంట్ స్థానే కొత్తషంట్ వేశారు.

10-3-82 తిరిగి రికవరీరూమ్‌కి తీసుకొచ్చారు.

13-3-82 సాయంత్రం 5 గంటల ప్రాంతాన దాదాపు అక్షరుసారిగా మాట్లాడటం- "ఎ....ట్లా....నో....అ....వు....తుం....ది మీ...."

23-3-82 ఎక్కిళ్ళూ తీవ్రంగా వస్తున్నాయి....ఫిట్స్....

6-4-82 జ్వరం విరేచనాలవల్ల SHUNT (left side) ఆపరేషన్ వాయిదాపడింది.

8-4-82 ఆపరేషన్ జరిగింది. పరిస్థితిలో పెద్దమార్పులేదు. మొహంలో తాత్కాలికంగా కొంచెంతేటపడింది.

10-4-82 మళ్ళీవాంతులు.... రెండురోజులుగా మూత్రంరావటంలేదు. గ్లూకోజ్‌వల్ల వాంతులుతగ్గాయి. ఎర్రగా మూత్రింవస్తోంది.

21.4.82 లోపల ట్యూమర్ విపరీతంగాపెరిగి కుడికన్నుపై తీవ్రమైన వొత్తిడి తీసుకరావటం. కనుగుడ్డు కదలికలేక బిగిసిపోవటం. కళ్ళల్లోచీముగారి రెప్పవేయలేనిస్థితి ఏర్పడటం. దాదాపు కుడికన్ను చూపుకోల్పోయిన స్థితి.

24.4.82 ట్యూమర్ కన్నుని బయటకు నెట్టేస్తోంది....

26.4.82 కంటి నిపుణుడు పరీక్షించి లాభంలేదనిచెప్పాడు. ఆయింటుమెంటు, డ్రాప్స్‌వల్ల కళ్ళచీముతగ్గి, గుడ్డు అటూయిటూ కదులుతోంది. కణితి పెరిగి కన్నుపై విపరీతమైన భారంపడుతోంది. చూపు.... మాట.... కదలిక....లేవు. ప్రస్తుతం గుండె శ్వాసకోశాలు.... మూత్రపిండాలు.... మాత్రమే పనిచేస్తున్నాయి.

20.5.82 వువృతంగా ఫిట్స్ వస్తున్నాయి. తట్టుకోలేక పోతున్నాడు.

23.5.82 గ్లూకోజ్ ఎక్కించను రక్తనాళం దొరక్క కాళ్ళు, తొడవద్ద కోసినా ప్రయోజనం లేక, ముక్కుగొట్టం ద్వారా ఎక్కిస్తున్నారు. అరగంటకోసారి ఆపి ఎక్కిస్తున్నారు. ఎక్కిళ్ళు మళ్ళీ వస్తున్నాయి.

8.7.82 ఈరోజు సాప్టాన్ (గంజి) యిచ్చారు. గొట్టంద్వారా.

9.6.82 102 నుంచి 103 దాకా జ్వరం. కడుపులోని గొట్టం దగ్గర చిన్నరంధ్రం ఏర్పడి, అందులోంచి సన్నగా నీరొస్తోంది.

19.6.82 బి.పి. (B P.) 90కి పడిపోయింది. జ్వరంకూడా వస్తోంది.

22.6.82 కోలుకోవడం యిక అసాధ్యమని వైద్యబృందం అభిప్రాయం. కన్నీళ్ళు అదిమి పెట్టుకొంటూ డాక్టర్ రాజారెడ్డి రికవరీ రూంనుంచి బయటకు వెళ్ళారు.

30.6 82 ఎటూతేలని స్థితి....

2.7.82 ఉదయం 2.45 ని॥లకి అమరత్వం

....

ఎరుపుపాట మిగిలేవుంది
ఎఱ్ఱజెండ ఎగురుతోంది
తూర్పుదిక్కు పొడిసిరావా
సూర్యునితో గలిసిరావా

'నిజాయితీ చెరబండరాజు స్వదస్తూరీ'

కె. వి. ఆర్

విప్లవ రచయితల సంఘం ఇంకా కాలగర్భంలో వుంటూ స్పష్టమైన ఆకారం తాల్చకముందునుంచీ దానిపుట్టుకకు సంబంధించిన సన్నాహాలలో చెరబండరాజు కృషి కూడావుంది. ఆ తర్వాత చాలాకాలం వరకుకూడా సదరు నేపథ్య ప్రయాత్నాల వృత్తాంతం గుట్టుగా అతని గుండెలోపలే మణిగి వుండేది తప్ప. వివరాలకోసం నోరువిప్పి ఎన్నిసార్లు ఆ ప్రస్తావన తెచ్చినా, చిరునవ్వుతోనో ముక్తసరిమాటలతోనో నాకు అతని నుంచి జవాబు ముట్టేది. ఆప్తులలో నేను అతనికి ఎవరికంటె వెనకబడక పోయినా ఆ విషయాన్ని మాత్రం నానుంచికూడా 'బ్రహ్మరహస్యం' లాగా దాచే వాడు. నేటికీ నాకు అదొక మర్మంగానే నిలిచిపోయింది. ఎందుకు చెబుతున్నానంటే మైత్రికూడా అతని గుండెను విప్లవక్రమశిక్షణ విషయాలలో కరిగించి ఎరగదని స్వానుభవపూర్వకంగా సూచించేందుకే. అయితే దాని ఫలితం మాత్రం చరిత్రకు కొంతమేరకైనా నష్టం.

హైదరాబాదులో యం. టి. ఖాన్ సాయంతోటి వి. ర. సం, రెండో మహాసభ కోసం నేనొక్కణ్ణీ కిందుమీదౌతూ వుంటున్నప్పుడు మహాసభ ప్రారంభదినం సాయంకాలానికి లాల్చీ, ధోవతీలతో తానూ, తృప్తితో గూడిన చిరునవ్వులతో మరింత ప్రసన్నమైన ముఖంతో తన శ్యాపుల ఆవెంట నిఖిలేశ్వర్, యామిని, మావైపుగా నడిచిరావడం కళ్లలో ఇంకా మెదులుతూ వుంది. ముషీరాబాద్ జైలునుంచి విడుదలై ఒక్కదినం కూడా పూర్తికాలేదేమో? కూడా జ్వాలాముఖి ఆయన భార్యకూడా వున్నారు. మాజీ దిగంబర కవిత్రియం విప్లవ రచయితలుగా మారి రెండేళ్లు నిండలేదుగాని, ఎన్ని దినదినగండాలూ మరెన్ని శిక్షలూ వైయక్తిక బాధలూ ఆ కొద్దికాలంలో క్రిక్కిరిశాయో తలచుకుంటే, ముఖ్యంగా బాగా అలవాటుపడిన యీకాలంతో పోల్చుకుంటే, అప్పటి వుద్వేగాలు మళ్లీ గుండెల్లో పందడిస్తాయి. అదిసుతా చెరబండరాజు నాతోనేగాదు, సంస్థతో తన అభేదాన్ని యావజ్జీవమూ నిరూపిస్తూ నిలిచాడు, అయితే సంస్థతో అతని అనుబంధానికి నాంది ఇదేనని అనడంలేదు. 1970 జూలై 4న హైదరాబాద్‌లో నాంపల్లి స్టేషన్‌వద్ద ఇంపీరియల్ హోటల్‌లో గడిపిన చరిత్రాత్మకమైన రాత్రి కూడా దానికి మొదలేమీ కాదని ప్రారంభంలోనే రాసివున్నాను, నలుగురి ముందుకు వచ్చిన పర్యవసానం మాత్రం ఆరాత్రికే చెందింది అప్పుడు. మాగదిలోకూర్చున్న ముప్పైనలభై మంది లోనూ ఎందరిప్పటికి సంస్థలో మిగిలివున్నారో, వున్న ఎందరిలో అలనాటి సాహసో పేతమైన సంకల్పతీవ్రత, దీక్షాపటిష్ఠత నిలిచివున్నాయో చూసుకుంటే, నావిషయంలో

నేనే సిగ్గుపడవలసివస్తుంది గాని, చెరబండరాజు గురించి మాత్రం తానుగాని, తది తరులుగాని అలాంటి సిగ్గుపడవలసిన అవకాశాలు బహుకొద్ది.

తీరనిబాధగామిగిలిన చెరబండరాజు స్మృతికణాల్లో గర్వించవలసిన అంశాలు అనేకంగావున్నా, అతనూ మనిషేనన్న వాస్తవాన్ని మరిచినట్లయితే అతనొకపూజా విగ్రహంగా మారేప్రమాదంవుంది. అనుబంధాలవిషయంలో ఆతనిపరిధి చాలా కొద్దిపాటిది. సికిందరాబాదు 'కుట్ర' కేసు నిర్మాతలలో ఒకరైన పోలీసాఫీసరు ఆల్ఫ్రిడ్‌తోసహా అతను చిరునవ్వుతోనిలిచి చనువుగామాట్లాడని వ్యక్తులులేరు. అది కపటమూకాదు. మొదటశ్యామల, తర్వాతబుజ్జి (ఉదయిని), ఇంకా పిమ్మట కిరణ్ - ఇదే అతని 'స్వ'ప్రపంచం. దీనికేకట్టుబడివుంటే అతను మంచిగృహస్థు అనిపించుకునేవాడు-అంతే. సంసారం అతన్ని ఎంతగట్టికట్టుతాటితోనైనా కాలికి బంధంవేసే గుంజగా మారలేదుగనకనే, చెరబండరాజు కాగలిగాడు. సంసారాన్ని సుఖపెట్టాలనేదుగ్ధవున్నా, సంపాదనకు ఎన్నితూట్లుపడి చివరికి పూడనిగోయిగా మారినా, అతనిధ్యానమాత్రం అంబర్‌పేట అద్దెకొంపమితులను దాటి చాలాదూరం, చాలాఎత్తు చూసుకుంది. వి.ర సం.కూడా అతని పూర్తిఅభిమానానిరి హద్దులు నిర్ణ యించలేకపోయింది. రాడికల్‌స్టూడెంట్స్ యూనియన్‌గాని, రాడికల్‌యూత్‌లీగ్ గాని, జననాట్యమండలిగాని, ఏదీ అతని వుత్సాహానికి గిరిగీయలేకపోయింది. మనస్సుమనస్సంతా ఒకేఒక్క-అంశంమీద నిలిచింది. దానిపేరు విప్లవోద్యమాల అగ్రిగామిత్యం. చెరబండరాజు దానికి అన్నివిధాలబద్ధుడు, దానిమాట అతనికి సుగ్రీవాజ్ఞే. విమర్శకు ఎడమీయనంతటి విధేయత, స్వతంత్ర ఆలోచనకో వాదానికో భిన్నాభిప్రాయప్రకటనకో పూనుకోనీయనంతటి పూర్తిఆత్మీయత, చెరబండరాజును పార్టీమనిషిఅనేమాటకు పరవడిగాచేశాయి. భావస్వాతంత్ర్యాన్ని విప్లవనాయకత్వానికి తాకట్టుపెట్టుకున్నాడని, దాసానదాసుడయ్యాడని ఎవరైనాదీన్నిబట్టి అనుకుంటే, వాళ్లు చెడ్డవాళ్లో, లేక తలచెడ్డవాళ్లో, విప్లవనాయకత్వంలో అతనుచూసింది ఏ అధికార యంత్రాంగాన్నోకాదు- మనస్యులైన మనుషుల్నిమాత్రమే. పార్టీలో అతనికి కని పించింది సభ్యులల్లో రహస్యపత్రికలో, శాఖీదులోకావు- వుద్యమించసాగిన పీడితులపక్షాననిలిచి వజ్రసంకల్పంతోకలిగిన హృదయమార్దవానికి రూపుగట్టిన నాయ కత్వాన్ని మాత్రమే. గింజలురాలని పంటల రాతినేలనుంచీ, అజ్ఞానంతోముడుచుకు సాంప్రదాయికతతో మురుగుపట్టిపోయిన గ్రామసీమనావరించివున్న చీకటిరాత్రి నుంచీ, పనిపాటల్లో అరిగిపోయిన చెమటశరీరాల 'అలగా'జనాన్ని తిట్లతో తన్నులతో శ్రమదోపిడితో పటేల్ పట్వారీగిరుల్తో అణిచి తొక్కిపట్టివుంచిన బకాసుర హిడింబా సుర పరిపాలనలో 'నీకాల్మొక్తదొరా!' రివాజుమాటలు శతాబ్దాలుగా వినిపించేదాస్య

మనస్కుతనుంచీ, అతను పుట్టుకొచ్చాడో, పెరుగుతూ నేర్చుకుంటూ క్రమంగా వేటిని అసహ్యించుకున్నాడో, వాటన్నిటికీ విరుగుడు విప్లవోద్యమంలో కనిపిస్తే, దానికి విధేయంగా అనుకూలంగా వుండక మరెలాగుండగలడు ? పైగా తన పసితనంతో అంకుశాపురం సమీపాన్నే రోడ్డుపక్క పొదల్లో తుప్పల్లో తెలంగాణా రైతాంగ పోరాటానికి చెందిన కొన్నిదృశ్యాలను స్వయంగానేచూసి మనస్సున ముద్రించుకుని వున్నడాయె ! పొరుగున్నేవున్న నల్గొండ పెనుసంచలనాలు తనచెవులగూడాపడ్డాయి. అలనాటి 'సంగం' ఇప్పటి నక్సల్బరీలో అతనికి కనిపించడంలో ఆశ్చర్యంలేదు. అది గతమేకాదు, ప్రస్తుతం. ప్రస్తుతమేకాదు, భవిష్యత్తు. అందుకే నిండుగా దానికి స్వాగతంచెప్పాడు. అదే మనస్సుకు బలంగాపట్టింది. దాన్నిపూజించలేదు. మనసారా ప్రేమించాడనడమే నిజం. 'తన్మయత్వం' అనేమాట వాడవలసి వస్తుంది.

కవిగా అతని వాణి ఎన్నోవేదికల మీదినుంచి పాటగా వెలువడి వేలాది కరతాళ ధ్వనులతోగూడిన ప్రజామోదాన్ని చూరగొన్నాక, వ్యక్తిగా అతను శక్తి అయ్యాక, చాటుమాటున కొందరు పెద్దలు (ఈనాడు మనలో లేరు) చెరబండరాజును అతని రాజకీయ పంథానుంచి మంచి మాటలతో తమవైపుకి తిప్పుకోవాలని చేసిన ప్రయత్నాలన్నీ ఆతని గట్టిగుండెదాకా వెళ్ళనట్టేవెళ్ళి, దాన్ని తాకినవెంటనే ముక్కలుముక్కలై పోయాయి. "సాయుధ పోరాట విరమణ 'విద్రోహం' " అంటూ కోర్టుల్లో ఎగ్గూ సిగ్గూ విడిచి అతని పంథాను తూలనాడిన వారితోగూడా అతను చనువుగానే మాట్లాడుతూ వచ్చినా. నిమిషకాలమైనా సరే వారినెవ్వరినీ తన అభిమానకేంద్రానికి దాపు చేసుకోలేదు. ఆశ్చర్యకరమూ హాస్యకరమూ అయిన విశేషమేమిటంటే, కోర్టులో మొదట ఒకబృందం పైకిలేచి ఆలపించేపాటా, అదికూర్చున్నాక వెంటనే నినాదాలతో లేచిన మరోబృందం ఆలపించేపాటా, రెండుపాటలూ చెరబండరాజువే. 'వర్గశత్రు నిర్మూలన' పంథావల్ల శ్రీకాకుళంలో విప్లవోద్యమానికి నష్టంవచ్చిందని ఎవరైనా భావించి, అతనితో ప్రస్తావిస్తే, ససేమిరా ఒప్పుకునేవాడుకాదు, అది పాపమని జీవకారుణ్యదృష్టితోనో, అపరాధమని మరోదృష్టితోనో ఆ అభిప్రాయాన్ని ప్రకటించడంలేదని తెలిసికూడా, అదే ఏకైక పోరాట రూపం కాగూడదనీ ఒకానొక పోరాట రూపం కావచ్చుననీ కొందరు జైలుచర్చల్లో చెప్పినా, అతను మాత్రం మౌనంతోనో భిన్నాభిప్రాయంతోనో జవాబిచ్చేవాడు, 'వర్గకసి' ప్రస్తావించిన వాళ్ళలో లోపించి అతనిలో అతిశయించడం దీనికికారణం కాదు, 'ప్రతిహింస' గురించి అభ్యంతరంచెప్పిన వాళ్లూకాదు, అయినా తానుసరైందని నమ్మినదాన్ని మొగమోటంకోసమో ముఖప్రీతికోసమో వదులుకునేతత్వం చెరబండ

రాజును కోసిచూసినా కనిపించదు, అతనిది మహోగ్రమైన, ఏకాగ్రమైన భావకేంద్రీకరణ అనేందుకే ఈ ఉదాహరణ. వ్యక్తిపై మనస్తాపాలుగా పైపైన కనిపించే విభేదాల వెనక కూడా చెరబండరాజు ఆవేశాల్లో ఆలోచనల్లో కలగలిసిపోయింది సాయుధ ప్రజాపోరాట పంథా మాత్రమే. అతని రాగద్వేషాలు తీవ్రమైనవి, అతని నిబద్ధత మెత్తబడనిది.

తనకుఆప్తులనుకున్నవారు రాజకీయంగా తప్పుధోరణులు ప్రదర్శిస్తున్నారని నాయకత్వం భావించినప్పుడు, వారినికూడా తాను వెనకేసుకురాలేదు. 'వి.ర.సం.లో మార్క్సిస్టు వ్యతిరేకధోరణులు' అనేపుస్తకంలో నేను ఎన్నోవిమర్శలకు గురౌతున్నానని ముందుగా తనకుతెలిసికూడా, నాయకులదృక్పథాన్నే సమర్థించాడుతప్ప, నా మైత్రికి ప్రాధాన్యమివ్వలేదు. అంటే విప్లవోద్యమం చెరబండరాజుకు గీటురాయి, మరి, వి.ర.సం.లో 1972 తర్వాత క్రమంగా రెండుపంథాలనభిమానించే రచయితల బృందాలమధ్య అనేక విషయాలలో విభేదాలుతలెత్తిన సందర్భాల్లో, చెరబండరాజు తన విమర్శతో అవతలిబృందాన్ని ఎదుర్కొనడంలో వింతేమిటి? అతనికి వ్యక్తులకంటె ముఖ్యమైంది ఆవ్యక్తులు ఏ రాజకీయపంథాకు అనుకూలురన్న అంశమేతప్ప మరొకటేదీకాదు. అయితే తనలో కేవలం వైయక్తికమైన యిష్టాయిష్టాలేవీ లేనేలేవా అంటే లేదనిచెప్పేధైర్యం నాకులేదు. ఎందుకంటే. అలాచెప్పడం అబద్ధమే అవుతుంది. సంస్థగా వి.ర.సం. ఏవ్యక్తినీ కేంద్రబిందువుగా చేసుకుని అతని కనుసన్నల్లో అడుగుజాడల్లో 'రిమోట్‌కంట్రోల్'లోనైతం వుండగూడదని తాను బలంగా అభిప్రాయపడేవాడు. అలాంటి వ్యక్తులవద్ద తనమనస్సు విప్పేవాడుకాదు. ఇక స్వారోపితమైన ఆధిక్యతాభావాన్ని ప్రకటించేమనుషులంటే అతనికి సహించరానిదేమి కాదు, ఒకవిధంగాచూస్తే. అతనికి ఇతరులగురించి సాధారణంగాకొన్నీ నిరాధారంగా కొన్నీ అనుమానాలుండేవి.

ఇంతకీ తనకు సిద్ధాంతపరిజ్ఞానం తగినంతగా వుండేదికాదు. అంటే. 'పుస్తక పాండిత్యం' కొద్ది. దీనికి ముఖ్యకారణం అతనికి ఇంగ్లీషు సరిగారాకపోవడమే. ఆలోటు పూడ్చుకునేందుకు ఎక్కడెక్కడి పాత తెలుగుపుస్తకాలో తెచ్చి వీలున్నంత వరకు చదివి ఆకళింపుకునేందుకు ప్రయత్నించాలని అనుకుంటూనే, తగినంత తీరిక లేక ఆ పని చెయ్యలేకపోయాడు. పుస్తకపాండిత్యంకంటె ఎక్కువగా క్రియాశీలమైన ఆచరణాత్మకతే చెరబండరాజులో కనిపిస్తుంది. ఒకవిధంగాచూస్తే, అలాంటి పరభాషాపాండిత్యం లేకపోవడంవల్లనే అతని చక్కటి సుదీకారంతోటి మంచి తెలుగు పాటలు రాశాడేమోననిపిస్తుంది. అతనివేవీ అరువునగలుకావు, నేలకంటుకుపోయిన అంట్లూకావు. సహజసరళత్వమే వాటిఆస్థి పుష్టి.

ఆ పాటలైనా ఎక్కువగా పూలకుండీ మొక్కలుకావు. ఎమర్జెన్సీకాలం జైలు జీవితంలోనూ అంతకుముందూ సంకర్బతీవ్రత అతని చేతికి రాత్రికిరాత్రి పనికల్పిస్తూ తెల్లారేప్పటికల్లా కొత్తపాటలో రూపందిద్దుకునేది. అరదండాల చప్పుడే తాళంగా జైలు నుంచి కోర్టుకి దారిపొడుగునా పోలీసువేన్ అతని పాటలకు మేము కలిపిన భిన్న శృతులలో మారుమోగిపోయేది. అతనేమీ పెద్దపాటగాడుగా లెక్కకురాకున్నా, ఎన్నో పాటలవటిన ఏకతాళమనిపించినా, కాలితో దరువువేస్తూ పీలగొంతు కీచుపోయేంతవరకూ పాడేవాడు. ఊరేగింపు సాగేప్పుడు నినాదాలిస్తే తీరాసభలో పాట పాడవలసివచ్చేసరికల్లా గొంతుక బొంగురుపోతుందేమోనని నినాదాలతో గొంతు చించుకోకుండా ముందుజాగర్త పడడం, ఆతనికి కవి - గాయకుడుగా ప్రసిద్ధివచ్చాకే ఎక్కువైంది. ఇక, సభల్లో కవితాగానానికి సంబంధించిన కార్యక్రమాలుగానీ సాంస్కృతిక ప్రదర్శనలుగానీ తన చేతిమీద జరగకుంటే బాధపడేవాడు. జననాట్య మండలికీ వి.ర.సంకూ తాను వంతెనకట్టాడు. కవుల్లోకవి, పాటగాళ్ళలో పాటగాడు అనిపించుకున్నాడు. పెద్దల్లోపెద్దగా, పిన్నల్లో పిన్నగాగాక, పెద్దల్లో పిన్నగా పిన్నల్లో పెద్దగా వుందామనుకున్నాడేమో. ఒకవైపున ప్రచారమనిపించని కళాంశతో రాజకీయ విషయాల గురించి రాశాడు, మరోవైపున చెట్టుచేమల్లో పశుపక్షుల్లో సంకేతాలు ఎంపికచేసుకుని పసిపిల్లలను వుల్లాసపరుస్తూనే పోరాట విషయం చొప్పిస్తూగూడా పాటలురాశాడు. రాజకీయానికీ కళకూ పొత్తుకుదరకపోదని తన గీతాలద్వారా నిరూపించిన కవి చెరబండరాజు.

ఆరోగ్యంగా జీవించినంతకాలమే రాసి ఆతర్వాత వెంటనే కలంసన్యాసం చేసేవాళ్ళు ఎందరైనా కనిపించవచ్చుగాని, మెదడూ చెయ్యీ పనిచేసినంతకాలం రాసినవాళ్ళు అరుదు. మూడుమార్లు మెదడు ఆపరేషన్ జరిగి కనుచూపుతోబాటు చెయ్యి కూడా తనపనికి సమ్మెకట్టాక ఒకసారి ఆస్పత్రిలో చీటీమీద నాకేదో విషయం రాసి చూపుదామనుకుని ఎంతోకష్టంతో రెండుమాటలేరాసి మూడోది తట్టకుండా మధ్యలోనే నిలిపివేయవలసి వచ్చింది. కాని, కొద్ది మాసాలక్రితం తానే మృత్యుంజయుడిలా 'అరచేతిని ఖండించినానరే, పట్టిన కత్తి-కలాన్ని కిందికి జారవిడిచేదిలేదు పొమ్మనే పాటరాసిందీ తానే. రాజకీయంగా తనకు స్పష్టమైన అవగాహన, దృఢమైన విశ్వాసం ఏర్పడకముందునుంచీ కవిగా తాను పేరుతెచ్చుకున్నాడు. ఎంతో సాధనఫలితంగా చేకూరిన ఈ కళాప్రజ్ఞను విప్లవాలయుగంలో మేల్కొంటూన్న పల్లెల పీడితజన పోరాటాలకు సొంతం అంకితం చేశాడు. తిత్తినిండా గాలి పొత్తంగావుంది బొగ్గులు రగులుకుంటున్నై మంటలేస్తూంది. రామన్నగానీ రాజన్నగానీ చెయ్యవలసింది దాన్ని జీవజ్వాలగా నిలపడమే. అదే గౌరమ్మకల, కాంతియుద్ధం పర్యవసానమే విముక్తి.

చెర కవిత్వం - విప్లవ చైతన్యం

జె. సి.

అదనపువిలువ దోపిడిని నిరంతరంగా కొనసాగించడానికి అనువుగా వర్గ సమాజం సృష్టించిన మార్మికత (mystification) ను సరుకులమాయ(Commodity fe ishism) ను అధిగమించి కవిత్వాన్ని తిరిగి నిజమైన విప్లవాచరణగా మార్చిన కొద్దిమందికవుల్లో చెరబండరాజు అగ్రగణ్యుడు. దిగంబరకవిగా మొదలయి విప్లవ కవిగా ఆయనలోవచ్చిన పూర్పుక్రమం విప్లవ గతితర్కానికి అనుగుణమైంది. ఈ మార్పు చెరబండరాజు విప్లవకవుల్లో అగ్రగణ్యుడుకావడానికి ఎలాతోడ్పడిందో ఈ వ్యాసంలో చర్చిద్దాం.

సామాజిక చైతన్యరూపమయిన కవిత్వం గతితార్కిక చారిత్రిక భౌతికవాదం ప్రకారం జ్ఞానసిద్ధాంతంతో ముడివడిఉంది. కవిత్వానికి భౌతికపునాది సమాజం. దానిమాధ్యమం (medium) సామాజిక భౌతికోత్పత్తి అయినభాష. దానిసారం (essence) సమాజంలోని ఉత్పత్తిసంబంధాలచేత ప్రభావితమైన విలువల్ని సూచించే ప్రతీకలు. కాని దానిప్రాణంమాత్రం కవిలో ఊహగారూపొందిన అతని సామాజిక చైతన్యం. ఆ సామాజిక చైతన్యం ఎంత విప్లవాత్మకమైతే అంతగొప్పగా ఉంటుంది అతనికవిత్వం.

ఈ శతాబ్దంలోని అన్ని భాషల్లోని బూర్జువా కవుల కవిత్వంలో మాదిరిగా సమకాలీన సామాజిక సంబంధాలకు అద్దంపట్టేది మాత్రమే అయితే ఆ కవిత్వం యథాతథవాదంలో భాగమే. అంటే వర్గసమాజపు కుట్రలో భాగమన్నమాట. అలా కాకుండా వర్గసమాజపు మార్మికతను (సరుకుల మాయ కూడా ఆ మార్మికతకు మారురూపమే.), అంటే అదనపువిలువను దాని ఉత్పత్తి దారుని ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా, మాయతో దోపిడీ చేయడానికి సృష్టించిన సామాజిక పరిస్థితిని బట్టబయలుచేసేదే నిజమయిన కవిత్వం. ఉదాహరణకు వేమన పద్యాలు. అయితే ఈ రకమయిన కవిత్వం ఎలా ఆవిర్భవిస్తుంది:

భౌతిక ప్రపంచాన్ని గురించిన జ్ఞానాన్ని మనిషి గతితార్కిక పద్ధతిద్వారా సంపాదిస్తాడు. బాహ్యప్రపంచాన్ని, దానిలో జరిగే భౌతికమార్పుల్ని తన ఇంద్రియాల ద్వారా గ్రహించి మనిషి, ఆ అనుభవాన్ని ఒద్దికగా అమర్చుకుని, క్రోడీకరించి తద్వారా భావాల్ని, ఉద్దేశాల్ని ఏర్పరుచుకుని విజ్ఞానాన్ని సంపాదిస్తాడు. ఆ

జ్ఞానంతో ప్రపంచాన్ని తిరిగి చూస్తాడు. ఈసారి అతడు తన ఇంద్రియాల (కళ్ళు ముక్కు, చెవులు మొదలగునవి) ద్వారా గ్రహించే జ్ఞానం ఉత్తమంగా ఉంటుంది. ఈ విధంగా ఎప్పటికప్పుడు తప్పుల్ని సవరించుకుంటూ విజ్ఞానాన్ని పెంచుకుంటూ పోతాడు అతడు. కవి తన కవిత్వ విషయంలో అనుసరించే పద్ధతికూడా సరిగ్గా ఇలానే ఉంటుంది. అయితే అతని భౌతికపునాది సమాజం, బాహ్యప్రకృతి కాదు. ప్రకృతినుంచి అతడు తన ప్రతీకల్ని ఎన్నుకున్నా, ప్రకృతి గురించి రాసినా, అతని వస్తువు సమాజమే.

తన చుట్టూఉన్న సమాజంలో, వర్గసమాజంలోని మార్మికత (దేముడు, దెయ్యాలు, పురాణాలు, అమూర్తమైన విలువలు) కారణంగా సామాన్యునికి పూర్తిగా అర్థంకాకుండా పోయిన సామాజిక సంబంధాలను, వైరుధ్యాలను కవి గ్రహించ గలడు. అసంపూర్ణమే అయినా సామాన్యుని అనుభవం కూడ కవి అనుభవాన్ని సంపూర్ణం, స్పష్టంచేయడానికి పనికివస్తుంది. తన పరిశీలనా గ్రహణశక్తులు, జ్ఞానం ద్వారా సామాన్యుని కంటె ఎక్కువగా సామాజిక చైతన్యాన్ని తనలో పెంపొందించుకున్న కవి తాను నివసిస్తున్న సమాజంలోని సంబంధాలను, విలువ లను తన కందుబాటులోఉన్న భాషద్వారా, కళారూపాలద్వారా తన కవిత్వంలో ప్రదర్శింపగలడు. అయితే, తాను దర్శించిన సామాజిక సంబంధాల మార్మికతలో తన వ్యక్తిత్వాన్ని పోగొట్టుకోనకుండా వాటిలోని వైరుధ్యాల్ని గుర్తించి, పాలక వర్గాలకు, పీడితులకు సమాజంలో నిరంతరం జరిగే పోరాటాన్ని (మార్క్సిస్టు దృక్పథంతో కాకపోయినా) చైతన్యవంతంగా ప్రదర్శింపగల్గితేనేగాని అతడు మంచి కవి కాజాలడు. అలాంటి చైతన్యవంతుడయిన కవికి తను కలలుకనే ప్రపంచం యొక్క భౌతికవాస్తవికత, సిద్ధాంత జ్ఞానం ఉంచే అతని కవిత్వంలో నిజమైన ప్రాణం ఉంటుంది. ఈ చివరికోవకు చెందినకవే చెరబండరాజు.

కవికి భాష, కవితారూపాలు, ప్రతీకలు ముడిపదార్థాలు. భాష, కవితారూపాల (పాట, వచనకవిత, ఛందోపద్యం) విషయంలో కవి అంతగా స్వతంత్రించలేడు. అవి సమాజమతనికిచ్చిన భౌతికరూపాలు. వాటిని కొత్తకొత్తరీతుల్లోవాడినా, కవి ముఖ్యంగా తన వ్యక్తిగతనైపుణ్యాన్ని ప్రతీకల విషయంలోనే ప్రదర్శించుకుంటాడు. ప్రతీకను నిర్మించేతీరులోనే అతనిగొప్పతనం కన్పిస్తుంది. అయితే కవి ప్రతీకను నిర్మించేతీరుగూడా గతితార్కికమైందే.

ఒక సామాజికసత్యాన్ని (అనగా ఒక చారిత్రిక సామాజిక సంబంధాన్ని) కవి గ్రహిస్తాడనుకొందాం. ఆ సత్యాన్ని దాదాపుగా సమాజంలోని అందరు వ్యక్తులూ గ్రహించిఉండవచ్చు. అది ఒక్కొక్కరికి ఒక్కోవిధంగా పాక్షికంగా కన్పించి వుండవచ్చు. ఉదాహరణకు : ఈ దేశంలో అధికసంఖ్యాకులకు కట్టుకునేందుకు గుడ్డ, తింటానికితిండి, ఉండటానికిఇల్లు లేవన్నసంగతి అందరికీతెలుసు. అయినా వీరికి, వీరిఅవసరాలకులేని విలువ ఈదేశపు పాలకవర్గాలు జాతిపై బలవంతంగా రుద్దిన జెండాకుంది. కోట్లాదిప్రజలకు కట్టుకోడానికి సరిపోయేంతగుడ్డ యివ్వలేక పోయినా (గాంధీగారి ప్రవచనాలమీది గౌరవంతోనైనా) సంవత్సరానికి రెండు సార్లైనా లక్షలాదితాన్లతో తయారుచేసిన మూడురంగులజెండా ఎగురవలసిందే. ఎందుకంటే అది జాతిగౌరవానికి సంకేతం. కోట్లాదిప్రజల అవసరాలు తీర్చలే నప్పుడు జెండాకు అంతగొప్ప విలువయివ్వడం సత్యాన్ని మసిపూసిమారేడుగాయ చెయ్యడమే అవుతుందన్న సాంఘికసత్యం తెలిసినవారుఅరుదు. చాలామందికి జెండా నిరాకారమయిన జాతిగౌరవానికి సంకేతమనేతెలుసు. ఇంకా చాలామందికి ఈ దేశంలో కోట్లాదిమంది గుడ్డల్లేకుండా బతుకుతున్నారనితెలుసు. కాని దీనికికారణం అదనపువిలువ ఎడతెగకుండా ధనికులైన పాలకవర్గాల జేబుల్లోకి పోవడం అని తెలియదు. జెండా నిజానికి పాలకవర్గాల ప్రభుగర్వానికి సంకేతమనితెలియదు. ఈ విధమయిన పాక్షికజ్ఞానం ఉండటానికి ఉత్పత్తిసంబంధాల్లోని మార్మికతే కారణంఅన్న నిజాన్ని, కోట్లాదిమంది బట్టల్లేకుండా మగ్గుతున్నపుడు ఇంకా జాతిగౌరవమేమిటి, జెండాయేమిటి అన్నసత్యాన్ని, "జెండాగౌరవం"అన్న భావంవెనుకనున్న ఉత్పత్తి సంబంధాల్లోని వైరుధ్యంగురించిన జ్ఞానం కలిగినవారు బహుకొద్దిమంది. చాలా మందికి తెలియని ఈ సామాజికసత్యాన్ని సూటిగా హృదయాలకు హత్తుకొనేట్లు ప్రతీకరించి చెప్తాడు ఒక కవి :

> ఓ నా ప్రియమైన మాతృదేశమా
>
> ....
>
> ....
>
> ఒంటిమీదిగుడ్డలతో జండాలుకుట్టించి
> వివస్త్రవై ఊరేగుతున్న ధైర్యంనీది.

తల్లిప్రేమ అందరికి తెలిసిందే. తనబిడ్డలపైఉన్న ప్రేమకారణంగా తనఒంటిపై గుడ్డలు సరిగాలేకున్నా పిల్లలకు అమర్చిపెట్టజూస్తుంది తల్లి. కాని భారతదేశమనే

తల్లి మాత్రం ఒంటిమీద గుడ్డలతో జెండాలు కుట్టించి విషప్రై ఊరేగుతున్నది. ఎందువల్ల? స్వార్థపరులైన పాలకవర్గాలకుట్రవల్ల అన్న సమాధానం స్ఫురిస్తుంది వెంటనే. చెరబండరాజు రాసిన ఈ కవితను చదివిన వారికి మాతృదేశమంటే మట్టి కాదు ప్రజలు అన్నవిషయం విడమర్చి చెప్పనవసరం లేదు.

ఈ ప్రతీకలో కవిచేపట్టిన గతితార్కిక విధానం ఇది: చాలామందికి మార్మికత వల్ల పాక్షికంగా మాత్రమే అర్థమయిన సామాజిక సత్యాన్ని ఒక భావంగాచేసి (ఈ పని సామాజిక శాస్త్రవేత్తచేసేది) దాన్ని కవితారూపం చేశాడు కవి. కవితాపరం చేయటంలో గూడ గతితార్కిక విధానాన్నే అనుసరించాడు. "మాతృప్రేమ" అనే తెలిసినవిషయాన్ని అస్పష్టమైన భావానికి ఆపాదించి, చాలామందికి పాక్షికంగా అర్థమైన విషయాన్ని లేక సులభంగా అర్థంకానివిషయాన్ని హృదయానికి హత్తుకునేటట్లు చెప్పాడు. మార్మికత, సరుకులమాయలోపడి జటిలమైనభావాన్ని, పాలకవర్గాల కుట్రను సులభగ్రాహ్యంగా, సూక్ష్మంగా, స్పష్టంగా బట్టబయలు చేశాడుకవి. దిగంబర కవితాకాలంలో రాసిన "వందేమాతరం" అన్న ఈ కవితలో చెర ముందుచెప్పబడిన మూడవకోవకు చెందిన కవిగానే దర్శనమిస్తారు. మిగతా దిగంబరకవుల మాదిరికాకుండా, (అప్పటికి అతనికి మార్క్సిస్టు సిద్ధాంతావగాహన సంపూర్ణంగా లేనప్పటికీ) సమాజంలోని పీడితవర్గాలతో భావైక్యత పరిపూర్ణంగాఉంది.

"కోపంతో, ఉద్రేకంతో తిరగబడి మత, రక్తబాంధవ్యాల ముళ్ళపొదలపై, శిథిలవ్యవస్థపై, జడత్వంపై సంచలనాన్నిలేవదీసి, మరోమహత్తర వ్యవస్థకోసం తపనపడుతున్న కోపోద్రిక్త యువకులనడుమ "(దిగంబరశకంలోంచి / సమకాలీన జీవితంపై దిగంబరకవుల దృక్పథం/మేం ఏంకోరుతున్నాం," దిగంబరకవులు : సంపుటి 2,) నిలబడి సమకాలీన వ్యవస్థపై ధ్వజమెత్తినప్పటికీ దిగంబరకవులు పీడితులతరఫున వర్గపోరాటానికి సిద్ధంకాలేకపోయారు. అందుక్కారణం వారుకూడ వర్గవ్యవస్థ నిర్మించిన మాయాజాలంలో ఇరుక్కుపోయి, ఏ "మతాలతోను, ఇజాల తోను" నిమిత్తంలేకుండా "అసలువిలువల" కోసం, "కత్తిఅంచుపైకూడా మానవత్వాన్ని మరచిపోని" నైరూప్యమానవునికోసం తపించడమే. తత్ఫలితంగానే వారి "దిక్"లలో అశ్లీలం, అక్కసులపాలు ఎక్కువై కేవలంఅప్పటి యాంత్రిక అభావ ధోరణి చోటుచేసుకున్నది. కాని చెరబండరాజు కవితల్ని పరిశీలిస్తే వాటిలోమనకు కనిపించే మానవుడు నైరూప్యమానవుడుకాడు. అతడు క్రోధంతో ఎగసిపడేది దోపిడీదారునిపైన. సానుభూతిచూపించేది పీడితులపైన. దిగంబర కవిగాకూడ అతని

లో విప్లవాత్మక వర్గచైతన్యం సూచనప్రాయంగానైనా కన్పిస్తుంది. ఆ చైతన్యమే అతణ్ణి విప్లవకవిగా ఎదగడానికి దోహదంచేసింది:

ఆపకండి
వెనక్కి పిలవకండి
మీమానసిక ఏకాకితనం శిఖరాలమీద
కాంతి పాదాలతో కదంతొక్కుతూ
నడుస్తున్నవాణ్ణి
....
....
పాలిపోయిన నరనరాన్ని పిలిచి
జీవనదికి ఊటలు సృష్టించేవాణ్ణి
మీ అస్తిత్వాన్ని ఆశయాల్ని కాలదన్ని
మీ కలల్ని పావులుగా చదరంగం ఆడేవాళ్ళ
ఆటకట్టించేవాణ్ణి
....
....
మోయలేని చట్టాల గులకరాళ్ళ తట్టలు మోయించే వాళ్ళని
వాళ్ళ డబ్బాల్ని వాయించే అపరశిఖండుల్ని
పట్టపగలు బట్టబయలు చేసేవాణ్ణి
ఆపకండి
ఆపకండి
వెనక్కిపిలవకండి

("కాంతిపాదాలు," దిక్సూచి, PP 29-30)

దిగంబరకవుల రెండవ సంపుటిలో "దిక్ ఇరవైతొమ్మిది" అన్న శీర్షికగల ఈ కవితలో, తాము సృష్టించిన అదనపువిలువ పరాయీకరణ చెందే క్రమంలో, కేవలం సరకులనుత్పత్తి చేస్తూ, సరకుల స్థాయికి దిగజార్చబడి, ఆసరకులమాయ సృష్టించిన "మానసిక ఏకాకితనం"లో మగ్గుతున్న శ్రమజీవుల నుద్దేశించే కవి మాట్లాడుతున్నాడన్నది స్పష్టం. ఆ శ్రమజీవుల "తలలమీది చంద్రుణ్ణి ముక్కలు చేసి" వారికి "చీకటి అఖాతాల్నిమిగిల్చి / ఎందుకు ఏమిటి అని / ఎదిరించే హక్కు

లేదని వాదించే గాడిదల / నాలికలు పీకేవాణ్ణి" అని కూడా అంటున్నాడు. శ్రమజీవుల బతుకు సౌందర్యమే వారి తలలమీది చంద్రుడు. వారిజీవనపరిధి వెన్నెల్లాంటిది వారి నిజమైన ప్రపంచం వాడుకవిలువల ప్రపంచం, కాని వారిబతుకు చంద్రుణ్ణి ముక్కలుచేసి, వారి జీవితాల్లో సామాజికశ్రమ సృష్టించే అన్యోన్యతను, ఐక్యతను, వెలుగును సరకుల మార్పిడిమాయతో భగ్నంచేసి మనిషికి మనిషికి మధ్య చీకటి అఖాతాల్ని సృష్టించి ఎదురుతిరిగి ప్రశ్నించే హక్కును కూడా కాలరాయ ప్రయత్నించే "గాడిదలు" పాలకవర్గాలు. వాళ్ళ పన్నినకుట్ర శ్రమజీవన సౌందర్యాన్ని అభావం చేసింది. ఆ అభావాన్ని అభావంచేసి శ్రమజీవి తలపై తిరిగి చంద్రుణ్ణి నిలబెట్టి వారి జీవితాల్లో తిరిగి వెన్నెల వెలిగేట్టు చేయడానికి కవి ఉద్యుక్తుడౌతున్నాడు. అనగా తన కవిత్వాన్ని, జీవితాన్ని విప్లవాచరణలో భాగంగా మలచుకోడానికి తయారౌతున్నాడన్నమాట.

చంద్రుడూ, అఖాతాలు రెండూ పరిచితమైన అంశాలు. తన ప్రతీకల్లో వాటినాపాదించి శ్రమజీవన సౌందర్యమెలా వర్గదోపిడిలో అభావం చెందిందో, దానివల్ల మనిషికీ మనిషికీ మధ్య ఎలాంటి సామాజిక అగాధం, చీకటి సృష్టింపబడిందో చెర చెప్పినతీరు కవిత్వంలో గతితార్కికతకు మచ్చుతునక.

ఈవిధంగా దిగంబరకవితాకాలంనాటి చెరకవిత్వంగూడ అదనపువిలువ దోపిడీని నిరాఘాటంగా సాగించడానికై పాలకవర్గాలు ప్రతిష్ఠించిన మాయాజాలాన్ని బట్టబయలుచేయడానికి చేసినప్రయత్నమే. కాని, కవిగానేకాక ఒకవ్యక్తిగా దేశంలో నలుమూలలా ఎదిగివస్తున్న విప్లవపోరాటంలో భాగంగా విప్లవాచరణకు పూనుకోవడం జూలై 1970లోపుట్టిన విరసంతో చెరబండరాజుకు సాధ్యమైంది. విరసం పిలుపందుకుని వచనకవిత్వంతోపాటు పాటలురాయటం మొదలుపెట్టాడు. కేవలం కవిత్వం ద్వారానే వర్గసమాజపు మాయాజాలాన్ని బట్టబయలు చేయడంగాక మార్క్సిస్టు - లెనినిస్టు రాజకీయసిద్ధాంతం సహాయంతో తన వ్యక్తిగతజీవితంలోకూడ విప్లవాచరణకు పూనుకున్నాడు. ఇప్పుడు చెర విప్లవయోధుడైనకవి- సాంస్కృతిక విప్లవయోధుడు. విప్లవాచరణకు అవశ్యమయిన జాగరూకతతో ఉషస్సుల్లా నిర్మలమైన, మనస్సుల్లా సున్నితమైన శ్రమజీవుల్ని తనపాపలూ, కనుపాపలుగాభావించి, ఎన్నికల మార్మికతా ముసుగులేసుకుని వారిపై దాడిచేసే రాజకీయదేగలగురించి హెచ్చరిస్తున్నాడు.

మళ్ళీ వస్తున్నాయి మనఊరికి
చిలుకపలుకుల డేగలు
రక్తంతాగే రాబందుల మూకలు
కలల కరివేపాకుచెట్లూ
కళ్ళ లోగిళ్ళలోని ఆశాప్రసూనాలు
పాపలూ కనుపాపలూ జాగ్రత్త
రెండు శతాబ్దాల గాయాలనొప్పులతో
విసిగివేసారిన సూర్యుడు
రాత్రిలేని ఎర్రని మంటలతో
ఇప్పుడిప్పుడే ఇంటింట తలుపుతడుతున్నాడు
మొత్తంగా రెక్కలిప్పి
ఇనుపముక్కలకూ ఉక్కుగోళ్ళకూ
లే చిగుళ్ళ కవచాలుకప్పి
దేశం ఆకాశం నిండా
దోపిడీ దేశభక్తి గీతాలు పాడుకుంటూ
పుక్కిటినిండా పుచ్చువాగ్దానాల గింజల్ని నములుకుంటూ

....

....

ఊళ్ళోవాటికి గూళ్ళున్నాయి గుళ్ళున్నాయి
అంతశ్శత్రువుల పళ్ళమధ్య
మనయిండ్లూ నలిగేవున్నాయి

("మళ్ళీ వస్తున్నాయి మన ఊరికి", ముట్టడి, PP 41-42)

అయినా భయపడాల్సిన అవసరం లేదు అని చెప్తున్నాడు ఎందుకంటే, "శత్రు శిబిరాల శిఖరాగ్రాల మీదికి / దోపిడీ గుండెల పాదాలమీదికి / పోరాటం బండల్ని దొర్లించి / ఊరూరికి పాకుతున్న / ఎరుపుండగ వెరపేటికి." ఇప్పుడిప్పుడే రాత్రి లేని ఎర్రని మంటలతో ఇంటింటికలుపు తడుతున్నది విప్లవోదయ సూర్యుడు. అతని వెలుగు ఊరూరికీ పాకుతున్నది. విప్లవపోరాటం ప్రజాజీవితంలో ఒక ఉన్నత దశ. పోరాటం ఎత్తులనుండి శత్రుశిబిరాల మీదికి, దోపిడీ గుండెల పాదాలమీదికి విప్లవం పోరాటం బండల్ని దొర్లిస్తే అవి నాశనంకాక తప్పవు. అందరికీ పరిచిత

మయిన ప్రకృతి సత్యాలను పయోగించి సిద్ధాంతజ్ఞానాన్ని కల్గించ ప్రయత్నిస్తున్నాడు కవి ఈ ప్రతీకల్లో. అలాగే "ఎరుపు" (విప్లవం) అంటే "మన పేదల ఎదల మొదళ్ళలోని ఎరుపు" "ఎదల మొదళ్ళు" ప్రేమకు, కరుణకు, మానవత్వానికి ఉత్పత్తి స్థానాలని ఎవరికీ చెప్పనవసరంలేదు. ఇలాగే యింకా ఎన్నో కవితల్లో చెర విప్లవాన్ని రంగరించి వర్గవ్యవస్థలో శ్రమజీవుల జీవితసత్యాల్ని, సిద్ధాంతజ్ఞానాన్ని చెప్తాడు.

విప్లవాచరణమైన అతనికవిత్వానికి ఇప్పుడు భౌతికపునాది చైతన్యవంతమైన పోరాటం. అది నక్సల్బరీలో ప్రారంభమయిన విప్లవపోరాటం. పోరాటానికి, కవిత్వానికి మధ్య గతితార్కికసంబంధంలో అతడు చాలానేర్చుకుంటాడు, నేర్పిస్తాడు. "అంకితం" (ముట్టడి)అన్నకవితలోచెప్పినట్లుగా ఇవ్వాళ్ళ ప్రపంచం అతనికి "మా పల్లెటూరికన్న చిన్నదిగా" (సంకుచితంగాకాదు; ఆత్మీయతకు, ఐక్యతకు, నిజమైన సహకారానికి అవకాశంకల్గించే శ్రమైకజీవనసరళిగల పల్లెటూరివలె) కన్పిస్తుంది. అతని షెల్ఫులోని పుస్తకాల్లా చేతివేళ్ళలా మరీమరీదగ్గరై అందుబాట్లో ఉన్నది. అతన్ని ఈ దృష్టికి నడిపించినవారు ఎక్కడోలేరు, ఎవరోకారు. "వాళ్ళు చరిత్ర రహస్యాల్ని / ఛేదించిన వీరులు నాగురువులు నావాళ్ళు." "వాళ్ళు చరిత్రకు యవ్వనం ప్రసాదించిన వైద్యులు." "పోరాటాలకు పర్యాయపదాలు". "వర్గదృష్టి నిశితంకానిదే కనబడనివాళ్ళు." అయితే, వాళ్ళు విప్లవసైద్ధాంతికులా ? కారు, విప్లవకారులైన శ్రమజీవులు. చివరగా "నేనూ నాగీతం వాళ్ళకేఅంకితం" అనితననూ, తనకవిత్వాన్ని శ్రమజీవులకు అంకితంచేసుకుంటాడు చెరబండరాజు. ఈ విధంగా చెరలో వర్గదృష్టి నిశితమయ్యి, పీడితులపక్షాన వారి బతుకుపోరాటంతో ఐక్యమయ్యి వారికోసం పాటను తన కవితారూపంగా ఎంచుకున్నాడు చెర.

శ్రమలోపుట్టి శ్రమజీవుల బతుకుల్తో పెనవేసుకుని వర్గసమాజంలో అజ్ఞాతవాసం చేస్తున్న పాటను విప్లవాచరణలో భాగంగా చేసుకోవడం వర్గసమాజపు అభావాన్ని అభావంచేసే కార్యక్రమంలో పెద్దమలుపు చెరకవిత్వంలో - విప్లవపోరాటానికి అంకితమైన విరసం, జననాట్యమండలులకూడా. సరుకులమాయ ఫలితంగా శ్రమజీవుల బతుకులో పాటకూడా మృగ్యంఅవుతున్న సమయానికి విప్లవాచరణలో భాగంగా పాటనుఎంచుకుని శ్రమజీవన సౌందర్యాన్ని పరిరక్షించడానికి పూనుకున్న సుబ్బారావు పాణిగ్రాహి, శివసాగర్ గద్దర్‌లసరసన చెరకూడా అంతఎత్తుకు ఎదిగాడు.

"కొలిమంటుకున్నాది" నుండి "కత్తిపాట" వరకు ఒక్కొక్కపాట ఒక్కొక్క ఉత్కృష్టమైన విప్లవకవితాగ్ని శకలం. (ఇటీవలనే విరసం 1971 నుండి 1980 వరకు చెర రాసిన పాటల్ని కత్తిపాట గా ప్రచురించింది.) "కొలిమంటుకున్నాది" పాటలో శ్రమజీవి బతుకుని పోరాటానికి, పోరాటాన్ని శ్రమజీవి దైనందినజీవితానికి ప్రతీకలుగా చేశాడుకవి. శ్రమజీవిబతుక్కీ పోరాటానికిమధ్యనున్న గతితార్కిక సంబంధంనుంచే శ్రామిక జనచైతన్యం పుడుతుంది. ఆ చైతన్యాన్ని యింకా ప్రజ్వలింపచేసి వ్యవస్థాపరమైన మార్పుల్ని సాధించాల్సిన అవసరంగురించి చెర వాడిన "కొలిమి" ప్రతీక ఆ చైతన్యంతో పూర్తి ఐక్యత సాధించిన సామాజిక చైతన్యం లోంచి ఉద్భవించిందే:

కొలిమంటుకున్నాది
తిత్తి నిండాగాలి
పొత్తంగడున్నాది
నిప్పారిపోనీకు - రామన్నా
పొద్దెక్కిపోనీకు - లేవన్నా

("కొలిమంటుకున్నాది", కత్తిపాట 1.2)

"ఓటుకెదిగినబిడ్డ (పెళ్ళిలేకున్నాది)" అన్న ప్రతీకలోని ధ్వనులు వర్గసమాజపు రాజకీయాల్లోని మార్మికతను, మాయను లేక కుట్రను అభావంచేసి చూపించే కవిత్వ కళలో చేయితిరిగిన చెరలాంటి కవికిగాని సాధ్యపడదని చెప్పవచ్చు. "స్వతంత్ర భారతం", దానితోపాటు ఎదిగివచ్చిన బిడ్డ- ఆ యిద్దరూ పాలకవర్గం కుట్రకు బలి అయిన వారే. ఇక్కడ దేశం బిడ్డస్థానాన్ని పొందింది. కూలినాలిచేసి శ్రమజీవి దేశమనేబిడ్డకూ, సొంతబిడ్డకూ యుక్తవయస్సులో (దేశంలో ఓట్లు, ఎన్నికలు 1951లో మొదలయినాయి. అంటే భారత రిపబ్లిక్ అనే బిడ్డవయస్సు ఈ పాటరాసే కాలానికి 20-21 సంవత్సరాలు) చేయవలసిన పెండ్లి చేయలేకపోయాడు. తీర్చవలసిన అచ్చట్లు - ముచ్చట్లు తీర్చలేకపోయినాడు. కారణం తాను ఉత్పత్తిచేసిన సంపదను పాలకవర్గాలు దక్కించుకొనగా తాను బీదరికంలో మగ్గటమే. ఈ దోపిడీకి వ్యతిరేకంగా పోరాడటం గతితార్కిక చారిత్రిక అవసరం. అందుకు కావలసిన చైతన్యాన్ని శ్రమజీవి తన బతుకులోంచి, శ్రమశక్తిలోంచే పొందగలడు. పోరాటంలో అతని శ్రమశక్తిసాధనాలే ఆయుధాలవుతాయి. కాబట్టే చెరబండరాజు శ్రమజీవికి

కదురి పార సాన - బెట్టన్నా
బతుకు యుద్ధములోన - నిలుపన్నా

అని పిలుపిస్తాడు.

ఈ పాటల్లో కొన్ని తెలుగు దేశంలో శ్రమజీవుల చైతన్యంతో బాగా పెనవేసుకున్నాయి. "కొండలు పగలేసినం," "జన్మహక్కు", "విప్లవాల యుగం మనది", మొదలగు పాటలు విప్లవయువత ఊపిరిలో భాగంగా స్పందిస్తున్నాయి.

కుట్రకేసుల్లో ఇరికించబడ్డా, ఉన్నచిన్న జీవనాధారం ఊడినా, ఈ వ్యవస్థ కాన్సరై శ్రమజీవి, కవి అయిన తనను ఉన్నపళంగా తినేస్తున్నా ఖాతరు చెయ్యక శ్రమజీవుల పక్షాన మొక్కవోని కత్తిలా జీవించి, కత్తిపాట పాడుతూనే విప్లవ చైతన్యంతో సంపూర్ణ ఐక్యతను సాధించాడు చెరబండరాజు:

మృత్యువునే
పరిహసిస్తూ
శత్రువునూ
ఎదిరిస్తా
....
పోరాటం
డైరెక్షన్
పాటనాకు
ఆక్సిజన్
....
ముంజేతిని
ఖండించిన
నా పిడికిట
కత్తి వదల
....

ఉరితాటికి
పాటనేర్పి
పల్లవినే
పాడిస్తా
ప్రజలు వేలా
మృతులైనా
పోరాటం
జయిస్తుంది
రేపటిపై
ఆశలున్న
వాడేనోయ్
మానవుడు
ఈ చీకటి
కుంపటారి
ప్రభాతాలు
పరిమళించు

("కత్తిపాట" కత్తిపాట, PP 99-100)

కవిత్వంలోనే కాదు, తనబతుకులోనూ గతితార్కిక చైతన్యంతో జీవించి కవిత్వానికీ, మానవజీవితానికీ ఉన్నతప్రమాణాలు నెలకొల్పినవాడు చెరబండరాజు.

చెర - గ్రామీణ స్వభావం

ఎన్. కె.

చెరబండరాజు పుట్టింది ఓ పల్లెటూరు రైతుకుటుంబంలో. చిన్నతనం గడిపింది పెరిగింది కూడా పల్లెటూరిలోనే. హైదరాబాదుకు మకాం మార్చేవరకు అతను చేసిన ఉద్యోగం కూడా తెలంగాణాలోని పల్లెటూర్లలోనే. హైదరాబాదులాటి మహాపట్టణాల్లో వున్నా తరువాత్తరువాత కాలంలో అతను అల్లుకున్నది కేవలం ఒక ప్రాంతానికి పరిమితమైన పల్లెటూళ్ళకు కాదు. దివ్వెలేని గూడులావున్న మొత్తం భారతదేశంలోని గ్రామీణ వ్యవస్థతో. చెరబండరాజులో వున్నది అతను చివరివరకు కాపాడుకున్నదీ నికార్సయిన గ్రామీణ మనస్తత్వాన్ని.

అతనిలో పుట్టుకవల్ల అనుబంధంవల్ల వున్న సాధారణ గ్రామీణ స్వభావం 1970ల నాటికి వర్గస్వభావాన్ని సంతరించుకున్నది. నక్సల్బరీ, శ్రీకాకుళ ఉద్యమాలు, విప్లవ రచయితల సంఘం, ఆదిలాబాద్ కరీంనగర్ రైతాంగ పోరాటాలు, జననాట్య మండలి, గ్రామాలకు తరలిన రాడికల్ విద్యార్థి యువజనులు- యివన్నీ, ఒక్క మాటలో చెప్పాలంటే విప్లవ సాంప్రదాయం చెరబండరాజుని జీవితాంతం రాటుదేలిన విప్లవ కార్యకర్తగా విప్లవ సాంస్కృతిక సైనికునిగా తీర్చిదిద్దినవి.

పేదరైతు వర్గానికి వుండే సాధారణ స్వభావాలు చెరబండరాజులోవున్న ముడి సరుకు. దీనికి పదునుపెట్టింది దీన్ని ప్రకాశవంతం చేసింది అతను నమ్ముకున్న సిద్ధాంతం, అతని ఆచరణ. ఈ రెండింటిని వేరుచేసి అతని గ్రామీణ స్వభావాన్ని గురించి మాట్లాడుకుంటే అది కేవలం సాధారణస్థాయిలోనే మిగిలిపోతుంది తప్పితే దాన్నుండి చెరబండరాజు ఎక్కివచ్చిన శాస్త్రీయదశను చేరుకోరు.

ఏ స్వభావమైనా వాస్తవరూపంలో వుంటుంది గాని భావరూపంలో వుండదు. వర్గసమాజంలో అది వర్గాలకు అతీతంగా వుండదు, మొత్తంగా పేదరైతువర్గానికి వుండే సాధారణ స్వభావాలు చెరబండరాజులో కొట్టవచ్చినట్లు కన్పిస్తాయి. చెరబండరాజు గురించి ఏ కొద్దిమాత్రం తెలిసినవాడైనా యీ విషయాన్ని సులభంగా గ్రహిస్తాడు. మొండిపట్టుదల, మనుషులతో వుండే బలమైన సంబంధాలు, హేతుబద్ధంగా అంచనా వేయడం కంటె విశ్వాసాల ప్రాతిపదికగా అంచనావేయడం సిద్ధాంతపరంగా కంటే వస్తుపరంగా ఆలోచించడం, పట్టణనాగరికతపట్ల కోపం మొదలైనవి. దాదాపు యివన్నీ చెరబండరాజులో వున్నాయి. ఇదంతా ముడిసరుకు.

ఈ ముడిపదార్థం తన స్వభావ సిద్ధమైన రూపంలో వుండి మొరటుగా వుంటుంది. కాని యిది ఎంతో ముఖ్యమయింది. చెరబండరాజు మార్క్సిస్టు - లెనినిస్టు సిద్ధాంతం వెలుగులో పయనించడంవల్ల యీ ముడిసరుకు నుండి విషయాల్ని గ్రహించగలిగాడు. అవాస్తవాల నుండి వాస్తవాలను వేరుచేయగలిగాడు. తెలిసిన విషయాల్నుండి తెలియని విషయాలు రాబట్టగలిగాడు. ఉపరితలానికీ పునాదికీవున్న సంబంధాన్ని లోతుగా పరిశీలించగలిగాడు. అంటే 'విషయపరిజ్ఞానాన్ని ఎలా సృజనాత్మక పద్ధతిలో పునర్నిర్మించుకోవాలో' తెలిపే ఆచరణలో భాగమయ్యాడు. మార్క్సిస్టు కావడం వల్ల, ఆచరణలో జీవితం లోతుల్లోకిపోయి ప్రత్యక్షానుభవం గడించడంవల్ల అతను ముడిసరుకు నుండి సత్ఫలితాలను అందించగలిగాడు. తను గ్రహించిన విషయాలు కాని చిత్రించిన విషయాలుగాని సామాజిక వాస్తవాలకు సరిపోతున్నాయాలేదా అవి సామాజికపరిణామ సూత్రాలకు అనుగుణంగా వున్నాయాలేదా అన్న విషయాన్ని సరి తూచుకున్నవాడు కనుకనే అతను ఆదరికో యీదరికో కొట్టుకపోలేదు.

చిన్నప్పటి నుంచి కూడా అతని పట్టుదలగట్టిది. ఈ విషయం చెరబండరాజు 'నా జీవితరేఖల్లో' మనం చూస్తాం. 'చదివిన చదువుచాల్లెమ్మని చప్పరించాడు మా పెద్దన్నయ్య. నేను వినలా.... అలిగికోపంవచ్చి అన్నం మానేసిమరీ స్కూలుకు వెళ్ళేవాడిని.... రెండు మూడురోజుల నుంచి తిండిలేదు. ప్రతిరోజూ పొరుగూరు పోవాలి. రానుపోను కాలినడకే. మూడోనాడు యింటికి తిరిగి వస్తున్నా. శోష వచ్చింది. తల తిరిగి పడిపోయా, దోస్తులు పరుగు పరుగునపోయి పెద్దన్నయ్యకు చెప్పారు. ఆయన సైకిలుమీదవచ్చి నన్ను తీసుకునిపోయాడు. చదువుకోమని చిన్నన్నయ్య భరోసాయిచ్చాడు' ఇక్కడి నుండి మొదలుకుంటే ఒక విషయాన్ని సాధించడం కోసం పేదరైతువర్గానికి వుండే కష్టాల్ని ఓర్చేస్వభావం అతను తన ఆఖరిఘడియల్లో మృత్యువుతో అవిరామంగా తలపడడందాకా కొనసాగింది.

అతనికి వ్యక్తులతో వుండే సంబంధాలు కూడా చాలా బలమైనవి. ప్రేమిస్తే హృదయమంతా ప్రేమించేవాడు వ్యతిరేకించినా అంతే. ఒకవేళ అతను కనుక యీ వుద్యమం వెలుగులోకి రాకుండా వుంటే తన దిగంబరమిత్రుల్ని మరణశయ్య మీద బహుశా కలవరించి వుండేవాడు. అంతబలీయమైంది అతనిస్నేహం, కాని ఆ వెలుగులోకి వచ్చింతర్వాత అంతకంటే ఎంతో బలీయమైంది. అతనికి తనఉద్యమం. అందుకే తర్వాత ఎవరిని వ్యతిరేకించినా ఆ వ్యతిరేకతలో వ్యక్తిగత యీర్ష్యాసూయలు, ద్వేషాలులేవు. దానివెనుక సిద్ధాంతంపట్ల కమిట్‌మెంట్ వున్నాయి.

టాగోర్, శరత్ రచనలు బాగాచదివి కవిత్వం, సాహిత్యం అనేమేఘాల్లో ఎగిరిపోయి గాలుల్లో తేలిపోయి శాంతినికేతన్ కలల్లో కరిగిపోయి తనకోసంఎవర్ని ఎదురుచూడవద్దనిచెప్పి చీటీరాసి చెరబండరాజు (అప్పటికింకా భాస్కర్ రెడ్డి) శాంతి నికేతన్ పోయాడు. అయితే ఆయన వూహించినట్టుగాక శాంతినికేతన్ ఆయన ఆశల్ని పటాపంచలుచేసింది. దాంతో తిరుగుముఖంపట్టి ఎంతో వ్యయప్రయాసల కోర్చి తిరిగి సికింద్రాబాద్ చేరుకున్నాడు. అప్పుడు అతనికి శాంతినికేతన్ గురించిన కలే ప్రాతిపదికగా వుండింది తప్పితే అక్కడిపరిస్థితులను, దానివెనుకవున్న భావ ధోరణిని ఆయన శాస్త్రీయంగా అంచనావేయలేదు. కాని దీనికి పూర్తి వ్యతిరేకంగా మెదడును ట్యూమర్ తింటున్నప్పుడుసైతం ఏభ్రాంతులులేకుండా సినిమావాళ్ళ 'కొండలుపగలేసినం' అన్న పాటను అడిగినపుడు నిర్ద్వంద్వంగా నిరాకరించాడు. అచంచలమైన వర్గదృక్పథాన్ని శాస్త్రీయదృష్టినీ ప్రదర్శించాడు.

తన చిన్నతనంలో అతను తనతండ్రినుండీ తల్లినుండి

"ఏటికేతంబెట్టి ఎయిపుట్లుపండించి
ఎన్నడూ మెతుకెరుగనన్నా
గంజిలో మెతుకెరుగనన్నా"

అని విన్నపాట, ఎద్దుతోపాటుగా కాడిమెడమీదవేసుకుని దుక్కిదున్నిన అతనిభార్య శ్యామలపడ్డకష్టం అతనికి పాటలపట్ల కష్టంపట్ల ప్రాణంపెట్టేలా చేసాయి. అప్పటి కది వ్యక్తులపట్ల యిష్టమే. కాని యీ వస్తుపర ఆలోచననుండి ఎదిగి అశేషమైన పేద రైతాంగంకోసం ప్రజలకోసం పాటలల్లి ప్రాణమిచ్చేటట్లు అతన్ని మలిచింది మార్క్సిస్టు దృక్పథం.

ముడిపదార్థంగా చెప్పుకున్నా సాధారణ గ్రామీణ స్వభావాన్ని ప్రాథమిక జ్ఞానంగా తీసుకుంటే ఆ ప్రాథమిక జ్ఞానం శాస్త్రీయవిజ్ఞాన దశకు చెరబండరాజులో ఎలా ఎదిగింది అన్న విషయాన్ని మనం ఆయన చేసిన రచనల్లో పరిశీలించగలుగుతాం 'అయితే హేతుబద్ధ విజ్ఞానం సముపార్జించడానికి అపారమైన ప్రాథమిక జ్ఞానం అవసరమవుతుంది'

చూపు, రుచి, వాసన, తాకిడి, వినికిడి వలన సంపాదించే జ్ఞానం ప్రాథమిక జ్ఞానం. మన జీవితంలో వుండే సాధారణ అనుభవం ఈ జ్ఞానం. ఈ జ్ఞానం మాత్రమే వుంటే 'మనకు తెలిసిన విషయాన్ని ఎలా క్రమబద్ధం చేయాలి' 'ఆ విషయ సంగ్రహం నుంచి సర్వజనీన సాధారణ విషయాలను ఎలా

సూత్రీకరించాలి' 'వాటికి ఎలా మెరుగుపెట్టాలి' 'రచనలో వాటిని ఎలా చెప్పాలి' అనే విషయాలు రచయితను గందరగోళపరుస్తాయి. దీనికి మరికొంత ముందుకుపోయి శాస్త్రీయ విజ్ఞానాన్ని సంపాదించాలి. అంటే విషయాన్ని సంపూర్ణంగా అవగాహన చేసుకోవాలి. అసలు తత్వాన్ని పరస్పరఅంతస్సంబంధాలను అర్థంచేసుకోవాలి. అంటే విషయాలను విపులంగా సంపూర్ణంగా లోతుగా ఆకళింపు చేసుకోవాలి. దీనికి ప్రధానంగా కావాల్సింది ఆగకుండా నిరంతరం రచనలు చేస్తూవుండడం. జీవితానుభవాన్ని గడిస్తూవుండడం. ఇవి ఒకదానివెనుక ఒకటి నిరంతరం ధారలాసాగాలి.

చెరబండరాజు తన జీవితకాలమంతా ఎడతెగకుండా సాహిత్య వ్యవసాయం చేశాడు. దానిలో ప్రాథమిక దశనుండి శాస్త్రీయ దశకు చేరుకునేందుకు అతను చేసిన కృషి మనకు అడుగడుగునా కన్పిస్తుంది.

కొండలు పగిలేసినమని, బంజర్లను నరికినమని, మగ్గాలను పెట్టినమని, యంత్రాలను నడిపినమని యిట్లా ప్రజలు పడేకష్టం ఏ సాధారణ దృష్టికైనా అందుతుంది. ఇది కళ్ళముందు పరచుకున్న సత్యం. కాని శ్రమజీవుల పక్షంవహించిన వారికి

'చాతుర్వర్ణ్యం దైవనిర్ణయమె
అంటూ పేదల కష్టపెట్టిరి
ఈగలకన్నా హీనంచేసి
శ్రమజీవులను కసిరికొట్టిరి

అన్న భూస్వామ్య పాలకవర్గాలదౌష్ట్యం అర్థమవుతుంది. కలాన్ని వర్గపోరాటసిద్ధాంతంలో ముంచినపుడు మాత్రమే శ్రమఎవడిదని, గంజిఎవడిదని, ఉడుకెవడిదని, మేడెవనిదని' రచయిత ప్రశ్నించడమేకాకుండా "కారణాలుతెలిసినం, ఆయుధాలు పట్టినం, మాయుద్ధంఆపకుండ విప్లవాలునడిపెదం, చావుమీదిరో. గెలుపుమాదిరో' అన్న పరిష్కారాన్ని, శాస్త్రీయమైన విశ్వాసాన్నికూడా ప్రకటించగలుగుతాడు. చెరబండరాజు కవిత్వమంతా యిదేపనిచేసింది. ఈ విషయంలో కవిగా చెరబండరాజు వున్నతప్రమాణాలు చూపెట్టగలిగాడు.

తనచిన్నప్పుడు, తెలంగాణా పోరాటకాలంలో, రామలింగంఅనే వ్యక్తిని భూస్వామి ఏజెంటని కమ్యూనిస్టు విప్లవకారులు నరికివేశారు. ఈ సంఘటన ఆయన మీద చెరగనిముద్రవేసింది. అట్లాగే పోరాటం చివరిరోజులలోని ఒకటి రెండు సంఘటనలుకూడా ఆయన మనసులో మెదలుతున్నాయి. ఈ విషయాలు నా 'జీవిత

రేఖల్లో' ఆయనే చెప్పుకున్నాడు. దీని ప్రభావం 'ఎర్రగడ్డ'గేయం. అయితే 'శ్రమజీవుల దీర్ఘకాలపోరాటమే మనమార్గం' అన్న పోరాట దీర్ఘకాలిక స్వభావాన్నిచెప్పడం అంటే ఆయన అధిగమించిన సాధారణ గ్రామీణస్వభావాన్ని చెప్పటమే.

చిన్నప్పుడువిన్న పాటలబాణీలు విప్లవ రాజకీయాల్లోకి వచ్చింతర్వాత అదే రాగంలో అందుకు పూర్తిగా భిన్నమైన వస్తువును వ్యక్తంచేసిన దానికి ఉదాహరణ 'వధ్యశాల'. 'పాడుజనగణ తమ్ముడా పల్లవెత్తవె చెల్లెలా, 'విప్లవించుతమ్ముడా, విన్నవించవె చెల్లెలా' అంటూ వ్యంగ్యాన్ని ప్రదర్శిస్తుంది.

'47 లో నా వయస్సు 25' అన్న కవితలో ఆనాటి నా మనస్సు/స్వాతంత్ర్య నినాదాలు పుష్పించిన నిండు సరస్సు' అంటూ 'ఇప్పుడు నా వయస్సెంతో తెలుసా మీకు' అని నక్సల్బరి / విరసం / కల్లోల దశాబ్దంలో ప్రశ్నించి 'తుపాకి కావాలా వద్దా' తేల్చుకొమ్మంటాడు.

అతని కవిత్వంలోని చిగురుటాకు, మబ్బుతునక, చీకటమ్మ, చందమామ, పొదలు, పిల్లబాట అన్నవి పల్లెవాసనను మాత్రమే కాదు 'నేను భారత విప్లవాన్ని' అన్న పల్లెచైతన్యాన్ని చాటుతాయి. ఆ వూరు 'కరుకు చుట్టలుతాగి, బండి బరువులు లాగి, ఏడాది పొడుగునా, ఏతాములెత్తిన' వూరు. ఆ వూరి 'గట్టుమీద, చెట్టు కింద, అయ్య కాలిరిగి అవిసిచచ్చాడు. ఆలుబిడ్డల బతుకు ఏటిపాలయ్యింది. అయినా ఆ వూరు మారలేదు. ఆ భూస్వామి మారలేదు. బతుకు అరిటాకుబతుకైంది. ఇది గ్రామం అతనిమీద వేసినముద్ర. పరమదయనీయమైంది. పరమ దారుణమైంది. 'మారలేదన్న' అన్న కవితలోని యీ గ్రామచిత్రం మార్చుకునేదారి కోసం 'బాణాలు సంధించరన్నా- ఓరన్నా అడవితల్లై పిలిచెరన్నా' అన్న ఆనాటి రాజకీయ విశ్వాసంతో స్వభావీకరించుకున్నాడు.

'మాపల్లె'లోని పైరగాలి, చెట్టుచేమ, మబ్బులు, ప్రకృతి వర్ణించిన విప్ల వాగ్నుల స్వరూప స్వభావాలు చెరలోని ఎరిమల్లెవాగులకు, ఎత్తిన పోరాటజెండాలకు గుర్తులు.

1979లో రాసిన 'అర్జీ'అన్న కవితలో చెరేచెప్పుకున్నట్టు

నా దేశపు మట్టిలోంచి
కష్టజీవుల నిట్టూర్పులోంచి
తిరుగుబాటు ముడిసరుకును
తియ్యడమే పనిగాపెట్టుకున్నవాడు చెర.

అట్లా ముడిసరుకు తిరుగుబాటుముడిసరుకుగా రూపొందినక్రమమే చెరలోని గ్రామీణ స్వభావం.

చెరబండరాజు 'వందేమాతరం' - ఒక పరిశీలన

సోదుం రామ్మోహన్

చెరబండరాజు చనిపోయాక రెండుమూడురోజులకు విజయవాడ ఠాగూర్ గ్రంథాలయంలో ఆయన సంస్మరణసభ జరిగింది. ఒకవక్త, చెరబండరాజురాసిన 'వందేమాతరం' వచనగేయాన్ని ప్రస్తావిస్తూ ప్రస్తుతించాడు. నాపక్కనున్న ఒక మేధావి ఆముదంతాగినమొహంపెట్టి "ఆయన రాసిన వందేమాతరంగేయం నాకెందుకో నచ్చదు. అందులో జాతీయ వ్యతిరేకభావంలేదూ?" అన్నాడు. నాకొంచెం ఆశ్చర్యం కలిగింది. తర్వాత కొన్నిమాసాలకు (అక్టోబరులోఅనుకుంటా) 'అవగాహన' పత్రికలో చెరబండరాజు కవిత్వంపై కొందరుప్రముఖులు వ్యాసాలురాసారు. స్వభావరీత్యా దాదాపు అవన్నీ సంస్మరణవ్యాసాలే. ప్రముఖకవి 'జ్వాలాముఖి' రాసిన వ్యాసంచదివి మళ్ళీ కాస్తవిస్తుపోయాను.

ఈ దఫాకూడా నా ఆశ్చర్యానికి మూలంపాతదే. చెరబండరాజు 'వందేమాతరం' గేయంపై జ్వాలాముఖి వ్యక్తంచేసిన అభిప్రాయం నన్ను చకితుడ్ని చేసింది.

"ముండగులతో పక్కమీదకులుకుతున్న శీలంనీది
అంతర్జాతీయ విపణిలో అంగాంగం తాకట్టుపెట్టిన అందంనీది
సంపన్నునిచేతుల్లో మైమరచి నిద్రిస్తున్న యవ్వనంనీది
ఊసినా, దుమ్మెత్తిపోసినా చలనంలేని పైకంనీది"

అంటూ 'వందేమాతరం'లోని పైపంక్తులను ఉటంకిస్తూ జ్వాలాముఖి ఇలా విచారం వ్యక్తంచేసాడు.

"దోపిడీకిగురవుతున్న దేశాన్ని బొమ్మకట్టించడంలో చెరబండరాజు దేశమాతను కూడా పాపంలో భాగస్వామిని చేసాడు. ఇది జాతీయాభిమానాన్ని కొంతగాయపరిచింది. చదివినచోటల్లా ప్రతికూలవాతావరణం యేర్పడింది....

National sentiment విషయంలో విప్లవకవి ఎంతజాగ్రత్తగా వుండాలో ఆ తర్వాతైనా చెరబండరాజు గుర్తించలేదు. విప్లవబాధ్యత, విప్లవనిబద్ధతకన్నా చాలా విజ్ఞతతోకూడుకున్న యథార్థం."

నన్ను చకితున్ని చేసింది సరిగ్గా యీముక్కలే. చెరబండరాజు సంస్మరణ సభలో ఒక బూర్జువా మేధావి నొచ్చుకున్నాడంటే మనం అర్థంచేసుకోవచ్చు. కానీ కమ్యూనిస్టుమేధావిఅయిన జ్వాలాముఖి నొచ్చుకున్నాడంటే అర్థంచేసుకోలేకపోయాను.

చెరబండరాజు 'వందేమాతరం' లోగడ బంకిం చంద్రుడు రాసిన 'వందేమాతరం' గీతానికి సీరియస్ పేరడీ అనొచ్చు. బంకిం బాబుకి దర్శనమిచ్చిన దేశమాతకీ చెరబండరాజుకీ దర్శనమిచ్చిన దేశమాతకీ పూర్తి వ్యత్యాసం వుంది. వాస్తవానికి ఆ తేడా ఆ ఇద్దరు కవుల దృక్పథాల్లోనే వుంది. బంకిం బాబుది జాతీయబూర్జువా వర్గదృక్పథమైతే చెరబండరాజుది కార్మికవర్గ దృక్పథం.

సాధారణంగా దేశాన్ని తల్లిరూపంలో భావించడం పరిపాటి. సోవియట్ యూనియన్ లాటి కొన్నిదేశాలు తమదేశాన్ని పితృభూమిగా పరిగణిస్తాయి. అది సాంప్రదాయాలలోని తేడా. ఏమైనా కనీసం మన దేశంలో దేశాన్ని లేక జాతిని 'మాతృశ్రీ'గా భావించడం మామూలుకాబట్టి ఆ తల్లిని అగౌరవించినట్లు మాట్లాడితే 'జాతి' జనులు వ్యతిరేకిస్తారు అన్న అభిప్రాయంతోనే "ఆ గేయం చదివినచోటల్లా ప్రతికూల వాతావరణం వ్యక్తమైందని" జ్వాలాముఖి అనివుంటారు.

బూర్జువా భావజాలం మెస్మరిజంలో పడ్డవారు చెరబండరాజు గేయంపట్ల వ్యతిరేకత వ్యక్తంచేస్తారంటే అది సహజమే. కానీ ఆవ్యతిరేకతలో ఒక కమ్యూనిస్టు సైతం పాలుపంచుకోవడం తోటి కమ్యూనిస్టులకు ఆశ్చర్యం కలిగించకమానదు.

బూర్జువా 'జాతి'లో వర్గాలుంటాయన్న విషయమూ, తరుచుగా 'జాతి'లోని వర్గాలమధ్య సామరస్యం చెడిపోయి 'సమర'రసం పుడుతుందన్న విషయమూ తెలిసిన వాడెవడూ జాతీయ భావానికీ, కార్మికవర్గ చైతన్యానికీ అప్పుడప్పుడు వైరుధ్యం యేర్పడుతుందన్న విషయం తెలిసిన వాడెవడూ 'వందేమాతరం' చదివి వ్యతిరేక భావం వ్యక్తంచేయడు. 'జాతి' వునికి కాపాడుకుంటూనే వర్గాలమధ్య ఘర్షణలు విప్లవ రూపంలో తలెత్తుతుంటాయి. 1946-49 మధ్య చైనాలో సాగిన అంతర్యుద్ధమే ఇందుకు ఉదాహరణ. ఈ సాయుధవర్గ పోరాటంలో ఒకవైపు కర్షకకార్మికులు మరోవైపు భూస్వామ్య బూర్జువాలు ఒకవైపు ప్రగతిశీల శక్తులు మరొకవైపు ప్రగతి నిరోధక శక్తులు పాల్గొన్నాయి. చివరకు శ్రామికజీవులవర్గం, ప్రగతిశీల శక్తులుగెల్చి, అధికారం కూడా చేపట్టిన విషయం అందరకూ తెలిసిందే.

కార్మికవర్గ చైతన్యం వున్న ఏపాఠకుడూ చెరబండరాజు యీ గేయం చదివి అయ్యో యీ కవి నా మాతృశ్రీని అగౌరవిస్తున్నాడే అని గుండెలు బాదుకోడు. పైపెచ్చు కవి వ్యక్తంచేసిన వర్గకసితో తాదాత్మ్యం చెందుతాడు.

బూర్జువాసమాజం ఆవిర్భవించాకనే జాతీయతఅనేభావం తలెత్తింది. భారత దేశంలో 19వ శతాబ్దం పూర్వార్ధంలో యీ జాతీయభావం బీజప్రాయంగా మాత్రమే వుంది, అదే శతాబ్దం వుత్తరార్ధానికి అది మొలకెత్తిందని చెప్పవచ్చు. 1985 లో ఏర్పాటైన ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ యీ జాతీయభావానికి రాజకీయవ్యక్తీకరణ (Political manifestation) అనొచ్చు. పెట్టుబడిదారి సంబంధాలు ఎంతవేగంగా అభివృద్ధిచెందితే, జాతీయభావంకూడా అంతేవేగంగా రూపుదాలుస్తుంది. ప్రముఖ సోవియట్ యూనియన్ మేధావి జీ. గ్లెజెర్మన్ "వర్గాలూ - జాతులూ" అనే తన గ్రంథంలో ఇలాఅన్నాడు.

"భిన్నకాలాలలోజరిగి, ప్రపంచలోని వివిధ భాగాలలోనూ, కొన్నిదేశాల లోనూ ఇంకా జరుగుతున్నట్టి జాతులయేర్పాటుఅనే యీ ప్రక్రియలో యెల్లప్పుడూ నిర్దిష్టమైన సామాజిక ఆర్థికసారంవుంటుంది. ఉదాహరణకు, పశ్చిమయూరప్‌లోనూ, ఉత్తర అమెరికాలోనూ, ఇతరచోట్లా జాతులయేర్పాటు పెట్టుబడిదారీ సంబంధాల పెరుగుదలతో సన్నిహితంగా లంకింపబడింది. ఇది పెట్టుబడిదారీ వుత్పత్తివిధానపు అభివృద్ధి అనే ఆధారంమీదజరిగింది. కనుక, జాతీయ లంకెలఆవిర్భావం, లెనిన్ అన్నట్లు, క్రియలో బూర్జువాలంకెలసృష్టి అనేప్రక్రియఅయింది. పర్యవసానంగా, యీ పరిస్థితులలో రూపుదాల్చిన జాతీయరాజ్యం బూర్జువారాజ్యంఅయింది."

ఈయన పరిశీలనని మనదేశానికి వర్తింపచేసి ఆలోచిస్తే, ఇక్కడ ఇండియా లో కూడా జాతిఆవిర్భావం అనేది పెట్టుబడిదారి సంబంధాల పెరుగుదలతో ముడి పడి వుందన్నవిషయం అర్థమవుతుంది. అందుకే ఇక్కడ జాతీయరాజ్యం అనగానే బూర్జువారాజ్యం అనేఅర్థమే మనకుస్ఫురిస్తుంది.

జాతిఅనేపేరుతో బూర్జువాసమాజాల్లో పాలకవర్గాలు శ్రామికజీవులను దగాచేస్తుం టాయి. మనదిఅంతా ఒకేజాతి ఇందులో వర్గాలులేవు అంటూ బూర్జువావర్గ ప్రచార కులు చెప్తుంటారు. ఒకజాతిలోని వర్గవైరుధ్యాలను కప్పిపుచ్చడానికే బూర్జువావర్గ పాలకులు 'జాతీయపతాకాన్ని' సృష్టించారు. జాతీయఆదాయం పెరిగిందన్నా, జాతీయవుత్పత్తి పెరిగిందన్నా టాటా, బిర్లాల, డాల్మియాల, గోయంకాల ఆదా యమూ, వుత్పత్తీ పెరిగినాయనేతప్ప శ్రామజీవుల ఆదాయం పెరిగిందనికాదు. ఈ విషయం స్పష్టంగాతెలిసిందే. అంటే 'జాతి' అనేభావన పెట్టుబడిదారిదేశాల్లో బూర్జువావర్గంతో సన్నిహితంగా ముడిపడివుందన్నమాట.

ఈ పెట్టుబడిదార్లు, గుత్తపెట్టుబడిదార్లు స్వార్థప్రయోజనాల కోసం జాతి శీలాన్ని అమ్ముతున్న విషయాన్నీ, అంతర్జాతీయ విపణిలో జాతియొక్క అంగాంగాన్నీ తాకట్టుపెట్టిన విషయాన్నీ తెలుసుకున్నవాడు కాబట్టే చెరబండరాజు అలా ఆక్రోశించాడు. సంపదను సృష్టించే శ్రమజీవులు సంపదకు దూరమవుతున్న విషయం అయనను కలవరపరిచింది కాబట్టే, అలా అల్పసంఖ్యాకులైన పెట్టుబడిదార్లు, ఇతర దోపిడీవర్గాలు జాతినికొల్లగొట్టుతున్నవిషయాన్ని పాఠకులముందు బొమ్మలానిలిపాడు.

చెరబండరాజు రాసిన 'వందేమాతరం' చదివి ఎవరి సెంటిమెంటు దెబ్బతింటుందంటే, బూర్జువాజీవుల సెంటిమెంటూ, వారి తాబేదార్ల సెంటిమెంటూను. బూర్జువా 'జాతి'తో తెలిసోతెలియకో తాదాత్మ్యం చెందే మధ్యతరగతి సంస్కారుల సెంటిమెంటు కూడా దెబ్బతినవచ్చు. బూర్జువా దేశభక్తికీ కమ్యూనిస్టు దేశభక్తికీ తేడావుంది. బంకిం చంద్రునిది బూర్జువాదేశభక్తి అయితే, చెరబండరాజుది కమ్యూనిస్టు దేశభక్తి. బంకిం బాబుకు దేశమంతా సస్యశ్యామలంగా, సుజలాం, సుఫలంగా కనిపించావి. చెరబండరాజుకు దేశమాతపై దోపిడీవర్గాలు పెట్టిన గాట్లు కనిపించాయి. ఆగాట్లనే మనకు కవిగా భూతద్దంలో చూపాడు. అవిమాసి పుండ్లైతే ఎలా? వర్గచైతన్యం వున్న ఏ శ్రామికుడైనా కూడా అయ్యో యీ మనదేశమాతను ఎత్తిపొడుస్తున్నాడే అని బాధపడడు. పైపెచ్చు దేశమాతను దోపిడీవర్గాల నుంచి విముక్తం చేయాలన్న ఆవేశమూ, దీక్షా అందులోంచి స్వీకరిస్తాడు. ఇతని దృష్టిలో 'జాతి' 'జాతీయభావం' అంటే రూపెత్తిన బూర్జువావర్గం. [ఎంబాడిమెంట్ ఆఫ్ బూర్జువాజీ] అయినప్పుడు, దోపిడీకి గురవుతున్న దేశాన్ని బొమ్మకట్టించడంలో బూర్జువావర్గాన్ని ఆ పాపంలో భాగస్వామినిగా చూపడం కార్మికవర్గ పక్షపాతకవికి సహజమే. అందులో ఆశ్చర్యమేమీలేదు.

ఏజాతిలోనైనా, ఎల్లప్పుడూ ఏదో ఒక రూపంలో వర్గపోరాటాలు కొనసాగుతూనేవుంయి. జాతివునికికి యీ పోరాటాలవల్ల ప్రమాదమేమీ వుండదు. జాతి జాతిగానే కొనసాగుతుంది. అదే సమయంలో వర్గపోరాటమూ కొనసాగుతుంది.

మనది భారతజాతి. మళ్ళీ ఈజాతిలో తెలుగువారు, బెంగాలీలు, మరాఠీలు, తమిళులు, మళయాళీలుఅనే వుపజాతులు అనేకంవున్నాయి. అంతేకాదు గోండులు, సవరలు, సుగాలీలు వగైరా ప్రజాతులు (Ethnic groups) అనేకం మనదేశంలో వున్నాయి. మళ్ళీ వీటిమధ్య పెట్టుబడిదార్లు, భూస్వాములు, కార్మికులు, కర్షకులు,

చేతివృత్తులవారు, మధ్యతరగతిజనాలు వగైరావర్గా న్నాయి. ఈ విషయం అన్ని పెట్టుబడిదారీ దేశాలకూ వర్తిస్తుంది.

అయితే 'జాతీయభావన'కుకానీ జాతీయ సార్వభౌమాధికారానికి కానీ శ్రమజీవులు, లేక కమ్యూనిస్టులు వ్యతిరేకమా ? కాదు. కాకపోతే వర్గాలుఅనే అడ్డుగోడలులేని సమాజాన్ని లేక జాతిని సృష్టించాలన్నదే వారిధ్యేయం. అందుకోసమే వారు కృషిచేస్తారు. అయితే బయటినుంచి దేశానికి ఏదైనా ప్రమాదంసంభవిస్తే, దేశమాతను కాపాడ్డానికి ముందుండేది శ్రమజీవులూ, కమ్యూనిస్టులే. రెండవ ప్రపంచయుద్ధం సందర్భంగా నాజీలనెదుర్కొంటూ ఫ్రాన్స్‌లో 70 వేలమంది కమ్యూనిస్టు యోధులు ప్రాణాలర్పించారు. జర్మనీలోకూడా నాజీమూకలతో పోరాడుతూ కొన్నివేలమంది కమ్యూనిస్టులు ప్రాణాలర్పించారు.

ఓ నా ప్రియమైన మాతృదేశమా
తల్లివి తండ్రివి దైవానివి నీవేనమ్మా
దుండగులతో పక్కమీద కులుకుతున్న శీలం నీది
అంతర్జాతీయ విపణిలో అంగాంగం తాకట్టుపెట్టిన అందం నీది
సంపన్నుల చేతుల్లో మైమరచి నిద్రిస్తున్న యవ్వనం నీది
ఊసినా దుమ్మెత్తిపోసినా చలనంలేని మైకం నీది
కోతకొచ్చిన చేనులో కలుగులు తువ్వుతున్న
ఎలకల్నీ పందికొక్కుల్నీ భరిస్తూ నించున్న 'భారతి'వమ్మా
నోటికందని సస్యశ్యామల సీమవమ్మా
వందేమాతరం వందేమాతరం

ఒంటిమీది గుడ్డలతో జండాలు కుట్టించి
వివస్త్రవై వూరేగుతున్న ధైర్యం నీది
అప్పుతెచ్చి వేసినమిద్దెల్లో
కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్న దీనత్వం నీది
ఎండిన స్తనాలమీదికి ఎగబడ్డ బిడ్డల్ని
ఓదార్పులేని శోకం నీది
ఆకలికి ఎండి మాడి ఎరువుసొమ్ములతో దిద్దినబడ్డ సింగారం నీది
అమ్మా భారతీ నీగమ్యం ఏమిటి తల్లీ
వందేమాతరం వందేమాతరం

అవగాహనతోపాటు క్రమంగా ఎదిగిన:

చెరబండరాజు నవలలు

కె. రాంమోహన్ రాజు

తనకున్న రాజకీయాలవల్ల అనేక రచనా ప్రక్రియల్లో కృషిచేశాడు చెరబండ రాజు. విప్లవ సాహిత్యావసరాల కోసం వచనకవిత్వాన్నేగాక పాటనీ, కథనీ, నాటికనీ, నవలనీ గూడా మలిచాడు. విప్లవ అవసరంగా సాహిత్య ప్రక్రియలను చేపట్టడమే కాదు కృషి, అభ్యాసాలతో చేవఎక్కించాడు.

ఎన్నో అనర్థాలు, అశాంతి, కష్టాలు, వైషమ్యాలు అతడి అనుభవంలోకి వచ్చాయి. పుట్టిపెరిగింది గ్రామాల్లో కనుక గ్రామజీవితపు లోతుపాతులు బాగాబంట బట్టాయి. స్ఫటికం లాంటి గ్రామీణ రైతుస్వభావంవల్ల పరిసరాల పరిశీలన ప్రతి స్పందనఅబ్బాయి. ప్రజానీకానికి స్వతంత్రమైన, గౌరవనీయమైన జీవితం ఉండాలని ఆయన ఆదర్శవాదిగా కలలుగన్నాడు. ఐతే వీటన్నిటికీ పరిష్కారం శాస్త్రీయ దృక్ప థంతోకాక టాగోర్, శరత్‌ల ప్రభావంతో అతనాలోచించి వుండటం మనంగ్రహించ వచ్చు. కానీ దీనిఫలితం గూడా అతనికి స్వయంగా అనుభవంలోకి రావటంవల్ల, ఏది తనకి ఆదర్శమనుకున్నాడో అది వాస్తవజీవితంలో నెరవేరక వికటించటంవల్ల అతనిలో, తనలో వుత్పన్నమైన ప్రశ్నలకి సమాధానం వెతకటం ఎక్కువైంది. చెరబండరాజు మొదటినించీ ఆచరణవల్ల పరాజితుడుకాలేదు. తపనచెందుతూ ఘర్షణ పడుతూ ఆర్తిలో, అన్వేషణలో పడ్డాడు.

ఈ అన్వేషణలోనే అతను దిగంబరకవిగా మారాడు. ఐతే అప్పటికే అతని చైతన్యం వర్గపోరాట చైతన్యంగా సంధింపబడుతున్నది. దీనికి దిగంబర కవుల సంపుటాల్లోవున్న అతని రచనలన్నీ ఉదాహరణలే. ఐతే ఇదికూడా అతనికి తృప్తినివ్వ లేదు. అతనింకా ముందుకి సాగాడు.

దీనికి తగినట్టుగా అతనికి విప్లవ ఉద్యమ పరిచయం, సాన్నిహిత్యం ఏర్పడ్డాయి అక్కడ చెరబండరాజు వాస్తవంలో కళ్ళుతెరిచాడు. వ్యవస్థవైపరీత్యాలను ఎదుర్కో గలశక్తులసాన్నిహిత్యమే, వ్యవస్థరీతిని మార్చగల సంఘర్షణతో కలం కదపటమే తనలోవున్న అన్ని సందేహాలకీ సమాధానమని గుర్తించాడు.

1969 ప్రాంతాల్లో ఒకవైపు తెలుగుదేశంలో సమరసంరంభంవుంది. భీకరమైన హోరుతో నక్సల్బరీ ఉద్యమం తెలుగునేలని కుదిపివేస్తూవుంది. దాని ప్రభావం

సాహిత్యంలో ప్రతిఫలిస్తూవుంది. దాన్ని సంకల్పితంగానో అసంకల్పితంగానో ధ్వనిస్తూ 'తిరుగబడు' కవులు ఉవ్వెత్తున లేచారు. సమాజంలో సాహిత్యంలో ఒక వాతావరణం ఏర్పడింది. చెరబండరాజులో మొదటినించీవున్న గ్రామీణ ప్రజా జీవితానికి సంబంధించిన సమస్యలన్నీ అప్పటికి దారులు తెలుసుకున్నాయి. విప్లవోద్యమం ఆయన్ని ఆకర్షించి తనలో ఐక్యంచేసుకుంది. ఆయన ప్రజలకోసం, వాళ్ళను కలుసుకోగలిగే నిజమైన చోటుకోసం బయల్దేరాడు. ఆయనలో మొదటినించీవున్న అన్వేషణ ఆయన్ని గమ్యంచేర్చింది.

ఐతే అతనిలోవుండే నిరంతరపరిశీలన, కార్యనిమగ్నత అతన్ని ఊరుకోనియ్యలేదు. విప్లవోద్యమంతో అల్లుకుపోయినా అతనిలోని సాహిత్యోపజీవికి శాంతి కలుగలేదు. తానింతవరకురాస్తూవున్న వచనకవిత్వం ప్రజల్నిచేరటానికి ఏమాత్రం పనికిరాదనీ, ప్రజల్నిచేరాలంటే పాటఅవసరమనీ గుర్తించాడు. అతనిలోని అన్వేషకుడికి విరామమన్నదిలేదు. ప్రజల్నిచేరడానికి ఎన్నిమార్గాలున్నాయో అన్నీ ఆయన ఆచరించాడు. వాటిలో భాగంగానే ఏదిరాసినా రాశాడు. ఇవన్నీ ఎవరో చెబితే మాత్రమే తెలుసుకోగలిగే రహస్యాలేమీకాదు. అతని రచనావ్యాసంగం పరిశీలించిన ఎవరికైనా ఇవన్నీ తెలిసేవిషయాలే.

అచ్చయిన అతని మూడుసవలల్ని ప్రచురణకాలంవదిలి రచనాకాలంప్రకారం చూస్తే నిప్పురాళ్ళు మొదటిదీ, మాపల్లె రెండోదీ, ప్రస్థానంమూడోదీ.

"నిప్పురాళ్లు" రచనాకాలంనాటికి చెరబండరాజుకి కొన్ని ఆలోచనలు ఉన్నాయి. ఆయన తానుచూసిన, చూసిన దానినుంచి గ్రహించిన కొన్నిఅనుభవాల్ని పదిలపరుచుకున్నాడు. వాటిని ఎప్పటికైనా రాయాలన్నది ఆయన ఆలోచన. విప్లవోద్యమంలోకి రాకుండావుంటే ఏ సిద్ధాంతాలు ఆశయాలజోలికి పోకుండా వాటిని రాసివుండేవాడేమోకాని తర్వాత తన అనుభవాలకి ఒక మార్గదర్శకత్వం (Direction) ఇవ్వదలుచుకున్నాడు. అయితే అప్పటికి అతనిచైతన్యం ఇంకాపూర్తిగా పదును తీరలేదు. తనచుట్టూవున్న సమాజాన్ని తాను పరిశీలించినతీరు, తానుదేనినైతే విశ్వసిస్తున్నాడో దాన్ని సూచించటం 'నిప్పురాళ్లు'లో మనకి కనిపిస్తుంది. అతను చెప్పినదాంట్లో కొంత తనకితాను నిర్ణయించుకున్నదైతే మరికొంత అతని చైతన్యంద్వారా వచ్చింది. ఐతే ఈ రెంటిలో అప్పటికింకా ఏదీ సమగ్రం కాదు.

నవల రాస్తున్ననాటికి పల్లె అతనికి ఇంకా పచ్చిజ్ఞాపకమే. పట్టణజీవితం ఆలోచనని కమ్మేయలేదు. పల్లెనీ దాని రాజకీయ కార్యాచరణనీ చిత్రించాలన్న అతని ఉబలాటమే ఈ నవలారచనకు పురికొల్పింది. తనలో ఇంకా శరత్ ఛాయలు మిగిలివుండటంవల్ల నవలా నాయకుడు మధ్యలో ఫాక్టరీ అజమాయిషీ చెయ్యటానికి వచ్చినట్లు చిత్రించాడు, వినోదప్రాయవాతావరణమూ, హేతువిరుద్ధమైన సన్నివేశాల కల్పనా నవలని డామినేట్ చెయ్యటం అప్పటి అతని అవగాహనలో భాగమే. ఈ నవలాచిత్రణ ఇదివరకు మనకలవాటయిన సాంఘిక నవలల ధోరణిలోనే వుందన్నా, ఇది మామూలు నవలలకోవకి చెందుతుందన్నా ఆశ్చర్యంలేదుగానీ నవలరాయటానికి ప్రేరేపించిన చైతన్యం మరిచిపోరాదు. విప్లవసాహిత్యంతో పెనవేసుకుపోయి విప్లవోద్యమంతో సాన్నిహిత్యంగల చెరబండరాజు తన భావావేశాన్ని తనకుతెలిసిన, పరిచయమున్న వాతావరణంలో ప్రదర్శించటానికి చేసిన ప్రయత్నమే "నిప్పురాళ్లు" నవల. దీనిలో అతనికి నవలాశిల్పం, సన్నివేశాల కల్పనా, సంఘటనాక్రమం పట్టింపుకి రాలేదు. అతని రాజకీయ సిద్ధాంతోద్వేగమే అతన్ని నడిపించింది.

తన విశ్వాసాలకు అనుగుణమైన రచనా విధానాన్ని ఆయన రూపొందించుకున్నాడు. అతని భావనాశక్తి ప్రధానాశయానికే సాగటం ముఖ్యమనుకున్నాడు గాని తన సంవిధానం మీద కఠినమైన తెరలు, తనకీ పాఠకులకీ మధ్యన కమ్ముకుంటున్నాయని గ్రహించలేదు. ఆగ్రహింపు అతనికి ఉత్తరోత్తరా ఏర్పడిందేగాని ముందే వచ్చింది కాదు.

దీనికి నిదర్శనం 'మాపల్లె' నవల. ఈ నవలలోగూడా చెరబండరాజు తనకి తెలిసిన గ్రామాల స్వరూపాన్ని చిత్రించటం కన్పిస్తుంది. గ్రామాలను మేల్కొల్పాలన్న రాజకీయాలతో ఉన్నాడు గనుక తాను చిత్రించిన పల్లెలనిండా ఆ వాతావరణమే చూపుతాడు. రాజకీయాలు వుండటంవల్ల రచనావ్యాసంగం తగ్గుతుందనేది అబద్ధమని చెరబండరాజు రుజువుచేశాడు. తనకి రాజకీయాలు ఉండటంవల్లనే వివిధ ప్రక్రియల్లో విస్తృతంగా రచనలు చెయ్యగలిగాడు.

'నిప్పురాళ్లు' ప్రాథమిక రచన అనుకుంటే 'మాపల్లె' దానిమీద అభివృద్ధి. 'నిప్పురాళ్లు'లో విషయాన్ని పాఠకుడి ముందు వుంచటంలో అతడికి శ్రద్ధలేదు. మనసులోవున్నవన్నీ చెప్పుకుంటూపోతాడు. కానీ 'మాపల్లె' రాసేనాటికి సన్నివేశ నిర్మాణం అతనికి పట్టుబడింది. విషయంమీదే ధ్యానవుంచటం, పాత్రల్ని నడపటం

వచ్చింది. ఐతే దీనర్థం నవలారచన పూర్తిగా తెలిసిపోయిందని కాదు. కృషిలో కొంత సాఫల్యం చెందాడనే.

ఐనా 'మాపల్లె'లోనూ ఉండవలసిన కొన్నిలోపాలున్నాయి. 'ఉండవలసిన' అనటం ఎందుకంటే అప్పటికి ఆయన ఇంకా తన అవగాహనను పెంచుకుంటున్న దశలోనే వున్నాడు. రచయిత తానుచేస్తున్న రచనవల్ల తాను ఏం నేర్చుకుంటున్నాడనేది గూడా ఒక అంశమే. అది రచయిత నిజాయితీ, చైతన్యాలకు సంబంధించిన విషయం. ఈరెండు లక్షణాలూ చెరబండరాజులో వుండటంవల్ల ఆయన మొదటి నవలనుంచి రెండోనవల రాసేక్రమంలో కొన్ని నేర్చుకోగలిగాడు.

'మాపల్లె' నవలలోగూడా పాత్రల స్వభావమూ, మాటలు, ప్రవర్తనా వాటి పరిధిదాటివుంటాయి, కారణం అన్నిపాత్రలూ చెరబండరాజే కావటం. తానే అన్నీ అయి కథనడపటం. ఈ తొందరపాటు వల్లనే కథాంశముకన్నావైనా నినాద వాతావరణం మాపల్లెలో ఎక్కువగా కన్పిస్తుంది.

ఆయనకు రాజకీయాలు వున్నాయి గనుక వాటినిచెప్పటం అవసరమైందిగనుక రచనద్వారా చెప్పాడు. ఈ చెప్పటంలో క్రమంపాటించకపోవటం, సందర్భశుద్ధి లేకపోవటంలాంటి పొరపాట్లు క్రమంగా తగ్గుతూవచ్చాయి.

ప్రస్తుత గ్రామాలస్థితి, వాటిమీద భూస్వాముల ఉడుముపట్టూ, వాటినుంచి బయటపడే ప్రయత్నంలో రైతులు అన్నీపోగొట్టుకుని పట్నంచేరి కార్మికవర్గంగా మారటం 'ప్రస్థానం' నవలలో చిత్రించాడు.

మనసులోని భావాల్ని ప్రతిభావంతంగా వ్యక్తీకరించటానికి రచయితకు కొంత అనుభవమూ, నేర్పూకావాలి. ఈ అనుభవం జీవితానికీ సంబంధించినదై, నేర్పు రచనా విధానానికీ సంబంధించినదైతే రచన శక్తివంతమవుతుంది. 'ప్రస్థానం' నవల రాయవలసి వచ్చేటప్పటికి చెరబండరాజుకీ తన ప్రణాళికపట్ల స్పష్టత ఏర్పడింది. క్రమక్రమంగా అతనికి నవలారచనలో చెయ్యితిరిగిందనడానికి 'ప్రస్థానం' నవల నిదర్శనం. అంతకుముందు ఏయేపొరపాట్లయితే అసంకల్పితంగా చేస్తూవచ్చాడో అవేవీ ఈ నవలలో కన్పించవు. తన రచనావిధానాన్ని ఒకనవలకన్న మరొకనవలలో మెరుగు పరుచుకుంటూవచ్చాడు, తనకు అనుభవంలోకి వచ్చిన జీవితాన్ని తన సిద్ధాంతంతో జోడించి చెప్పటమనేకృషిలో భాగంగా అతను నవలల్నిరాశాడు.

ఆ రాయటం తప్పటడుగులతో ప్రారంభమైనా 'ప్రస్థానం'నాటికి నవలా రచనలో ఒడుపుల్నీ, మెలకువల్నీ పట్టుకున్నాడు. సన్నివేశాన్ని ఎక్కడ ప్రారంభించాలో

ఎక్కడ ముగించాలో తెలిసిపోయింది. పాత్రల పరిమితినిబట్టి సన్నివేశ అవసరాన్ని బట్టి మాట్లాడించాడు.

'ప్రస్థానం' కన్నముందు రెండునవలల్లో పాత్రలన్నీదాదాపు తరతమభేదంలేకుండా రాజకీయాలు మాట్లాడుతాయి, చరిత్రమాట్లాడుతాయి. కానీ 'ప్రస్థానం' నవలలో ఏపాత్రయినా ఆ పాత్రస్వభావాన్నిబట్టి మాట్లాడుతుంది. జీవితాన్ని మాట్లాడుతుంది. కనిపించే సమస్యని మాట్లాడుతుంది. ఆగకుండా రచనలుచేస్తూ పోవటంవల్లనే మంచి రచన ఎలాచెయ్యవచ్చునో అతను నేర్చుకున్నాడు. ఆ విషయం మనకి పై మూడు నవలల్లోను కన్పిస్తుంది.

ఐతే సంవిధానం విషయంలో ఎలావున్నా ఈ మూడునవలల్లోనూ అతను మనకు చూపించేదేమిటి? పల్లెస్వరూపాన్ని మూడుకోణాల్నుంచిచూపాడు. 'విప్పరాళ్లు'లో చిన్నారం గ్రామం మధ్య తుపాకీపేలటానికీ, 'మాపల్లె'లో గురునాథరెడ్డి చావుకీ, 'ప్రస్థానం'లో కాంతారావుచావుకీ కారణం, ఏ కృత్రిమ అభావని పాలకులు ప్రజలపై రుద్దప్రయత్నంచేస్తున్నారో దాన్ని ప్రజలేగ్రహించటం.

తనకి అంతకుముందే గ్రామీణ జీవితానుభవం, పరిశీలనావుంది. అప్పుడు నవలలు రాయలేదు. ఎప్పుడైతే విప్లవ రాజకీయాలు తనకి అంటాయో అప్పుడు నవల రాయటం అవసరమైంది. విప్లవం అతనిలోని ముడిసరుకుని బయటకితీసి మెరుగు పెట్టింది.

'విప్పరాళ్లు'లో సంఘటనాక్రమం లేదు. నినాద వాతావరణం ఎక్కువ. అది కథనాన్ని దెబ్బతీస్తున్నదని 'మాపల్లె'నాటికి గ్రహించాడు. ఐతే నినాదాలహోరు దీన్లో గూడా తగ్గించుకోలేకపోయాడు. 'ప్రస్థానం'లో పైనచెప్పిన లోపాలేవీ కన్పించవు. అవి అప్పటికే అతను గుర్తించాడు. ఇకముందు తాను చెయ్యబోయే రచనలు ఎలా వుండగలవో 'ప్రస్థానం' ద్వారా చూపాడు. మరణించిఉండకపోతే భవిష్యత్తులో మంచిరచనలుచేసి తానిచ్చినహామీని నిలబెట్టుకునేవాడని 'ప్రస్థానం' చెబుతుంది.

పల్లెలు **వడిలేచినై** అనేగాకుండా వాటివడినీ, సుడినీ రికార్డుచెయ్యాలన్న తాపత్రయంగూడా అతని నవలారచనలోభాగం. కవిత్వంలో ఈ వడినీ సుడినీ రికార్డు చేయడంలో ఉన్నతశిఖరాలకెదిగిన చెరబండరాజు ఉద్దేశ్యపూర్వకంగానే నాటకం, నాటిక, నవలల్లోకూడ ఈ ప్రయత్నానికి పూనుకున్నాడు. ఈ ప్రయత్నంలో మెట్లు మెట్లుగా సాహిత్యప్రమాణాలను అధిరోహిస్తున్న కాలంలోనే ఆయన అకాలమరణం చెందడం తెలుగు నవలాసాహిత్యానికి తీరనిలోటు. మంచిప్రచారం మంచి కళావిలువల ద్వారానే సాధ్యమవుతుందనీ, ఆ సత్యం సంఘజీవితమూ ఉద్యమ జీవితమే గుర్తింపచేసాయనీ చెరబండరాజు రుజువుచేసాడు.

చెరబండరాజువి

రెండు అముద్రిత రచనలు
ఒక అచ్చయిన పాట :

మావూరి సమస్యలు

కొత్తరోడ్డు :

ఏనాడో ఉంటే ఈనాడు మావూరిదారికోసం ఇంతగా తర్జనభర్జనలు జరిగేవికావు దారిఅంటే కనీసం బండిబాటైనా ఉండాలని అందరూ అనుకుంటాడు. నిజం చెప్పొద్దూ కాలిబాటకూడాలేదు. ఊరేమోచాలాపెద్దది. నాలుగువందల కడపైనా వుంటుంది. ఇంటికినలుగుర్ని లెక్కేసుకున్నా, పదహారువందలజనాభా. సుమారు వెయ్యెవోట్లగ్రామం. అలాంటి మావూరికి పిల్లబాటకూడా లేదంటే ఈరోజుల్లో పట్నం వాళ్లు నవ్విపోతారు. అక్కడక్కడ అనుకోవడంకూడా వినటంజరిగింది. వూరికిమంచి బాట లేక కుదిరిన పట్నంసంబంధాలుకూడా వీగిపోయాయట. ఆరకంగా మావూరికి రావలసిన కట్నండబ్బులు వచ్చేది రాకుండానో. పొయ్యేవి బయటకుపోకుండానో ఎక్కడివక్కడ నిలిచిపోయాయి. పట్నంవెళ్లి పైచదువులు చదువుకొని వచ్చినకుర్రాళ్లు ఊరిపెద్దల్ని చెడామడా తిట్టేయడం, వూరునీ, మనుషుల్నీ అసహ్యించుకోవడంకూడా జరుగుతుంది. అందులో వాళ్లతప్పేముంది పాపం కుర్రాళ్లుఅని కొందరు వాపోవచ్చు. ఊరిజనాభానుండి కుర్రాళ్ళని విడదీసి, కొత్తమనుషులుగా ఎందుకుచూడాలో అయ్యో పాపం వాళ్లు ఆలోచించరు. తామూచేసిపెట్టరు. అందరమూ [కలిసి] ఏదో ఇంత రోడ్డువేసుకుందాం అని పనికిపూనుకోరు.... ఊళ్లో ఏదోఒకమూల దారిగురించి చర్చ జరుగుతూ.... అది ఈ మధ్య మరీఎక్కువైంది. ఎలాగో వో పెద్ద.... రోడ్డువేసే వరకు నిద్రపోనుఅని శపథంతీసుకొని బ్లాక్ [ఆఫీసరూ] కలక్టరేటుకూ, తాసీల్దారు గారి దివ్యసముఖమునకు నిర్విరామంగా తిరుగుతున్నాడు.

అయితే రోడ్డు ఎక్కడినుంచి వేయాలి ?

ఒకచేశరణ్యం. ఊరిచుట్టూ చాపపరిచినట్టు పొలాలు, కాలవలు. వాటిని తెగ్గొట్టాలి. లేకపోతే అదిసాధ్యంకాదు. ఇంతకాలందాకా బస్సులునడిచే రోడ్డుమీద దిగి వోమైలుదూరం డొంకలన్నీ తిరిగి, చెప్పులు వాళ్లోపెట్టుకొని, ప్యాంట్లు మడచుకొని అతిప్రయాసంమీద ఊరుచేరేందుకు వీలుండేది. బంధువులొచ్చినా, బాలెంతరాలొచ్చినా నూతన వధూవరులొచ్చినా పొలాలగట్లమీంచే అప్రయత్న నాట్యభంగిమల్లో నడిచిపోవలసేవుండేది.

అట్లాంటి గ్రామానికి రోడ్డుపడితే ఎవరు సంతోషించరు? కాని సంతోషించ లేని మనుషులు పల్లెలో తక్కువేంలేరు. కావడికట్టి పెద్దమనుషుల్ని మోసేవాళ్లు, ధాన్యం బస్తాల్ని రోడ్డుమీద దాకా మోసుకొచ్చి నాలుగురాళ్ళు సంపాదించుకుని పొట్ట పోసుకునేవాళ్లు, అలాంటి అశేష కూలిజనం నోట్లో రాయిపడుతుంది. రోడ్డువేస్తానని బయల్దేరిన పెద్దమనిషిని చూస్తే, కూలిజనానికి మండిపోతుంది. ఒకరిద్దరు ఆ ప్రయత్నం మానుకొమ్మని ఆయనగారితో చెప్పాలనుకున్నారు కాని, వూరికి దారివస్తుంటే వద్దనే రకమని చూసి తిట్టిపోయడమేగాక కూలికికూడా పిలవరని వూరుకున్నారు. వాడ వాడా కూలిజనం ఈ రోడ్డు రాకుండా ఎలా అడ్డుపడదామా అని ఆలోచిస్తున్నారు.

భూస్వాములు, ధనికరైతులు బండ్లమీద ధాన్యాన్ని ఎత్తించుకుపోవచ్చు, కూళ్లు బాగా ఆదాఅవుతాయని సంబరపడుతున్నారు. చందాలు ఎవరికివాళ్లు ఇవ్వడమే గాక పెద్దమొత్తంలో వసూలుచేయడానికి ఎవరికివాళ్లు వూరిమీదపడ్డారు. తమ తమ జీతగాండ్లద్వారా శ్రమదానం చేస్తామని ఆపెద్ద మనిషికి వాగ్దానం చేశారు. పంచాయతి సమితి ఆఫీసు నుండి ఒకరిద్దరు నాయకులొచ్చి రోడ్డుకు వీలైన స్థలం చూసిపోయారు ఎవరో కాగితాలమీద రోడ్డు గీసుకుపోయారు.

ధనికరైతులు వారి పొలాల్లోంచి రోడ్డువేయడానికి ప్రతిఫలం అడక్కుండానే జాగాచూపించారు. వారి ఉదారస్వభావం గురించి బడిపంతుళ్లు పిల్లలకు పాఠాలు చెప్పారు. ఊరుకు సేవచేయడమంటే దేశసేవ చేసినట్లే అని హితోపదేశం చేసారు. లాభపడేది ఎవరు మనమే అన్నారు. ఊళ్లో చాలామంది లాభపడేది మనమే అని చెప్పుకోసాగారు.

ఒకేఒక ఎకరం పొలమున్న రామిడి నర్సయ్య మాత్రం పానకంలో పుడకలా రోడ్డుకట్టం పడ్డాడు. రోడ్డువేస్తే ఎకరాన్ని రెండుగాచీల్చాలి. నీళ్లు అందటంకష్టం. కాలవతెగిపోతుంది. ఆమాటే పెద్దమనుషుల్తో అంటే, "ఇది నీకు న్యాయంగాదు. నీ ఒక్కడివల్ల వూరికే నష్టంవస్తుంది. ఎలాగో సర్దుకోవాలి నీళ్లకావాలంటే మా పొలాల్లోంచి ఇస్తాం" అన్నారు, కాని రామిడి నర్సయ్య ఒప్పుకోలేదు. తన ఎకరాన్ని చీల్చడానికి వీల్లేదన్నాడు. పేదవాణ్ణి కష్టాల పాలవుతానన్నాడు. మీ అందరి కాళ్లు మొక్కుతానుగాని నాకన్నతల్లిని చంపొద్దూ అన్నాడు. కడుపుమీద కాలు పెట్టొద్దూ అన్నాడు. అనీ అనీ లాభంలేకపోతే తనపక్క భూస్వామి ఎకరం లోంచి ఎకరం ఇచ్చి తనదాన్ని ఏమైనా చేసుకోమన్నాడు. కాని ఆభూస్వామి అందుకు అంగీకరించక

తగినదబ్బులిస్తాం ఎక్కడైనా కొనుక్కోమన్నాడు, రామిడి నర్సయ్య దేనికీవొప్పుకో లేదు. ఆయనిది ఒకటేపాట. 'నా ఎకరాన్ని చీల్చకండి!

చివరకు ఆయన నాలుకనేచీల్చినట్లు ఆ ఎకరాన్ని చీల్చి రోడ్డువేసారు. శ్రమదానం ఫోటోలు తీయబడి పేపర్లో అచ్చుపడ్డాయి. పెద్దమనుషులు తమ జీత గాండ్లకు, కూలివాళ్ళకు అవిచూపిస్తే, వాళ్ళముఖాల్ని చూసుకొని క్షణకాలం సంతో షించారు. తెల్లారితే కూలిదొరకదనేబాధ వాళ్ళ గుండెల్ని పిండుతూనే వుంది. రెండు మూడు మాసాల్లో అయిదారు ట్రాక్టర్లు దిగాయి. రోడ్లనుచూసి బండ్లు కొన్నవాళ్ళ గొంతులో వెలక్కాయపడింది. కూలివాళ్ళకూట్లో రాయిపడింది. ఏదో ఒకరూపంలో అందరూ ఇంతో అంతోతినే గ్రామసంపద కొందరికే భుక్తమైంది. రామిడినర్సయ్యకు పక్కభూస్వామి నీళ్లు ఇవ్వటం మానేశాడు........ కూలిజనం భూస్వాముల్తో, ధనిక రైతుల్తో ఘర్షణపడుతున్నారు. చూడండి దేశంపురోగమిస్తుంది. ఉదాహరణకు మన గ్రామమేచాలు. రోడ్డువల్ల మనందరికీ లాభముంది, అని పిల్లలకు పాఠాలు బోధించబడుతున్నాయి. చిన్న సంఘటన జరిగినా పోలీసు వ్యానులు సరాసరిగా శాంతి భద్రతలు కాపాడేందుకు గ్రామంలోకే వచ్చి వాలుతున్నాయి.

[చెరబండరాజు అముద్రిత రచనల్లో అక్కడక్కడా చిరిగి ఈ రచన దొరి కింది. రచనాకాలంకూడ తెలియదు. ఏమిరాసివుంటాడో ఊహించలేని చోట చుక్కలుపెట్టి వదిలేయడంజరిగింది.

— సా. మి.]

మా పల్లె

పైరగాలికి వేడి నెత్తురొచ్చిందంట
పలుగురాళ్ళకు ప్రాణమొచ్చిలేచాయంట
ఎండు పుల్లలు గుండె నడిచాయంట
మా పల్లె ఎరిమల్లె వాగాయెనా
పెద్ద ఏటిని కొత్త అలలేచెనా
పెద్ద ఏటిని........

ఎర్ర చీమలబారు జోరు హెచ్చిందంట
గబ్బిలమ్మలు చీకటింటి కెళ్ళాయంట

పడగ పాముల గడప గడప నిలిపాయంట
మా పల్లె ఎదనింత పగరగిలెనా
కొండచిలువల గుండె దిగజారెనా
కొండచిలువల........

చెట్టుచేమలు పిలిచి పండ్లు పంచాయంట
మేకపిల్లలు మంచి పాలుతాపాయంట
అడవులూ గుట్టలు అండనిచ్చాయంట
మా పల్లె వెలుగుబిడ్డల గన్నదా
కడుపులో దాచుకుని కలగన్నదా
కడుపులో........

మొసళ్ళు ఏటిపై తూట్రిమోపాయంట
కత్తి కెరటాలతో ఏరు కదిలిందంట
కత్తిపీటలా పేట కదిలి వచ్చాయంట
మా పల్లె అంకుశమ్మై నిలిచెనా
అలవేటుకే గట్టు జలపట్టెనా
అలవేటుకే........

కాకిమబ్బులు పల్లె కమ్ముకున్నాయంట
మబ్బు కొవ్వును మెరుపు లొరిసి కోసాయంట
గూనిమబ్బుల ఉరుము లదరగొట్టాయంట
మా పల్లె పిడుగులై వర్షించెనా
పాడుగోడలు కూలి పడిపోయెనా
పాడుగోడలు........

పక్కపల్లెలు ఎరుపు పాటందుకొనెనంట
బక్కజీవుల రక్త మెతుపెక్కినాదంట
పల్లెపల్లెను మంటలంటుకున్నాయంట
మా పల్లె విప్లవాగ్నుల కలిసెనా
నా తల్లి పోరాట జెండెత్తెనా
నా తల్లి............

కథ

శాంతి (?)

'ఇదో వెధవగేటు'

విసుక్కుంటూ పైనుంచి ఎడమచేయిచాచి గొళ్లెంతీసి, సైకిలు రోడో గోడవారగానించోబెట్టి, తాళంవేసి ఇంటితాళం తీశాడు రాజు.

చెప్పుకింద కప్పలా ఇన్‌లాండ్ లెటర్.

నరసింహారావు రాసివుంటాడు ఇంకెవరు రాస్తారు? మాటిమాటికి నన్ను డబ్బు అడగకుమని గట్టిగానే రాసివుంటాడు. ఇంకెవరు రాస్తారు? ఇవ్వాళ ఎనిమిది పదోతేది దగ్గరపడ్డది. ఈమారు ఎవరూ మర్యాద దక్కించరు.

పుస్తకాలు స్టూలుమీదపడేసి కుర్చీలో జోగుపడ్డాడు.

బయట ఎవరిదో దగ్గుచప్పుడు. గుండె జల్లుమంది.

దగ్గుతూరావడం నాగయ్య అలవాటు. రెండునెలలవడ్డీ నూటికిపది నాలుగు పందలకు ఎనభైరూపాయలు ఇవ్వాలి. ఇవ్వాళ సాయంకాలం ఇస్తానన్నాడుతను. ఇవ్వక పోతే ట్రాన్సిస్టర్ పట్టుకుపోక తప్పదన్నాడు నాగయ్య.

పక్కింటి మేడమీద ఎవరో కొత్తమనిషి. ఆకాశంలో వానమబ్బుల్ని చూస్తూ ఆనందిస్తున్నాడు. పక్కింటి చుట్టమేమో! దగ్గుచప్పుడువిని సగంనీరసించి మెల్లిగా వచ్చి మళ్ళీకుర్చీలో కూర్చున్నాడు. ఉత్తరం విప్పబుద్ధిగాలేదు. కానీ విప్పకతప్పదు.

"బావా! పదోతారీఖు ఉదయం తొమ్మిదిగంటల బస్సుకు అక్కయ్యను పంపిస్తున్నాను. సవిత, కిరణ్ ఇక్కడే వుంటారు. వాళ్ళ అమ్మమ్మకు వాళ్ళతో బాగా పొద్దుపోతుంది. అక్కయ్యను, సెలవేణినీ, బుజ్జిగాణ్ణీ పంపిస్తున్నాను. అబ్బో ఏం అల్లరి! బుజ్జిగాడు తండ్రినే తలదన్నేశాడు."

'ఏడ్చాడు' ఉత్తరంమడిచి జేబులోపెట్టుకున్నాడు రాజు. మహేశ్వరి వస్తుందన్న మాట. ఇంకో ఆర్నెల్లు అక్కడేవుంటే ఏం కొంపమునిగేది? అప్పుడేరావాలా? ఎంతో చెప్పిపంపానే, పురిటికీపోతే నాలుగురాళ్ళు అప్పుతీర్చొచ్చు అనుకుంటే, వడ్డీలకు వడ్డీలుకట్టడంతోనే జీతంకాస్తా హరించిపోయింది. ఇప్పుడు వాళ్ళువస్తే, ఎన్నని తేవాలి? అన్నింటికి మళ్ళీ అప్పుచేయాలి! ఇంకెవడిస్తాడు? అన్నమాట నిలబెట్టుకుంటూవుంటే అయిదోపదో చేబదుళ్లయినా దొరికేవి. ఇహ లాభంలేదు. ఈ జీవితానికిక విముక్తిలేదు.

రెండునెల్లుగా ఇంటికిరాయికట్టలేదు. తబదబ గేటుచప్పుడుచేస్తూ వాడువస్తాడు. ఇవ్వాళో రేపో! ఎప్పుడొస్తాడో ఏమంటాడో! ఎందుకు తనకు అప్పులు పెరిగాయి! ఏ సుఖాలకోసం తగలేశాడు? లేదే! సిగిరెట్టు తప్పిస్తే తనకు ఏవ్యసనమూ లేదు. తన మొండిధైర్యమే తన్ను కాల్చుకుతింటోంది. పాపం, మహేశ్వరి! ఎన్నాళ్ళని ఈ నరకయాతన అనుభవిస్తుంది! ఎంత జీతమొచ్చినా, బియ్యానికీ, కూరగాయలకే సరిపోవడంలేదు. వడ్డీలెలా కట్టేది? అప్పులెలాతీర్చేది?

చదువు, చదువు అని స్కూళ్ళో ఉద్యోగంచేస్తూ పట్నంలో కాపురంపెట్టి అప్పుచేసి ఏం వెలగబెట్టాను? చేతికొచ్చినడిగ్రీ చెల్లెలిపెళ్ళి అప్పుడంటే తక్కువ జీతం. ఇప్పుడు కొంచెం మెరుగే అయ్యిందే! కానీ అప్పులు పెరిగాయి. ఏడాదికిత్రితం రెండువేలుంటే ఇప్పుడు నాలుగువేలు. అప్పులిచ్చేవాళ్ళకి రెట్టింపులాభాలు. వడ్డీ వ్యాపారం ఏంచక్కని బంగారుపంట! ఎవడి కొంపోముంచి ఎవడి కాళ్ళోపట్టుకొని ఈ వ్యాపారంచేస్తే ఈ చాలీచాలని పంతులు ఉద్యోగంకన్నా హాయిగా బతకొచ్చు. కానీ, నమ్మిఇచ్చేదెవుడు? పైగా ఈపిల్లలు. వద్దురోబాబో అంటుంటే కొడుకు కావాలి ఇంకొక్కబిడ్డతో చాలిద్దామంది మహేశ్వరి, ఏం మమకారమో! ఆడవాళ్ళకు అన్నింటిమీదా అత్యాశే.

ధర్మయ్య ఇవ్వగలవాడే. నూటికిపది వడ్డీవ్యాపారం. గొడ్లచావిడిలో నిగనిగలాడే అయిదుగేదెలు. రేషన్‌కోట్లోవాటా. చాలాడబ్బుంది. పిల్లలులేని అశాంతి(తో) కొట్టుకుచస్తున్నాడు. ఎవడికిపెడ్తాడు? కానీ అతనికే తను పదిహేను వందలివ్వాలి. రెండునెల్లవాయిదా ఈఫస్టుతో తీరిపోతుంది.

ఛీ ఛీ పరిమిత్రునికీ తనుటాకీ. కొత్తపాతాలేదు తనకి. డబ్బు స్నేహాన్ని కలిపింది. విడగొట్టింది. కొత్తవాళ్ళని ఎక్కడినుంచి పట్టుకురావాలి?

మహేశ్వరివస్తుంది. పిల్లలొస్తారు.
బయట గేటుచప్పుడు.

అద్దెకోపం రాలేదుగదా యజమాని! జేబులో ఇరవై రూపాయలులేవే! రాజు గబగబా బయటికొచ్చాడు.

...."కొంచెం ఈ అడ్రెసు ఎక్కడో చెప్పండిసార్."

నాకు తెలియదు అనబోయి చీటిచూసి "మిమ్మల్ని ఎక్కడో చూసినట్లుందే" అన్నాడు రాజు, గుర్తుకు తెచ్చుకుంటూ.

"ఒకసారి నాగయ్యగారిదగ్గర చూసారండీ. నేనూ మీరూ ఒకరోజే అప్పు తీసుకున్నాం ఆయనదగ్గర."

"ఆఁ అలాచెప్పండి."

"మీ అప్పు తీరిందాండీ ?

గుండెలోనే కొట్టుకుంటున్నాయి మాటలు. అప్పులేనివాణ్ణిచూస్తే మనసారా కౌగిలించుకోవాలనిపిస్తుంది. బ్రహ్మాండంగా అతణ్ని వీధివీధీ ఊరేగించి సన్మానం చేయాలనిపిస్తుంది.

రాజు ఒకసారి దీర్ఘంగాఆలోచించి "క్షమించండి. ఆ పక్కకొట్లో అడగండి" అన్నాడు వెనక్కితిరుగుతూ.

సైకిలు భద్రంగానేవుంది. ఇక్కడ ఇలాగేపెడితే రాజుఉన్నాడని ఏ అప్పులోడైనా రావచ్చుననుకొని, ఆలోచనరావడమే తరువాయి సైకిలుతెచ్చి ఇంట్లో పెట్టాడు.

రాజు ఇంట్లోకిచూస్తూ స్కూటరుమీద ఓ మీసాలపెద్దమనిషి జోరుగా వెళ్ళిపోతున్నాడు.

ధర్మయ్యకుకూడా స్కూటరుంది. ఒకనాటికి అతను కారుకూడా కొంటాడు. అప్పటికి సైకిలుకూడా వుంటుందో లేదో తనకి !

ఎం. ఎ. ప్యాసైతే ఏంలాభం? ప్రమోషన్‌కోసం చీమల్లావున్నారు పంతుళ్లు.

దగ్గుతోవచ్చే నాగయ్య.

స్కూటర్‌తో ధర్మయ్య.

గేటుచప్పుడుతో ఇంటి యజమాని.

నిద్రలో, కలలో, పెండ్లాంపక్కలో, ఎక్కడున్నా, తనకు యమలోకాన్ని గుర్తుకుతెస్తారు. మహేశ్వరికికూడా తన భయాలే, తన అనుమానాలే వచ్చాయి. రేపు ఇవి పిల్లలకురావని ఏమిటినమ్మకం?

పిల్లల్ని ఎట్లాపెంచేది? ఒక్కరా ఇద్దరా? ముగ్గురు. ఈరోజుతో ఈసమస్య తీరిపోతుందని ఎలానమ్మేది?

గుడ్డలిప్పదీసి టీ కోసం నీళ్లుపెట్టాడు.

రాజు మనసు చీదరచీదరగావుంది. క్షణక్షణం గుండెజారి కిందపడి అద్దంలా ముక్కలై చెల్లాచెదరవుతుందనిపిస్తుంది.

గంటకు ఒక్కక్షణం.... ఒకే ఒక్కక్షణం.... మానసికంగా తీరికదొరికితే బాగుండును.

రోజుకో అరగంట శాంతి.

లేదు. తనకీ పేదరికంలో అప్పులబతుకులో ఈ ఉద్యోగంలో శాంతి లేదు. బళ్ళోపాఠాలు చెప్పలేక, పిల్లల అల్లరి భరించలేక తల బద్దలైపోతుంది. నడిచినా, కూర్చున్నా, నిద్రపోయినా, కలలో, మెలకువలో, అప్పులే అప్పులు, అశాంతి. శాంతి, నీఖరీదు ఎంత ? ఈ తుఫాను ఆగేదెప్పుడు ? ఈ బతుకులో ఇక శాంతి దొరకదు.

తనలా ఎందరు దౌర్భాగ్యులో!
బత్తుల స్టౌమంట టీపాత్రని నిర్దాక్షిణ్యంగా నలుపుచేస్తుంది.
తన మనసు అంతకన్నా అధ్వాన్నంగానే వుంది.

టీలో చక్కెరకలుపుతూ స్టౌ ఊదబోయాడు. ఎంతకూ ఆరిపోదే! రెపరెప మంటుంది. వూరుకుంటే మండుతుంది.

ఈ జీవి ఎలా పోతుందో !
కోపంగా గ్లాసెడు నీళ్ళు కుమ్మరించాడు.
ఈ ప్రాణం ఇలాగే చల్లబడి ఆరిపోతే బాగుండును.
ఇంతకన్నా వృద్ధాప్యం ఇంకేముంటుంది?
"సార్ !"
టీకప్పుతో బయటికొచ్చాడు రాజు.
స్టూడెంటు
"రెండు లెక్కలు రావటం లేదండి చెప్తారా సార్?"
"రారా. టీ తాగుతావా ప్రభాకర్ ?"
"వద్దుసార్ టిఫిన్‌చేసి కాఫీ తాగొస్తున్నా."
"ఇప్పుడే చెప్పాలా?"
ప్రభాకర్ తటపటాయించి, "మీకు పనుంటే రేపొద్దునొస్తానండి" అన్నాడు.
"సరే అట్లాగేచెయ్ ఏడుగంటలకల్లా వచ్చేసెయ్."

"సరేనండి"

ప్రభాకర్ వెళ్ళిపోయాడు.

నిజానికి తనకేమీ పనిలేదు. ఉన్న పనల్లా అప్పలాళ్ళనుంచి తప్పించుకు తిరగడమే. ప్రోగ్రెసుకార్డులు పూర్తిచేసి పట్టుకురమ్మన్నాడు హెడ్మాష్టరు.

అది చేసెయ్యాలి.

కానీ, ఇంట్లోవుంటే నాగయ్య, ధర్మయ్య, అద్దెకోసం ఇల్లుగల్లాయన, ఎవరొస్తారో ఏమో!

లైటు వేశాడు.

క్షణం ఆలోచించి తలుపులేసి, బయటగొళ్ళెం, లోపలినుంచే స్టూలుమీద నిలబడి ద్వారబంధంమీది ఇనుపచువ్వల సందుల్లోంచి పెట్టేశాడు.

ఎవరైనా చూస్తే?

గుండె దడదడలాడింది. ముచ్చెమటలుపోశాయి. కాళ్లూ చేతులూ గడగడా వొణికాయి. నిట్టూర్చుతూ కుర్చీలో కూర్చుండిపోయాడు.

బాగా రాత్రి అయ్యాక తియ్యొచ్చు. ఈ దినం గడిస్తే రేపుచూసుకోవచ్చు. దమ్మని వర్షంపడితే బాగుంటును.

దగ్గు
గేటుచప్పుడు
స్కూటర్
ఎవరొచ్చినా లేడని తిరిగిపోతారు.
తెల్లవారాలి
బాగా వర్షంకురవాలి.

*   *   *   *

"ఇంతవర్షంలో వచ్చారే, బాగా తడిసిపోయారు."

"మాకు వర్షంఏమిటి? తుఫానేమిటి? రాజుగారిదర్శనం దొరికినేకాదుగా!"

"మహేశ్వరీ! కాఫీపెట్టు. ధర్మయ్యగారూ వాళ్లావిడావచ్చారు."

వంటగదిలాంటి గుహలోంచి బుజ్జిగాణ్ని ఎత్తుకొని వచ్చింది మహేశ్వరి ధర్మయ్యగారి ధర్మపత్ని బాబును తీసుకుంటూ, "చాలా ముద్దొస్తున్నాడమ్మా నీ కొడుకు. కాఫీగీఫీ ఏమీవద్దు. ఇంటికివెళ్తాంకదా" అంది.

"కాదుకాదు, కాఫీపెట్టు మహేశ్వరీ!.... ఇక్కడకూర్చోండి", తను స్టూలు మీద కూర్చుంటూ కుర్చీ చూపించాడు ధర్మయ్యకు.

పైకప్పు అవీచూస్తూ "రాజూ! రెండునెల్లవాయిదా అయిపోయింది. అయిదంటే పది, పదిహేనంటే పదిహేను ఏతారీఖంటే ఆ తారీఖుక్కవస్తున్నాను, పోతున్నాను. స్కూటరు నీళ్ళతోనడిచేదైతే ఎన్నిసార్లైనా వచ్చేవాణ్ణి. మాకేం పను లుండవనుకున్నావా మీ ఇంటిచుట్టూ ప్రదక్షిణం చేయడానికి?" కొంచెం కటువుగానూ, కొంచెంమెత్తగానూ అన్నాడు ధర్మయ్య.

రాజుకు నోరులేదు.

"అదికాదండీ. మా ఆవిడకు ఈ కాన్పు చాలాకష్టమైంది. ఖర్చుకూడాజాస్తిగానే అయ్యింది. ఇంకొక్కనెల ఆగండి," అబద్ధం చెప్పకతప్పలేదు రాజుకు.

"కాన్పూకాన్పూ! కంటానికేమిటి, యాడాదికి రెండుసార్లయినా కంటారు. నా పైసలు నాకిచ్చేసెయ్, పోతాను."

తనకు పిల్లలులేనికోపమంతా బయటపడింది ధర్మయ్యగారిమాటల్లో. రాజు చాలా నెమ్మదిగా తెచ్చిపెట్టుకున్ననవ్వుతో "ఇది అదనంగావచ్చిన ఖర్చండి" అన్నాడు.

"అదనంగా ఎందుకు కనాలిమరి?"

తనోకప్పుతీసుకొనివస్తూ, "బాగానేవున్నారు. కంటారు చంపుకుంటారు వాళ్ళ ఇష్టం. మీపైసలేమో మీరుఅడగండి అవన్నీ మనకెందుకు?" అంది.

మహేశ్వరి కాఫీతెచ్చి రాజుకందించింది. రాజు కిందనేపెట్టేశాడు. "కొడుకు ఒక్కడేగదండి. వాడుకాస్తా గుటుక్కుమంటే ఇంకేందిక్కని.... ఏదోదేవుడు దయదల్చాడు" మహేశ్వరి సిగ్గుతో కలదించుకుంది.

"పిల్లలులేక మేం చస్తున్నామా? గొంగడున్నంతవరకే కాళ్ళుచాపుకోవాలి." ధర్మయ్యగారు అంటున్నమాటలు నిజమేఅనిపిస్తున్నా, రాజుకు కొరడాకొట్టినట్టుగా తగుల్తున్నాయి.

"పోనీ ఇంకో నాలుగురోజులు టైం ఇవ్వండి. నావల్ల ఇక మీకుబాధవుండదు.

"అంటే చస్తావా ఏమిటి?"

"ఛ ఏంమాటలు? రాజుగారూ ఎలాగో ఒకలాగు తెచ్చిఇవ్వండి. మహేశ్వరిని బాబును చూసిపోదామని వచ్చాం పదండి."

భార్యమాట పాటించాడు ధర్మయ్య. మౌనంగాలేస్తూ.

"కాస్సేపాగి వెళ్ళండి. వానతగ్గలేదు." రాజు పిల్లగొంతు.

"నీకోసం రోజూ చూస్తూవుంటా.... పదవే". ధర్మయ్య గేటుదాటి స్కూటర్ స్టార్ట్ చేశాడు. ఆ చప్పుడులో రాజుకాళ్లు తీగలా వొణికిపోయాయి.

"చూడండి, బుజ్జిగాడు ఎట్లా నవ్వుతున్నాడో!" మహేశ్వరి కొడుకును అందివ్వబోయింది రాజుకు.

అవునే వాడు నవ్వుతున్నాడు, ఎందుకో తెలుసా? నన్నుచూసి నా దౌర్భాగ్యాన్నిచూసి. వెళ్లవెళ్ల. నన్ను కాస్త ప్రశాంతంగా కూర్చోనివ్వు".

వీడిపేరు ప్రశాంతండి. ఎత్తుకుంటే అన్నీ మరిచిపోతారు." రాజుకు నవ్వూ దుఃఖం రెండూవచ్చాయి. గబుక్కున బాబును చేతుల్లోకి తీసుకొని మెడ బుగ్గలూ బుచ్చిబుచ్చి వేళ్లూ అరచేతులూ గట్టిగా ముద్దుపెట్టుకున్నాడు రాజు.

"మన మీ ఇల్లు ఖాళీచేసెయ్యాలి మహేశ్వరీ."

"ఎందుకండీ?"

"శాంతి కోసం".

"నాకర్థంకాలేదు"

"కాదు- నీలవేణి తినేపడుకుందా?"

"ఆఁ"

* * * *

తెల్లారిపోతుంది.

దొర్లిదొర్లి పక్క-టెముకలు నొప్పిపెడుతున్నాయి. కళ్ళు గరగరమండుతూ బరువెక్కాయి. రాజుకి నిద్రరావడంలేదు. మహేశ్వరి, నీలవేణి, బాబు వొళ్ళు తెలియకుండా నిద్రపోతున్నారు. సన్నగా వర్షంపడుతూనేవుంది. చలిగాలి రివ్వున వీస్తోంది. గేటుచప్పుడు వినిపిస్తూనేవుంది. కిరాయికట్టలేదు. ఇంటియజమాని పొద్దు పొడవకముందే వస్తాడోఏమో! నాగయ్యెందుకురాడు! ధర్మయ్యకు తన మాటమీద నమ్మకంలేక అతనూ వస్తాడోఏమో!

ఏమో! చెల్లెలు హాయిగానే వుండొచ్చు. అన్న అప్పులబాధ ఆమె కెందుకర్థమవుతుంది? ఈ రోజుల్లో ఎవరి బాధలు ఎవరు సానుభూతితో వింటున్నారు!

మనిషి మనిషికీ మధ్య పోటీ ఒకడి తలమీంచి ఒకడు నడిచిపోవాలని, ఒకడిదగ్గర ఎంత వీలైతేఅంత, ఏరకంగా వీలయితే ఆరకంగా, గుంజుకు తినాలని, సుఖంగా హాయిగా శాంతిగా బతకాలని. స్నేహాలు, ప్రేమలు, బంధుత్వాలు అన్నీ వడ్డీబండల కింద, అప్పుల రథచక్రాలకింద. తనకిక మోక్షంలేదు. ఎలా ఎలా ? ఈ వల యాన్ని ఎక్కడ ఎలా ఛేదించాలి ? నిద్ర రాంతి.

*　　*　　*　　*

అయ్యగోరూ, కిటికీ వూడ్చుతుంటే, అంచుమీద ఈ ఉత్తరం దొరికింది". పళ్ళుతోముకుంటున్న ధర్మయ్య పేస్టుఉమ్మేసి "ఇదెక్కడి కవరు ఇంతపొద్దున్నే ! ఏమే ఇలారా !" అంటూ గబగబా విప్పాడు.

"ధర్మయ్య గారికి !

హృదయపూర్వక నమస్కారాలు. నేనిక ఈ జీవితంలో మీ అప్పుతీర్చలేను. ప్రతినెలా ఎంత ప్రయత్నించినా వడ్డీకూడా చెల్లించలేకపోయాను. ఇకముందు చెల్లిస్తానన్న నమ్మకంలేదు. నన్ను మనసారా క్షమించండి. ఇక ఎప్పుడూ మా యింటికి రాకండి. నేను రేపే ఇల్లుఖాళీచేస్తున్నా. బతికుంటే ఎప్పుడైనా కలుసుకుందాం. మా గుండెలు బండబారినై. మా మాటలకు విలువలేదు. అబద్ధాల మయ్యాం. ఇచ్చినవాడికీ తీసుకున్నవాడు ఎప్పుడూలోకువే. మాకెంత మానవత్వం ఉన్నా, వడ్డీగట్టకపోతే గంగలోకలిసినట్టే. నన్ను కలుసుకునే ప్రయత్నంచేయకండి. మీ కాళ్లపట్టుకుంటాను. మమ్మల్ని మరిచిపోండి. నాకు ఏ ఆస్తివుందని మీకు రాపివ్వను. ? ఈ జీవితంలో నలుగురు పిల్లల్నిమాత్రం సంపాదించాను. వాళ్ళే నా ఆస్తి, నా సర్వస్వం, నా ప్రాణం. ఇంకేంరాయను ? అమ్మడంకాదు. తాకట్టు పెట్టడంకాదు. మీకు శాంతికలిగితే సంతోషిస్తాను. మీ గొడ్లచావిడికి పరిగెత్తండి. చలిలో వొణికిపోతుంటాడు బుజ్జిగాడు.

మమ్మల్ని కలుసుకోవద్దని, ఈ రకంగానైనా నన్ను ఋణవిముక్తుణ్ని చేయమని ప్రార్థిస్తూ-

మీ

రాజు."

[రచనాకాలం : 9-8-1973]

సృజనలో చెర

ఏమిటుద్ధరిస్తారండీ....	78/79	ఏప్రిల్/మే	'78	50
గోదావరి పొరలుతోంది	85	నవంబర్	'78	వెనుకకవర్
హమాలన్న	87	జనవరి	'79	82
మళ్ళీ వస్తున్నాయి మనఊరికి (పునర్ముద్రణ)	98	డిసెంబర్	'79	64
కొలిమంటుకున్నది (పునర్ముద్రణ)	100	ఫిబ్రవరి-మే	'80	3
ఎండావానలలోన	108	అక్టోబర్	'80	8
ఎర్రెర్రని తెలంగాణా	132	అక్టోబర్	'82	4

(సృజనలో ప్రచురితమైన కవితలరీత్యా చెరబండరాజుది ప్రథమస్థానం. 100వ సంచికలోకూడా ఈ విషయం గుర్తించటం జరిగింది. తొలి ప్రచురణలైనా, పునర్ముద్రణలైనా కలిపి సృజనలోవచ్చిన చెరబండరాజు కవితలసంఖ్య 30)

సమీక్ష :

చైతన్యతరం పిలుస్తోంది 'విప్లవం వర్ధిల్లాలి' కవితా సంకలనం-	42/43	మార్చ్/ఏప్రిల్ 73	54

నాటిక :

టెంపరరీ లేబర్	46	జులై	'73	5

చెరపై సృజనలో

కవిత :

కాళోజీ - చెరబండరాజు -	124 -	ఫిబ్రవరి	'82	వెనుకకవర్
'సుమనశ్రీ' - జీవనది -	125 -	మార్చి	'82	67
జె. శిల్పి - చెరబడ్డరాజు -	127/128 -	మే/జూన్	'82	33
లక్ష్మారెడ్డి - కవులు జెండాలైనవేళ -	129 -	జులై	'82	3
నారాయణరావు - లే చెరా! లేచిరా!-	129 -	జులై	'82	62

పుట

వ్యాసం :

సమీక్ష :

సాహిత్య సంచలనం :

ఫోకస్ :

ప్రకటన :

తీర్పు :

సంపాదకీయం :

కవర్ :

127/128 - మే/జూన్ '82 సంచిక కవర్ ఆస్పత్రిలో చెరబండరాజు
- జులై '82 సంచిక కవర్ చెరబండరాజు.

అచ్చుకానికి సిద్ధంగా ఉన్న

చెరబండరాజు పుస్తకాలు

1. చెరబండరాజు కవితలు - పాటలు - విజయవాడ పీపుల్స్ బుక్స్ ప్రచురణ రు. 6.00
2. కత్తిపాట - (పాటలసంకలనం) - విరసం ప్రచురణ రు. 4.00
3. గ్రామాలు మేల్కొంటున్నాయి (నాటకాలు-నాటికలు) - విరసం ప్రచురణ రు. 8.00
4. నా జీవితరేఖలు - విరసం ప్రచురణ రు. 2.00
5. మాపల్లె - నవల రు. 4.00
6. ప్రస్థానం - నవల - నవోదయప్రచురణ రు. 14.00
7. నిప్పురాళ్ళు - నవల - దేశీబుక్‌హౌస్ ప్రచురణ రు. 15.00
8. పల్లవి - (కవితాసంకలనం) రు. 1.50

వీటిలో 1 నుంచి 4, 8 పుస్తకాలు సృజన, హనుమకొండ, 506 001 దగ్గర గానీ, పీస్ బుక్‌సెంటర్, 4-5-421, సుల్తాన్‌బజార్, హైదరాబాద్ 500 001 దగ్గర గానీ దొరుకుతాయి. 5, 8 పుస్తకాలు శ్రీమతి శ్యామల, 11-14/2, రామంతపూర్, హైదరాబాద్ 500 991 దగ్గర దొరుకుతాయి, 6, 7 పుస్తకాలు ఆయా ప్రచురణకర్తల దగ్గర దొరుకుతాయి.

SRJANA is commended for use in Public Libraries in the State by the Director of Public Libraries, Andhra Pradesh, Hyd. Vide Ref. No. 182/A4/67, dated 22 9-1967.

Prited, Edited & Published by P. Hemalatha for 'Sahithee Mithrulu'
Printed at Navatha Printers J. P. N. Road, Warangal - 506 002
for Venkataramana Mudranalayam, Warangal
Working Editor: Varavararao

